
ఆంధ్ర సచిత్ర వార పత్రిక
26-8-83
150 పైసలు



MCA-TDB-52-TEL

పాఠకులు, రచయిత(త్రు)లకి ఏజంట్లు, ప్రకటనకర్త లందరికీ మా స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు. —సం॥

ముఖచిత్రం

29–7–83 సచిత్ర వారపత్రిక ముఖచిత్రం మాధవి ఫోటో చాలా అందముగా ఉన్నది.

కె. శ్రీనివాసులు (కడప)

* * *

అట్టపై బొమ్మ ''శ్రీ వెంకటేశ్వరస్వామి'' చాలా బాగుంది. ఇంకా యిట్లాగే దేవుని బొమ్మలు ప్రచురిస్తారని ఆశిస్తూ యున్నాను.

గుణుపూరు శ్రీనివాసరావు (బొబ్బిలి)

లాస్ట్ జడ్జిమెంట్

ఈ వారం ఆంధ్రపత్రికలో ప్రచురించిన 'ది లాస్ట్ జడ్జిమెంట్' అనే కథ ఆర్. వి. చలం గారి 'మాట తప్పకు' నాటకానికి అనుకరణ. ఇటువంటి రచనలు ప్రచురించకండి.

మధుభాషిణి (విశాఖపట్నం)

రచయిత సమాధానం

నేను వ్రాసిన ''లాస్ట్ జడ్జిమెంట్'' కథ శ్రీ ఆర్. వి. చలంగారి 'మాట తప్పకు' అనే నాటకానికి 'అనుకరణ' అని కుమారి కె. మధుభాషిణిగారు చేసిన ఆరోపణకు విస్మయం చెందాను.

నేను తరచూ కథలు వ్రాసే రచయితని కాదు. అడపాదడపా, యేదైనా వక సంఘటనకు స్పందిస్తే తప్ప, కథలు వ్రాసే అలవాటు లేదు.

లోగడ వివిధ పత్రికలలో ప్రచురితమైన నా రచనలు : 'అమెరికా సంబంధం', 'మారిన ధర్మం', మినీనవల 'తరాలు — అంతరాలు', ''రాబీస్'' అనే కథ వక్కసారి సింహావలోకనం చేస్తే, నా గురించి యెవరికైనా వక అవగాహన రాగలదు.

గత రెండు దశాబ్దాలుగా వుద్యోగ రీత్యా ఆంధ్రదేశానికి దూరంగా వుంటున్న మేము ''మాట తప్పకు'' అనే నాటకాన్ని యెన్నడూ చూడలేదు; చదవలేదు; కనీసం దానిని గురించైనా వినలేదు !

నేను చదువుకొనే రోజుల్లో జరిగిన వక కులాంతర ప్రేమ వ్యవహారం, తత్సంబంధమైన ఆత్మహత్య ''లాస్ట్ జడ్జిమెంట్'' కు ప్రేరణ !

ఇటీవల కాలంలో ఆంధ్ర వార పత్రికలో ''ధర్మో రక్షతి రక్షితః'' సీరియల్ నవల మీద 'రిజర్వేషన్స్'కు సంబంధించి చెలరేగిన ఉత్తర దుమారం కూడా, నాకు మరికొంత ప్రేరణ



కలిగించిందనీ, యీ కథారచనకు కారణమైందనీ చెప్పగలను !

'లాస్ట్ జడ్జిమెంట్'ని వక చక్కని కథగా మలచడానికి అనేక వారాలు మా సోదరుడు, నేను తరచితరచి, చర్చించి రూపొందించాము. ఇది కేవలం మా స్వంత రచన తప్ప దేనికీ అనుకరణ, ఆధారం కాదని మరోసారి మనవి చేస్తున్నాను.

సాహిత్య పరిశోధకులు యీ విషయాన్ని పరిశీలించి, పరిశోధిస్తే నాకు చాలా సంతోషం !

రచయిత (మదరాసు)

" భ య ం "

''న్యూఢిల్లీ లేఖ''లో ''బాగుపడటం అంటే ఎందుకింత భయం ?'' గురించి డా॥ శ్రీ జయ్‌దుబాషీగారు తెలియని ఎన్నో విషయాలు తెలియజేశారు.

ఎమ్. రాజేంద్రప్రసాద్ (అల్లూరుపేట)

వినువీధిలో జెండ !

వినువీధిలో ఎగురు—
చున్నది మన జెండ
ఆగష్టు పదిహేను
''స్వాతంత్ర్య జెండా !''

ఆంగ్లేయ పాలనలో
అణగారి నట్టి మన—
భరత జాతికి ''ముక్తి''
తెచ్చినట్టిది జెండ !

స్వాతంత్ర్య సముపార్జ—
సమరాన సమిధలుగ
కాలి కూలిన త్యాగ—
ధనుల గుర్తు జెండ !

భారతీయుల మంత
కలసి కట్టుగ వుండి
మన జాతీయ జెండాకు
చేదాము వందనము

జై భరత మాతా !
జై భరత మాతా ! !
జై భరత మాతా ! ! !

వినువీధిలో ॥

— పి. వి. మూర్తిరాజు (లిబియా)

జీవన్మృతులు

''జీవన్మృతులు'' సీరియల్ ముగింపు చాలా బాగున్నది. నటి మాధవి ముఖచిత్రము చాల ఆకర్షణీయముగాయున్నది.

ఇ. వై. గిరి (ఖమ్మం)

* * *

మీరు ప్రచురించిన ''జీవన్మృతులు'' సీరియల్ నవల చదువుతున్నంతసేపు ఎంతో యింటరెస్ట్‌గా, అమిత థ్రిల్లింగ్గా వుంది. ఇలాంటి భయంకరమైన సీరియల్స్ అంటే నాకు చాల యిష్టము. రచయిత కొలను వేంకట దుర్గాప్రసాద్‌కు నా ధన్యవాదములు. అప్పుడప్పుడు యిలాంటి సీరియల్స్ ప్రచురించవలసినదిగా ప్రార్థించుచున్నాను.

మలిశెట్టి లక్ష్మీనారాయణరావు (నెల్లూరు)

తిరుచరణాలు

లల్లాదేవిగారి ''తిరుచరణాలు'' నవలా రత్నం ముగిసింది. ఆద్యంతము బిగువు సడలని పోకడకల చరిత్రాత్మక నవల. లల్లాదేవిగారు అభినందనీయులు. ప్రశంసనీయమైన పాత్రలు పాఠకుల హృదయముల నాకట్టుకొన్నవి. అన్ని హంగులను సంతరించుకొన్న నవల 'తిరుచరణాలు' చక్కని ఇతివృత్తంగల యీ నవలను ఏ తెలుగు చలనచిత్ర నిర్మాతయైనా తెలుగు తెరకు ఎక్కించగల్గితే ప్రజా మన్నన బడయగలదు. అనతి కాలంలో వెండి తెరపై చోటుచేసుకుంటుందని ఆశిద్దాం.

సోమరాజు (తణుకు)

మూగముత్యాలు

అందాల నటి 'మాధవి' ముఖచిత్రంతో వెలువడిన 29–7–83వ సంచికలో ప్రారంభించిన యలమంచిలి యూస్సీలక్ష్మీగారి 'మూగ ముత్యాలు' సీరియల్ ప్రారంభంలోనే సరికొత్త పంథాలో, మంచి రచనా శైలితో, నూతనాకర్షణీయంగా మా మనసులను ఆకట్టుకుంది.

'జీవన్ మృతులు'ముగింపు చాలా బాగుంది.

లోకం పోకడ ఊమెన్‌గారి రాజకీయ కార్టూను చూసి మేమంతా నవ్వుకున్నాం.

గుమ్మనూరు పూర్ణశ్రీ, స్వర్ణశ్రీ, అరుణశ్రీ (ఆదోని)

అనువాదాలు ?


ఇంగ్లీషు, లేక హిందీ కాని అనేక భాషలలో ఉన్న నవలలను కథలను రచయిత్రుల అనుమతి లేకుండా స్వేచ్ఛానువాదం చేయవచ్చునా లేక వారి అనుమతి తీసుకొనే అనువాదం చెయ్యవలయునా అని నాకు సందేహముగా నున్నది.

గోపాలం శ్రీనివాసరావు (పసుమర్రు)

* అనుమతి లేనిదే అనువాదాలు చెయ్యటం మంచిదికాదు. (సం.)

[65 వ పేజీ చూడండి]

లోకంపోకడ * డూమెన్



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938–1972]

శుక్రవారం : 26-8-'83
రుధిరోద్గారి నామ సం. శ్రావణ బ. తదియ
సంపుటము 75 సంచిక 52

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు.	1-50
ఆరు మాసాల చందా	రు.	42-90
పోస్ట్‌లో ఏడాది చందా	రు.	85-80

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం. విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి "నళిని"
(ఫోటో : జి. కె. నరసింహం)

కథలు :

సీరియల్ నవలలు :

వ్యాసాలు, శీర్షికలు :

రాజకీయోల్బణం అంటే ఏమిటి?

ద్రవ్యోల్బణం అంటే ఏమిటి? "ధనం ఎక్కువా, సరుకు తక్కువా" అయితే ఏర్పడే పరిస్థితే! భారతదేశంలో "ధనం ఎక్కువా, రాజకీయవాదులు తక్కువా" పరిస్థితి ఏర్పడింది. ఇదీ ఒకరకం ఉల్బణమే కాని ఇది "రాజకీయోల్బణం" అన్నమాట.

భారతదేశాన్ని ప్రస్తుతం పీడిస్తున్న ప్రధాన సమస్యలు చాలావరకు పేదరికం వలన కాదు ఐశ్వర్యంవలన వచ్చినవే అని నేను అనుకుంటూ ఉంటాను. మన రాజకీయవాదులు మాత్రం పేదరికాన్ని గురించి మాట్లాడేస్తూ ఉంటారు. [వారిలో ఎందరు బీదవారు?] దేశంనిండా నిరుపేదలే. కాని వారు కాదుకదా సమస్య. అసలు తలనెప్పి మనుషులు అంతూలే,స్వరాజ్యపాల్ లాంటి వాళ్లమూలానే వస్తాయి. ఇలాంటివాళ్లకి హటాత్తుగా పెద్ద నిధులు దొరుకుతాయి. (ఎక్కడ దొరుకుతాయో తెలీదు) దాంతో వాళ్ళు పెట్రేగిపోతారు. స్వరాజ్యపాల్ది భారీ విగ్రహం. ఆయన విజృంభిస్తే కష్టమేమరి...

భారతదేశంలో ఉద్యోగాలు లేనివాళ్ళు సమ్మె చెయ్యరు — ఎవరికి వ్యతిరేకంగా సమ్మె చెయ్యాలి వాళ్లు? వాళ్ల ఊరేగింపులు చెయ్యరుకూడా, మరేమి చేస్తారు — ఆత్మహత్య చేసుకుంటారు ఎందరో! పత్రికలలో చదవమూ మనం—ఎవరో ఒక నిరుద్యోగి ఉరిపోసుకున్నాడనో, ఇంకేవిధంగానో మరణించాడనో? ఇలాంటివాళ్లవలన పేచీలు వస్తే అవి వాళ్ల కుటుంబాలవాళ్లకీ, పోలీసు వారికీ మాత్రమే పరిమితమయి ఉంటాయి. కాని, మంచి ఉద్యోగాలు కలవాళ్ళు మాత్రం చీమ చిటుక్కుమంటే సమ్మె చేస్తారు, ఊరేగింపులు చేస్తారు. అందరికీ ఇబ్బందులే దీనివలన. భారతదేశంలో ఎవరయినా తోచక బాధపడితే వాళ్లు బాంకులలో డిపాసిట్లు కలవాళ్లేకాని ఇంకెవరో కాదు. వాళ్లకి టి. వి. సెట్లూ, సయికిళ్లూ,స్కూటర్లూ వగయిరాలు ఉంటాయి. స్కూటర్ ఉన్న మనిషికి కారు కావాలి, నలుపు — తెలుపు టి. వి. ఉన్న వ్యక్తికి రంగుల టి. వి. కావాలాయె. అదే వచ్చిన బాధ.

ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలు లేదా ఉద్యోగ కార్యాలయాల వద్ద నిరుద్యోగ భృతి ఇప్పించి దేశంలో అలజడిని తగ్గించుకోవచ్చునని గ్రహించిన రాజకీయవాదులలో శ్రీమతి థాచర్ మొదటివారు కారు, ఇంగ్లాండులో 30 లక్షలమంది నిరుద్యోగులు ఉన్నాసరే ఆదేశం ప్రశాంతంగానే ఉంది. [అందరు నిరుద్యోగులు ఉండటంచేతనే అని కొందరు అంటారు.] అందుకనే, వోటరులు కృతజ్ఞతతో శ్రీమతి థాచర్ని గెలిపించారు మొన్న ఎన్నికలలో. భారత దేశంలో ఇంతమంది ఉద్యోగాలు లేనివాళ్లు ఉండటం మూలాన్నే శ్రీమతి గాంధి కూడా అధికారంలో ఉండగలుగుతున్నారు. ఇక్కడే కనుక అందరికీ ఉద్యోగాలు దొరికితే పెనంమీద అట్టు మారినట్టు మారిపోతారు ప్రధానమంత్రులు.

మన మిత్రుడు అబ్దుల్ రెహమాన్ అంతూలే సంగతే తీసుకోండి. ఈయన ఒకప్పుడు తన గ్రామం ఆలీబాగ్ (అదేనా దాని పేరు?)లో జాలరిగా ఉన్నంత కాలమూ ఎవరి జోలికి వెళ్లేవాడు కాదు. నాయక్ మంత్రివర్గంలో డబ్బులేని మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన ఎవరి జోలికీ వెళ్లేవాడు కాదు. [ఒక్కసారి

న్యూఢిల్లీ లేఖ




డా. జయదుబాషి

మాత్రం ఒక అర్ధరాత్రి పోలీసులకారు వేటలో ఆయన కారు కూడా చిక్కుకుందనుకోండి.] అత్యవసర పరిస్థితి అయిపోగానే అంతూలే స్థాయి పెరిగింది— ఆయన ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి కుడిభుజం అయ్యాడు (అని ఆయనే అంటాడు). అప్పుడూ ఆయన ఎవరికీ పెద్ద పేచీ ఏమీ తీసుకురాలేదు. కాని— మహారాష్ట్రలో పెద్దపని దొరికిందోలేదో,సిమెంటు గోడవునులలో అన్ని బస్తాల సిమెంటు చూశారోలేదో విజృంభించడం ప్రారంభించాడు. ఆయన తక్కువ ధనాన్ని తరిమారో లేకపోతే ఎక్కువ ధనాన్ని తరిమారో స్పష్టంగా తెలీటంలేదు. (ధనంఅంటే సిమెంటు అని అర్థం చెప్పకోవాలి.) ఒకటి మాత్రం బాగా తెలిసిపోయింది. అదేమిటంటే, అంతూలే పరిపాలనలో రాజకీయోల్బణం బాగా వచ్చేసింది. లయ సెన్సులేమిటి, సారా పర్మిట్ లేమిటి — అన్నిటిధరలూ అద్భుతంగా పెరిగిపోయాయి, అద్భుతానికి కారణం ధనమే అని తెలుసుకోవాలి.

స్వరాజ్యపాల్ సంగతి తీసుకోండి, ఈయన రాజకీయోల్బణానికి గురిఅయి ఇంచుమించు 'సఫా' అయ్యాడు. అంతూలే, పాల్— వీళ్లిద్దరూ అధిక ప్రసంగంచేసే వ్యక్తులే కాని పాల్కి ఎప్పుడు మాట్లాడటం ఆపాలో తెలీదు. ఆయన "కపారో" సంస్థనే తీసుకోండి, దానిపేరు విని ఉండవచ్చు కొందరు కాని దానిని గురించి ఎవరికి మాత్రం ఎంతతెలుసు? 1980—82 మధ్య మాత్రం పాల్కి చాలా డబ్బు దొరికినట్లు తోస్తుంది. ఇది ఆయన తాలూకు "కపారో" మూలధనం కన్నా అధికమయిన మొత్తంలోనే దొరికింది. అదే కాలంలో ఆయన మిత్రుడు అంతూలేకి బొంబాయిలో చాలా ధనం లభించింది. అంతూలే సిమెంటు ద్వారా సంపాదించి మూట కట్టుకున్నాడు; పాల్ ఉక్కు ద్వారా సంపాదించాడు. [పారాదీప్ ప్రాజెక్టు ద్వారా అని కొందరు. ఇది ఉ॥ వదంతి.] పారాదీప్ ప్రాజెక్టు కాంట్రాక్టుని ఒక బ్రిటిషు కంపెనీకి ఇచ్చినప్పుడు ప్రణబ్ముఖర్జీ ఆర్థిక మంత్రిగా ఉండేవాడు, భారతదేశంలోని కొన్ని కంపెనీలని హస్తగతం చేసుకోవాలని స్వరాజ్యపాల్ ప్రయత్నిస్తున్నప్పుడు ఆయన ఆర్థిక మంత్రిగానే ఉన్నారు. [ఇది స్వరాజ్యపాల్ అదృష్టంకాక మరేమిటి?] స్వరాజ్యపాల్ ధనం ఎక్కడినుంచి వచ్చిందో ఈయనే తెలపాలి. ఆర్థిక మంత్రి పదవిని వదులుకుంటే ఆయన ఎన్నో వింతలు బయటపెట్టగలరు. వదులుకోకపోతే గూడా ఆయనకి ఫరవాలేదు. ఎన్నో రహస్యాలు ఆయనకి తెలిసే ఉంటాయి.

ముంధ్రా, టి.టి.కె.ల కన్నా పాల్—ముఖర్జీల పొత్తు కొట్టవచ్చినట్లుంటుంది. అప్పటిలో వాగ్లా విచారణ జరిపి ఎన్నో రహస్యాలు బయట పెట్టాడు. ఇప్పుడు అలాంటి మనిషి ఉంటే కదా బొంబాయి, లండన్, న్యూఢిల్లీల మధ్య సంబంధాలని కనిపెట్టేందుకు?

కాంగ్రెసు (ఇందిర) వారికి కొళాయి చాలు డబ్బు వస్తుంది. అంత ధనంతో ఏమి చెయ్యాలో వాళ్లకి తెలీదు. వోట్లు కొంటారు, ఇళ్లు కొంటారు, వనితలనీ కొంటారు, విదేశాలకి విలాస యాత్రల కెడతారు—అయినా వాళ్ల ఐనపెట్టెలు కరెన్సీనోట్లతో నిండిఉంటాయి. ఢిల్లీలో ఒక పెద్ద తాజమహలు హోటలు ఉంది. (చాలా ఖరీదయింది.) మధ్యాహ్నం దీనికి వెళ్లండి. కోడి, గొడ్డు, పంది మాంసాలలో ఏదయినా ఒకటి మెక్కుతూ కనిపిస్తారు సంజయగాంధీ నేస్తాలు. ఇదే వాళ్ల ఆఖరి భోజనమా అనే



జర్మనీలో సిల్కు బజారు !

పశ్చిమ జర్మనీలో ఇటీవల భారతీయ సిల్కు వస్త్రాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. మల్బరీ, టస్సారు, మట్కా సిల్కు వస్త్రాలు పలురకాల రంగులలో పలురకాల డిజైన్లతో జర్మను ప్రజలను ఆకర్షించాయి. హర్టీలోమ్, మరో 30 డిపార్టుమెంటు స్టోర్సులలోనూ ఈ ప్రదర్శన రెండు వారాలపాటు జరిగింది. ఫ్రాంకుఫర్టులోని ప్రధాన ప్రదర్శనను పశ్చిమ జర్మనీలోని భారత రాయబారి శ్రీ ఆర్. డి. సాఠే ప్రారంభించారు. ఈ పట్టువస్త్రాల డిజైన్లు జర్మను ప్రజల అభిరుచికి తగినట్లుగా ఉండటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా భారతీయ వృత్తి ప్రదర్శనకూడా ఏర్పాటుచేశారు.

న్యూఢిల్లీ లేఖ

అనుమానం చూపరులకి రావచ్చు కాదు కాని వాళ్ల ఆత్రం అటువంటిది. పోనీ ఈ భోజనానికి వాళ్ళు తమ డబ్బు ఇస్తారా అంటే అదీలేదు — భోజన దాతలు తాతాలు, అనికూడా మీరు అనుకోవచ్చు. తన సొంత ధనం ఖర్చుచేస్తే రాజకీయవాదికి తన వ్యాపారం ఏమిటో తనకే తెలీదు. వీళ్ళంతా విదేశాలు వెడితే వాళ్ళ టిక్కెట్ల ఖర్చు భరించే దెవరు ? వాళ్ళు కొనే విలాస వస్తువుల దాతలు ఎవరు ? మీరూ, నేనే కదా !

ఎలాగంటే — వ్యాపారులు ఏదయినా ఖర్చు పెడితే అందులో ప్రతి పైసా (అది చీకటి బజారులో సంపాదించినదయినా సరే) వాళ్ళు సంపాదించుకున్నదే. మన యువతురుష్కులేమో తాజమహలు హోటలులోగాని ఇంకెక్కడయినా గాని ఏదయినా ఖర్చుపెడితే అది మన డబ్బులో నుంచే, కాతాల డబ్బులోనుంచి కాదు. అంతూలే ఎవరో కాంట్రాక్టరుల దగ్గర వసూళ్ళు చేస్తే అదికూడా మన ధనమే కదా ! చివరికి ఖర్చంతా మనదే— శ్రీమతి గాంధీ విలాస యాత్రల ఖర్చు కానివ్వండి, తటస్థదేశాల సమావేశం ఖర్చు కానివ్వండి. శ్రీమతి గాంధీ యూరోపు వెళ్లా లనుకుంటే ఏదో కార్యక్రమం వేసుకుంటారు. అలాగే తటస్థదేశాల సమావేశంలో పాలుగొన్న వారు కూడాను. [అసలు వీళ్లలో ఎక్కువ మంది నియంతలూ, గూండాలే కదా ?]

రాజకీయోల్బణం యొక్క ప్రభావానికి గురి అయి బాధపడేది ఎవరూ ? మీరూ, నేనూ మాత్రమే కాని అంతూలే, స్వరాజ్ పాల్ లాంటి మనుషులు కారు. వాళ్ళు చివరికి హాయిగా తప్పించుకుంటారు...... ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

1983 దీపావళి కథల పోటీ

మొత్తం రు. 6000ల బహుమతులు

ఎప్పటిలాగే ఈసారి కూడా దీపావళికి కథానికల పోటీ పెడుతున్నాము..... పోయినేడాదిలాగే యీసారి కూడా సంపాదకుని ఎన్నికలో ఉత్తమంగా వచ్చిన ఆరు కథలను 'ఆంధ్ర సచిత్ర వార పత్రిక' దీపావళి సంచికలో, ఆతరువాతి సంచికలో వేస్తాము. ఆ తరువాత పాఠకుల బాలట్ నిర్వహిస్తాము.

ముగింపు తేదీ 31.8.83 → బుధవారం...

పోటీలో ఎన్నికైన ఆరు కథలకు ఒక్కొక్కదానికి రు. 600/- లు చొప్పున బహుమతుల ఇస్తాము. ఆ తరువాత బాలట్ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన మూడు కథలకు రు. 650/-, రు. 550/-, రు. 450/-ల వంతున అదనపు బహుమతుల యివ్వడమే గాక మిగిలిన మూడు కథలకు రు. 250/-ల చొప్పున మూడు కన్సొలేషన్ బహుమతుల అందజేస్తాము.

★ 'కథానిక' ఆంధ్ర సచిత్ర వార పత్రికలో నాలుగు పేజీలు మించకుండా వుండాలి. 12 అరటావులు దాటకుండా వ్రాస్తే చాలు. నిడివి ఎక్కువ అయిన కథలకు బహుమతి రాగల అవకాశాలు చాలా తక్కువ అని గమనించాలి.

★ కథావస్తువు తెలుగువారి సామాజిక జీవితానికి సంబంధించి వుండాలి.

★ అనువాదం, అనుసరణ, అనుకరణ, కాపీ కథలు పంపకూడదు. ప్రసారమైన, ప్రచురణ అయిన లేదా ఇతర పత్రికలకు పంపబడి పరిశీలనలో వున్న కథలు అసలే పంపకూడదు.

★ పై అంశాల మేరకు హామీ పత్రం ప్రతి కథతోపాటు విధిగా వుండి తీరాలి. కలంపేరు వాడినా అసలు పేరు, యింటిపేరు సహా పూర్తిగా విడిగా స్పష్టంగా పూర్తి చిరునామాతోపాటు అందిన కథలనే పరిశీలించ వీలవుతుంది.

★ కథలతోపాటు రచయితల పేర్లు పడవు. బ్యాలట్ తరువాత వారి పరిచయం తోనే వేస్తాము.

★ రచనలపై పేచీలు వస్తే రచయితలే బాధ్యత వహించవలసి వుంటుంది.

★ పోటీలో నెగ్గిన కథల రచయితలు తమ ఫోటో, జీవిత విశేషాలు మొదలైనవాటిని పంపి, వాటి ప్రచురణకు అంగీకరించాలి.

★ ముగింపు తేదీ దాటిన తరువాత అందిన కథలను మామూలు ప్రచురణకు వీలువెంబడి పరిశీలిస్తాము. పోటీకి పంపిన కథలను ఏ పరిస్థితులలోను త్రిప్పి పంపలేము.

—సం॥

వాళ్ళిద్దరూ-నేను

—విహారి

బోనులో పడ్డ సింహంలా,

రెండు రోజులు – ఉస్మానియా హాస్పటల్లో గడిపి అప్పుడే ఇంటికి చేరేను.

మా మావగారికి జబ్బుగా వుంటే చూసిపోదామని సతీసమేతంగా వచ్చాను. పదేళ్ల తర్వాత హైదరాబాద్ నగరాన్ని చూసేను. వచ్చిన మర్నాడే ఆయనకి వ్యాధి ముదరడం, హాస్పటల్లో చేర్చడం జరిగింది.

రెండు రోజులు పూర్తిగా నేనూ, శారదా హాస్పటల్లోనే వుండిపోవాల్సి వచ్చింది. ఈ పూట ఆయన పరిస్థితి కొంత మెరుగయింది.

కనిచీకటి పడింది. శారద దొడ్లో బావి దగ్గర బట్టలు వుతుకుతోంది. తనూ నాతో వచ్చింది యింటికి. హాస్పటల్లో మా మావగారి చెల్లెళ్లున్నారు.

నాకు ఆకలి వుధృతంగా వుంది.

మధ్య హాల్లో కూర్చుని తన భర్త అనారోగ్యం గురించిన వివరాల్ని పక్కింటివాళ్లకి చెప్తోంది మా అత్తగారు. వాళ్లు సానుభూతిని పొడి పొడి మాటల్లో పంచుతున్నారు.

స్నానం చేసి వచ్చాను.

ఇంకా వంట ప్రయత్నానికి ఎవ్వరూ పూనుకోలేదు. శారదని గదిలోకి పిల్చి చెప్పేను— 'నాకు బాగా ఆకలేస్తోంది. ఉదయం ఎనిమిదింటికి కొరికిన మెతుకులు. త్వరగా వంట కానీ' అని.

ఆమె తల వూపుతూ వంటింట్లో ప్రవేశించింది.

నేనేదో పత్రికని చేతపుచ్చుకుని కూర్చున్నాను.

అదిగో సరిగ్గా అప్పుడు వచ్చాడు రామదాసు.

రామదాసు నాకున్న వొకేవొక బావమరది.

తల్లీ దండ్రీ అంటే అతనికి ఉదాసీనత. పెళ్లాం పిల్లల్తో వేరేచోట కాపరం. భార్య తరఫునుంచీ మంచి ఆస్తే వచ్చింది. ఆమె ఆడించినట్లు ఈయన ఆడతాడంటు వుంటారు మా అత్తా మావా. రామదాసుకి ముగ్గురు పిల్లలు. చిన్నవాళ్లు. అతను వొక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తాడు.

''చాలా కాలమైంది మనం కలిసి'' అంటూ మాట కలిపేడు. నేనొక పరిచయ మందహాసం చేసి వూరుకున్నాను.

''ఇప్పుడు కులాసాగానే వుందిగదా''అంటూ సంభాషణ మార్చి— తల్లిని పరామర్శించాడు, తండ్రి పరిస్థితి గురించి. ''ఏమి కులాసానో యేమో... ఇంకా రెండ్రోజులు చూడాలన్నారు డాక్టరు'' ఆమె నీరసంగా జవాబిచ్చింది.

''గోపాల్ని త్వరపడి వుద్యోగంలో చేర్పించేవ్. వాణ్ణి ఎం. ఏ. వరకూ చదవనివ్వాల్సింది.'' నావైపు చూస్తూ అన్నాడు. గోపాల్ మా పెద్దబ్బాయి.

''మంచి ఉద్యోగం. దానంతట —అది వచ్చింది. ఎమ్మే పాసైన తర్వాతైనా మళ్ళీ యిలాంటి వుద్యోగాల వేటలోనే పడాలి గదా'' అన్నాన్నేను.

''అదీ నిజమేననుకో... అయినా...'' అంటూ నసిగేడు, రామదాసు.

ఇంతలో శారద భోజనానికి పిల్చింది.

ఇద్దరమూ భోజనం చేశాము. రామదాసు అక్కయ్యని అవీ ఇవీ అడుగుతూ కూర్చున్నాడు.

నేను బయటికి వచ్చి, ఆరుబయట మంచం వేసుకుని, వేపచెట్టు కిందుగా పడుకున్నాను.

క్షణాల తర్వాత రామదాసు అక్కడికొచ్చేడు, స్టూలుమీద కూర్చున్నాడు. ''అలా బయటికి పోయొద్దాం పద బావా'' అన్నాడు.

''పడుకుంటాలేరా'' అన్నాను, బాగా డస్సిపోయిన స్వరంతో. అతను నా కంటే వయస్సులో చాలా చిన్న. నా పెళ్లయినప్పట్నుంచీ అతన్ని ఏరా అని పిలవడమే అలవాటు నాకు. ఈ చనువుకు మరో కారణం – అతను మూడేళ్ల మా యింట్లో వుండి చదువుకోవడం కూడా కావచ్చు.

''ఫర్వాలేదు. ఇప్పుడే వచ్చేద్దాం, ఆటోలో వెళ్దాంలే'' అంటూ బలవంతం చేశాడు.

లేవక తప్పలేదు నాకు.

నేను తయారయి బయటికి వచ్చే సరికి, గేటు ముందు ఆటోతో నిలబడి వున్నాడు రామదాసు.

గంట ఏడూ ముప్పై అయ్యింది. ఆటో బయల్దేరింది.

''చాలాసార్లు అనుకున్నాను— కడప వచ్చి మీ అందరితో సరదాగా వో వారం రోజులు గడిపి పోవాలని. ఏదీ పడిఛస్తేగా. ఎప్పుడూ కంపెనీ వ్యవహారాలూ, పనివొత్తిడీ. ఇక, ఇంటి సంగతీ నీకు తెలియనిదేం వుంది. కాత్యాయనిదంతా అదో తరహా. ఈ నగరాన్ని వదిలితే ఆమెకు పిచ్చెక్కుతుందట. పిల్లలూ అదేవరస.''

నేను వింటూ కూర్చున్నాను. మధ్య మధ్యలో 'ఆఁ ఊఁ' అంటూ, పొడిపొడిగా చిరునవ్వుని చిందిస్తూ, రామదాసు మొహంలోకి చూస్తున్నాను.

ఆ తర్వాత రామదాసు తన ఉద్యోగ విషయాలూ ఏవేవో చెప్పాడు.

ఆటో వొక బంగళా ముందు ఆగింది. దిగేము.

''రా...'' అంటూ ముందుకు నడిచేడు రామదాసు. నేను అతన్ని అనుసరించేను.

బ్రహ్మాండమైన భవంతి అది. ముందు కొన్ని ఎకరాల విస్తీర్ణంలో తోట. దారికి రెండు వైపులా క్రోటన్లు, రంగు రంగుల పూల మొక్కలు. వాటి వెనగ్గా పచ్చటి లాన్లు.

అద్భుతమైన వాస్తు శిల్ప విన్నాణాన్ని చిందిస్తూ, ఎత్తైన మెట్లూ, వాటికి చివర్లో గంభీరమైన గజరాజులూ; వరండా స్తంభాల మీద చిత్ర విచిత్రమైన శిల్ప సముదాయం.

వరండాలోకొచ్చేం. ''ఎవరిదిరా ఈ ఇల్లు'' అన్నాను, రామదాసుతో. నా కంఠస్వరంలో ఆశ్చర్యం. భయం, బెరుకు ధ్వనించాయని నాకే తెలుస్తోంది.

''చెప్తా...రా...'' అంటూ కాలింగ్ బెల్ ప్రమోగించాడు.

తలుపు తెరుచుకుంది. చెప్పులు బయట వదిలేము.

లోపలికి అడుగు బెట్టాము.

కాళ్ళ కింద మెత్తగా ముఖమల్ తివాచీ. దానిమీద నా పాదం మోపడానికే సంకోచం కలిగింది నాకు. ఎదురుగా గోడలకు నిలువెత్తు తైలవర్ణ చిత్రాలు; దుప్పి కొమ్ములు; హాలు మూలల్లో కళావిలసితమైన పూలకుండీలు.

సోఫాల్లో కూర్చున్నాము. డ్రింక్స్ వచ్చినై, తాగేము.

ఇంతలో వొక భారీ మనిషి హాల్లోకొచ్చి మా ముందున్న సోఫాలో కూర్చున్నాడు.



రామదాసు కళవళ పడిపోతూ, కంగారుగా లేచి నిలబడి "నమస్తే సార్" అంటూ రెండు చేతులెత్తీ నమస్కరించాడు.

ఆయన చిరునవ్వుతో — కూర్చోమన్నట్టు చెయి వూపేడు.

రామదాసు ఎంతో వినయ విధేయతలతో ముళ్లమీద కూర్చున్నట్టు సోఫాలో ముందుకు కూర్చున్నాడు.

"మా బావగారు, గెజెటెడ్ ఆఫీసరు. కడపలో వుంటున్నారు" పరిచయం చేశాడు. ఆయన తలపంకించాడు. నేను నమస్కారం పెట్టాను.

"వీరు మా ఛీఫ్ ఎగ్జిక్యూటివ్; బసవరాజు గారు" చెప్పాడు.

ఆయన వైపు తేరిపార చూశాను.

భారమైన దేహం. అడ్డూ ఆపూ లేకుండా పెరుగుతున్న బొజ్జ; ముఖాన్న రాటుతేలుతున్న ముడతలు; సూటూ బూటూ నిగనిగ మెరుస్తున్నాయి. బంగారు ఫ్రేము కళ్లద్దాలూ మెరుస్తున్నాయి. ఎడారిలో వొయాసిస్సుల్లా బట్టతలలో అక్కడక్కడా చిన్న చిన్న తెల్లవెంట్రుకలు. మొత్తం మీద ఆ మూర్తిలో వొక రీవి వుంది. సంపద తెచ్చిన రాజసం ఆయన మొహాన్న కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

వాతావరణంలో నిశ్శబ్దం ముద్దకట్టింది. తెల్లకాగితాలు హాలంతా పరచినట్టు వొక నైర్మల్యం అనిర్వచనీయంగా ప్రవహిస్తోంది.

వాళ్ళిద్దరూ – నేనూ

ఏం మాట్లాడాలో ఏఁవిటో తెలీడం లేదు నాకు. మామూలుగా కనిపించాలని ఒక చిరునవ్వు నవ్వేను.

బసవరాజు నా చిరునవ్వుని స్వీకరించేడు. ప్రత్యభివాదం చేశాడు.

"మీ కామేశ్వరి పెళ్ళికి సంబంధాలు చూస్తున్నార్టగదా. మంచి సంబంధం చూడండి. కట్నకానుకల విషయంలో మీరేమీ భయపడకండి."

వాన లేకనే తలపైన పిడుగు పడ్డట్లైంది నాకు. ఆయన ఏం మాట్లాడుతున్నారో అర్థం కాలేదు.

"మరేం కంగారు పడకండి. ఆమె పెళ్లి బాధ్యత మీ మీద వున్నట్లు నాకు తెలుసు. మంచి సంబంధం చూసి కబురు చెయ్యండి. డబ్బు పంపుతాను. మనం మనం తర్వాత చూసుకోవచ్చు."

ఔదార్యం ఏ ఏ రూపాల్లో వుంటుందో తెలీనివాణ్ణి కాను గానీ— బసవరాజు చూపుతున్న ఈ ఔదార్యం నన్ను అస్థినాస్థి విచికిత్సలోకి త్రోసేసింది. అసలు జరుగుతున్నదేఁవిటో ఆకళింపు కాలేదు నాకు.

బసవరాజు ముక్కూ మొహం తెలీనివాణ్ణి నేను. కామేశ్వరి నా మేనకోడలు. ఆ పిల్ల పెళ్లి బాధ్యత నా నెత్తిన వున్నమాట నిజమేగానీ — దాన్ని నెరవేర్చలేనని భయంగానీ, దానికి కావలసిన డబ్బు గురించిన ఆందోళనగానీ నేనెవ్వరికీ వ్యక్తంచేయలేదే - ఏఁవిటీ వింత పరిణామం ?

చూపులతోనే రామదాసుని ప్రశ్నించాను — ఏఁవిటి ఇదంతా ? — అన్నట్టు.

అతను — ఆగు చెప్తాను — అన్నట్టు సైగచేశాడు.

మరోసారి తన హామీని పునర్వ్యక్తంచేస్తూ, లేచి నిమ్మళంగా గదిలోకి వెళ్లిపోయాడు, బసవరాజు.

మేమూ లేచి నిలబడ్డాము.

చేయ పుచ్చుకుని నన్ను బయటికి లాక్కొచ్చాడు రామదాసు. నేనతని ముఖంలోకి తేరిపార చూడలేకపోయాను.

ఎలా యింటికివచ్చి పడ్డానో తెలీదు. ఇల్లు చేరేను తనకేదో అత్యవసరమైన పని వుందంటూ సంజీవరెడ్డినగర్‌కి వెళ్లాలంటూ వెళ్లిపోయాడు రామదాసు. "రేపు వచ్చి వివరంగా మాట్లాడతాలే బావా" అంటూ వెళ్లాడు.

ఆ రాత్రి —

అనేక రకాలైన ఆలోచనలతో నాకు నిద్ర లేదు.

శారదకు చెప్పాను—జరిగిన విషయమంతా. "నువ్వేమైనా మీ తమ్ముడితో చెప్పావా — కామేశ్వరి పెళ్లి సంగతి ?" అని అడిగేను.

"ఏదో మాటవరసకి ఎప్పుడన్నా అన్నానేమో" అంది శారద.

మర్నాడు ఉదయం —

వెంటనే బయల్దేరి రావలసిందిగా గోపాల్ నుంచీ టెలిగ్రాం వచ్చింది నాకు. ఏదో ఆఫీసు పని అనివుంది.

హడావిడిగా బయల్దేరి వొక్కణ్ణీ కడప వచ్చేశాను.

పది రోజులు గడిచాయి.

ఈ పది రోజులూ — నాకు రాత్రుళ్లు నిద్రలేదు. కన్ను మూసినా తెరచినా, అందమైన భవంతీ, అందులో బసవరాజు రూపం కనిపించసాగినై. ఆయన మాటలే చెవుల్లో మార్మోగసాగినై.

మా మాఁవగారిని హాస్పటల్‌నుంచీ ఇంటికి తీసుకొచ్చారు.

శారద తిరిగి కడపకు వచ్చేసింది.

"రామదాసు ఏమన్నా చెప్పాడా ?" అని అడిగేను, శారదని.

"నాకేం చెప్పలేదుగానీ — ఉత్తరం రాస్తానన్నాడు మీకు" అంది.

మరో నాలుగైదు రోజులకి — రామదాసు నుంచీ ఉత్తరం వచ్చింది. చాలాసార్లు చదువుకున్నాను. ఉత్తరమంతా సిరామరకలే. ఫిరంగి గుళ్లు వెదజల్లినట్లు ఆ మరకల మధ్యన అక్షరాలు !

మళ్లీ చదువుతున్నాను - మీరూ వినండి.

"బావా నువ్వేమీ అనుకోనంటే ఒక్క కోరిక కోరతాను. మీ మేనకోడలు కామేశ్వరి పెళ్లి బాధ్యత నీమీద వుంది. నువ్వా పిల్లకి పెళ్లి చెయ్యాలంటే తక్కువేమీ కాదు. అంత డబ్బు నీ దగ్గరలేదు. నీ పరిస్థితి నాకు తెలుసు. అలాగే, మా బసవరాజుగారు తన తమ్ముడి కూతురి పెళ్లి చెయ్యాలి. ఆ తమ్ముడికి ఆరుగురు ఆడపిల్లలు. అందరి బాధ్యతా ఈయనదే. ఈయనకి మీ గోపాల్ సంగతి చెప్పాను. కామేశ్వరి పెళ్లి అయితేనేగానీ గోపాల్ పెళ్లి ప్రస్తావన తేనని నువ్వన్నట్లు నాకు తెలుసు. కనుక, బసవరాజు అవసరాన్నీ నీ అవసరాన్నీ కలిపి ముడివేశాను. "ఎందుకు ?" అని వెంటనే ప్రశ్నిస్తావ్ నువ్వు. అవును, ఇది నా అవసరానికీ పనికొస్తుంది. బసవరాజు చల్లగా చూస్తే నేనీ సంవత్సరం మా కంపెనీకి "కొనుగోళ్ల ఎగ్జిక్యూటివ్"ని కావచ్చు. నేను అత్యాశకేమీ పోవడంలేదని నా నమ్మకం. వీటికి నీ అంగీకారాన్ని తెలుపుతావు కదూ !"

రామదాసు ఎంతగా ఎదిగిపోయాడో అర్థమైంది నాకు. చిక్కులున్న దారపువుండలో ఏ కొసని ఎక్కడ పుచ్చుకుని లాగాలో బాగానే గ్రహిస్తున్నాడు. బతకనేర్చినవాడే !

ఒక్కసారి కుర్చీలో వెనక్కువాలి కళ్లు మూసుకున్నాను. నా గుండె గుండెలోనే వుంది; నేను మామూలు మనిషిగానే వున్నాను ! రామదాసు రాంగ్ నెంబర్‌ని డయల్ చేశాడు !!!

★



బ్యూటీ క్లినిక్‌లో
అతివలని అలంకరిస్తున్న దృశ్యం.

అందాలని పెంపొందించే బ్యూటీ క్లినిక్‌లు

ఆడవారికి, అందానికి చాలా సన్నిహిత సంబంధముంది. అందంగా ఉండటమేగాదు, అందంగా కనిపించాలని, పదిమందిలో ప్రత్యేకంగా కనిపించాలని కోరుకొంటారు. అందుకనే ఆడవారి జీవితాలు చాలావరకు అలంకరణకే సరిపోతాయని అంటుంటారు.

ఆడవారు సహజంగా సుకుమారులు. దానికి అందం తోడవుతుంది. అయినా మరిన్ని మెరుగులు దిద్దుకొని తమ సౌందర్యానికి తేజస్సు సమకూర్చుకోవాలని కోరుకొంటూంటారు. నిత్యమూ నవనవలాడే అందాలతో, ఆరోగ్యవంతమయిన రూపంలో కనిపించాలని ఆశిస్తారు.

సాంప్రదాయకంగాగూడా మన సమాజంలో ఆడవారి అందాలకు మెరుగులు దిద్దడానికి పలు చిట్కాలు, పద్ధతులు వస్తున్నాయి. అయితే మారుతున్న కాలంతోపాటు నూతన ప్రక్రియలు వెలుస్తున్నాయి. అలంకరణకై అద్దం ముందు గంటలతరబడి నిలబడే శ్రమలేకుండా "బ్యూటీ క్లినిక్" లు వెలుస్తున్నాయి. మద్రాసు, బొంబాయి వంటి పెద్ద నగరాలకే పరిమితమయిన ఈ క్లినిక్‌లు మన రాష్ట్రంలో గూడా హైదరాబాద్, గుంటూరు, విజయవాడ నగరాలకు వ్యాపిస్తున్నవి. అందంగా కనిపించడానికి ఎదురయ్యే ఏ సమస్యలనయినా ఈ క్లినిక్‌లు పరిష్కరిస్తాయి.

అయితే బ్యూటీ క్లినిక్‌లద్వారా పెద్దవారిని యువతులుగా కనిపించే విధంగా చేయలేముగానీ, ఏ వయస్సులోనివారయినా అందంగా, ఆకర్షణీయంగా కనిపించే విధంగా చేయవచ్చని అంటారు గుంటూరులోని "లేడీస్ వరల్డ్" బ్యూటీ క్లినిక్ వ్యవస్థాపకురాలు శ్రీమతి కె. రమాదేవి. గుంటూరులో మొదటిసారిగా సంవత్సరం క్రితం బ్యూటీ క్లినిక్‌ను ప్రారంభించిన ఘనత ఈమెదే.

దక్షిణ ఢిల్లీ పాలిటెక్నిక్ కళాశాల నుండి బ్యూటీ కల్చర్, హెయిర్ డ్రెస్సింగ్‌లో డిప్లమా పొందిన శ్రీమతి రమాదేవి ఉమన్స్ వరల్డ్ ఇంటర్నేషనల్‌లోగూడా బ్యూటీ తెరపీలో డిప్లమా పొందారు. శరీరం ఆరోగ్యంగా, అందంగా కనిపించడానికి వీరు సహకరిస్తారు.

శరీరం ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా ఉండి ఉత్సాహంగా ఉండడానికి "డైట్ షీట్" ను రూపొందిస్తారు. పెళ్ళిపీటల మీదకుగానీ, పెళ్ళి చూపులకుగానీ వెళ్ళేయువతులను ఆకర్షణీయంగా అలంకరిస్తారు.

హెయిర్ డ్రెస్సింగ్, హెయిర్ కట్టింగ్, హెయిర్ డ్రైయింగ్‌లద్వారా అభిరుచికి అనుగుణంగా కేశాలంకరణ చేస్తారు. తెల్ల వెంట్రుకలు కనిపించకుండా, వెంట్రుకలు ఊడిపోకుండా గూడా చేస్తారు. అయితే తెల్లజుట్టుకు నల్లరంగు వేయడంకన్నా గోరింటాకుతో "హెన్నా రైన్స్" చేస్తే మంచిదని ఆమె తన అభిప్రాయం వ్యక్తంచేశారు.

నిత్యమూ క్లినిక్‌కిరాలేనివారికి, అంతడబ్బును భరించలేని వారికి రెండు, మూడు వారాలపాటు "పర్సనల్ గ్రేమింగ్", "మేగ" లా శిక్షణ యిస్తారు. తర్వాత స్వయంగా ఎవ్వరికివారే తమ అందాలకు మెరుగులను దిద్దుకోవచ్చు, వికారంగా కనిపించకుండా సహజంగానే అలంకరించుకోవచ్చని, 40 సంవత్సరాల వయస్సులోగూడా ఆకర్షణీయంగా కనిపించవచ్చని శ్రీమతి రమాదేవి చెప్పారు.

నేడు అందాల అలంకరణకై పత్రికలలో విస్తారంగా ప్రకటనలు కనిపించే వివిధరకాల క్రీములను వాడుతున్నారని, అది చాలా ప్రమాదకరమని శ్రీమతి రమాదేవి హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా "వైటనింగ్" క్రీముల వల్లన కిడ్నీలు గూడా దెబ్బ తినవచ్చని, మొఖం తోలువలె బండబారిపోతుందని ఆమె అన్నారు. అయితే పేరున్న మంచి కంపెనీల క్రీములు ఖరీదు ఎక్కువ అయినా వాడటం మంచిది. తెలియనివి, అనవసరమయినవి వాడటం ప్రమాదకరం. అవసరమున్నంతవరకే వాడాలి. క్రీములకన్నా సహజసిద్ధమయిన పద్ధతులు అవలంభించడం ఆరోగ్యకరం అని ఆమె అంటారు.

బ్యూటీ క్లినిక్‌కు ఎక్కువగా కాలేజీ అమ్మాయిలు, ఉద్యోగం చేస్తున్న స్త్రీలు, ధనవంతుల గృహిణులు వస్తూంటారు. అయితే కేవలం గుంటూరు పట్టణం నుండేగాక సమీపంలోని తాలూకా కేంద్రాలనుండి, కొన్ని గ్రామాలనుండి కూడా అందాల అలంకరణకై వస్తున్నారు.

— చలసాని నరేంద్ర *

సీరియల్



జీవన మురళి

కొండముది శ్రీరామచంద్రమూర్తి

6

(గత సంచిక తరువాయి)

ఇంట్లో నుండి బయటకు వచ్చిన మురళీకృష్ణ ఓ అద్దె సైకిలు తీసుకున్నాడు. ముందు హ్యాండిలు మీద జీవనను కూర్చోమన్నాడు. జీవన సిగ్గుపడింది. "నువ్విప్పుడు దూరం నుండి చూసేవాళ్లకు మిష్టర్ జీవన్‌వి! మిస్ జీవనవు కావు!" అన్నాడు మురళీకృష్ణ ఉడికిస్తూ.

"అట్లా అన్నారంటే నే నసలు రానేరాను. మీరే తెచ్చిపెట్టండి మీకు నచ్చిన చీరెలు." అన్నది జీవన బుంగమూతి పెట్టి.

"నాకు నచ్చినా, కట్టుకునేది నువ్వు. అంచేత అమ్మాయిగారు రాక తప్పదు!"

"రిక్షాలో పోదామంటే వినరేం?"

"జీవనా! అటు చూడు, ఆ కొండల మీద వున్న ఆకాశంలో మేఘాల ఉయ్యాల పై తేలిపోతున్నాడు సూర్యుడు. ఆ కొండల దిగువనే వాటర్‌ఫాల్ వుంది,దానికి దగ్గర్లో వో టెంపుల్, వాటికి అటుప్రక్క పనసచెట్ల తోటలు, ఈ ప్రక్కన సంపెంగ పొదలు, పేరుకే గాదు, మా వూరు నిజంగా ఆనందపురమే! అవన్నీచూస్తూ జాయ్‌గా కొట్లన్నీ పరికిస్తూ నచ్చింది నువే కొనుక్కోవచ్చు. రిక్షాలో అయితే థ్రిల్ ఏముంది? ఏకాంతం ఏముంది? ఎన్నిచోట్లకని వెళ్లగలం?"

జీవన మరో మాట మాట్లాడకుండా సైకిల్ బార్‌మీద కూచుంది. మురళీకృష్ణ సైకిల్ తొక్కుతున్నాడు, లీలగా, హోలగా.

ఆనందపురంలో వేసవికాలం ఎండ కూడా శీతాకాలం ఎండలా వుంటుంది. శీతాకాలమూ కాక, ఎండకాలమూ కాక ఆ మధ్య కాలంలో, జనవరి—ఫిబ్రవరి నెలల్లో ప్రియురాలి కౌగిలింత లాగా, మామిడిచెట్టు నీడలాగా, ఎంతో ఆహ్లాద కరంగా వుంటుంది. ఇద్దరూ పనస తోటలో వో చోట ఆగారు. చెట్టున పండిన పనసపండును కోయించి పనసతొనలను వూసులాడుకుంటూ తిన్నారు.

"మావయ్యగారికీ, బామ్మగారికీ కూడా తీసుకెళ్దామండీ!" జీవన సజెస్ట్ చేసింది.

"తప్పకుండా!"

పనసతొనలను ఆకులో కట్టించి ఆ పొట్లాన్ని ప్లాస్టిక్ సంచీలో పెట్టింది జీవన. ఓ చిన్నకొండ ఎక్కారు. ఆ కొండమీది నుంచి వూరంతా చిత్రకారుడి బొమ్మల్లా కనిపించింది. జలపాతం ధారల్లో తడిశారు. తడిసిన గుడ్డలను పైరుగాలికి ఆరబెట్టుకున్నారు. సంపెంగలను తలలో తురుముకుంది జీవన.

ఆటలో, పాటలో, ఆనందరవళిలో కొన్ని గంటలపాటు వాళ్ళు ఈ లోకమే మర్చిపోయేరు. తడిసి, ఆరి, ఎండి, అలసి, వాళ్ళు వూళ్ళోకి వచ్చి వో బట్టల కొట్టులోకి వెళ్ళారు.

మురళీకృష్ణను చూడగానే ఆ షాపువాళ్ళు ఆప్యాయంగా ఆహ్వానించారు.

"ఎప్పుడొచ్చావ్ కృష్ణయ్యా?" అడిగాడు ప్రొప్రయిటరు ఆదరంగా. "పరీక్షలైపోయినాయా? ఈ అమ్మాయెవరూ? మీ క్లాస్‌మేటా?"

మంచి క్ల్యూయే దొరికింది మురళీకృష్ణకు. అవునన్నాడు.

"మన వూరు చూట్టానికి వచ్చింది!"

"నచ్చిందా అమ్మా?"

"ఎంతో అందంగా వుంది!"

"ఈ ఊరికి వచ్చిన జ్ఞాపకార్థంగా కాసిని చీరలు కొనుక్కుంటానంటే, ఇట్లా తీసుకు వచ్చాను!"

"మంచిపని చేశారు!"

మూలనుండి వినవచ్చింది ఓ కొత్త గొంతుక. చకితులై అటు తిప్పారు తలల్ని వాళ్ళిద్దరూ. ఇంద్రసేన్ అక్కడ నిలబడి వున్నాడు, సఫారీ సూటులో. నోట్లో పైపుతో, చేతులో హంటర్‌తో, కాలికి పాయింటెడ్ బూట్సుతో.

అతన్ని చూడగానే గుర్తుపట్టాడు మురళీకృష్ణ. ఓ చౌకబారు పాటకత్తె ముందు శృంగారం వొలకబోసిన కుసంస్కారి, రైల్లో తటస్థపడ్డ రిచ్ ప్యాసింజర్. అతనంటే సహజంగా కలిగిన జుగుప్సతో ఒక లిప్తపాటు, "మీ ప్రమేయం అనవసరం" అంటూ చూసి మళ్ళీ మురళీకృష్ణ తల తిప్పేసుకున్నాడు.

"ఈ వూరు నాది! ఈ వూరును మెచ్చుకున్నవాళ్ళు నా మనసుకు నచ్చినవాళ్ళు. అన్నట్టు మనం ఇద్దరం రైల్లో కలుసుకున్నాం కదూ? ఫ్రెండ్!" అన్నాడు పైపు కాలుస్తూ ఇంద్రసేన్, కాలితో నేలను తాటిస్తూ.

"మళ్ళీ వస్తాం!" లేవబోయాడు మురళీకృష్ణ. "మరోసారి!"

"ఉండండి సార్! చీరలు కొనుక్కుంటామన్నారు గదా — లేటెస్ట్ స్టాక్స్ తెప్పిచ్చాను సార్, బొంబాయినుండి, కలకత్తానుండి, అహ్మదాబాద్‌నుండి, గద్వాల, కంచి, ఆరణి, మాధవరం వగైరా వూళ్ళనుండి. చూడండి సార్, ఒక్కసారి..." ప్రొప్రయిటరు కొట్లో వున్న కుర్రవాళ్ళచేత రకరకాల చీరల్ని వాళ్ళ ముందు గుట్టలు పోయించాడు.

జరిగిన కథ — 3: మురళీకృష్ణ, ఇంద్రసేన్, పాటల మాలచ్చి ఒకే రైల్లో ప్రయాణం చేసి దిగవలసిన స్టేషన్లో దిగుతారు. ఆ స్టేషన్‌లో తప్పించుకొని పారిపోయిన తన కూతురుని వెతుకుతూఒక పిల్ల తండ్రి, అతని అల్లుడు మురళీకృష్ణకు తటస్థపడతారు. తన తండ్రిని, బామ్మను తలచుకుంటూ ఆనందపురం పోవడానికై స్టేషన్ బయటికి వస్తాడు మురళీకృష్ణ. ఆనందపురం వెళ్లే దారిలో దొంగతనంగా ఒక లారీలో ఎక్కుతాడు మురళికృష్ణ. అదే లారీలో దొంగతనంగా ప్రయాణం చేస్తున్న పెళ్లి కూతురు వేషంలో ఉన్న జీవనను చూస్తాడు. చంద్రన్నగర్‌కు పొలిమేరల్లో ఆగిన లారీనుంచి బయటపడ్తారు మురళీ, జీవన. జీవన, మురళీకృష్ణ జీవన మేనమామ ఇల్లు చేరుకుంటారు. ఒక్కడ జీవనకు సరైన రక్షణ లభించదని తెలుసుకున్న మురళీకృష్ణ ఆమెను తన ఇంటికే తీసుకెళతాడు. జీవన మురళీకృష్ణ తండ్రి, బామ్మల ఆదరాభిమానాలను పొందుతుంది.

ఆ చీరల్ని చూడగానే జీవన మనసు రెపరెప లాడింది. ఒకటి రెండు చీరల్ని పట్టుకుని చూసి 'ఎంత బావున్నాయో !' అనుకుంది స్వగతంగా.

ఆమె ఉత్సాహాన్నీ, ఆనందాన్నీ మురళీకృష్ణ భంగపర్చదల్చుకోలేదు. "సరే — తీసుకో నీకు కావలసినవి !" అన్నాడు ముందుకు వేసిన అడుగు వెనక్కు తీసుకుంటూ.

"ముందు మీరు సెలెక్ట్ చెయ్యండి, వాటిల్లో నుండి నేను ఎన్నుకుంటాను" అన్నది జీవన.

"ఓ. కే !" తన ముందున్న రకరకాల చీరల్ని, వాటి రంగుల్నీ, డిజైన్లనీ, పమిట చెంగుల్నీ, టెక్ చక్‌నూ, అన్నింటినీ కుణ్ణంగా పరిశీలించి ఓ అయిదు చీరలు సెలెక్ట్ చేశాడు మురళీకృష్ణ. వాటిని జీవనముందుకు తోసి, "ఎట్లా వున్నయ్ ఇవి నీకు ?" అన్నాడు.

ఆ అయిదింటిని దగ్గరకు లాక్కుని, పసిబిడ్డను పొత్తిళ్ళలో పట్టుకున్నట్లు పట్టుకుని మురిసిపోయింది. "బ్యూటిఫుల్ !" అంది. వాటిని ఓ పక్కన పెట్టింది.

"ఆ నెమలికంఠం రంగు బుటా చీర ఎంతండీ ?" అన్నది చేతిలోవున్న మరో చీరను చూపిస్తూ.

ప్రొప్రయిటరు ఆ చీర తీసి, మడతలు విప్పి, జీవనముందు పరిచాడు. "ఇది ప్యూర్ జరీ అమ్మా ! ఈ గులాబీరంగు బోర్డరుతో నెమలికంఠం రంగుచీరలు అసలు మార్కెటులోకి ఈ మధ్య రావడంలేదు సుమాండీ ! చీరంతా బుటా చూశారా ? కట్టుకున్న ఆడపిల్ల దేవతా స్త్రీలా మెరిసిపోతుందనుకోండి !!

"ఎంతయ్యా ధర ?" మురళీకృష్ణ అడిగాడు.

"ఎంతోనా అండీ— జస్ట్ సిక్స్‌టీన్ హండ్రెడ్ అండ్ ట్వెంటీ సెవెన్. మీరు కాబట్టి ఫైవ్ పర్సెంట్ డిస్కౌంట్ !"

మురళీకృష్ణ గతుక్కుమన్నాడు. తనదగ్గర మొత్తం ఆరువందలు లేవు, పదహారు వందల రూపాయలు ఖరీదుచేసే చీర బేరంచేస్తున్నాడు. ప్రస్తుత అవసరం ఖరీదైన చీరకాదు, తక్కువ ఖరీదులో రోజూ వాడకానికి పనికివచ్చే మన్నికైన నాలుగైదు చీరలు. జీవనకు ఆ మాత్రం తెలీదా ?

"పెళ్ళినాడు కొనుక్కుందువులే జీవనా ఇటువంటి చీర. ప్రస్తుతానికి జ్ఞాపకార్థమేకదా, మామూలు చీరలు నాలుగైదు తీసుకో చాలు."

జీవనకు అతని మాటల ఆంతర్యం అర్థమైపోయింది. "అవునవును ఆ సంగతే మర్చిపోయానుస్మీ !" అంటూ మామూల్మాలు చీరలు ఓ నాలుగు తీసుకుంది.

మురళీకృష్ణ క్యాష్ పే చేస్తున్నాడు.

అంతవరకూ పైపు కాలుస్తూ వాళ్ళ చీరల కొనుగోలు చూస్తున్న ఇంద్రసేన్ రెండగులు వేసి ముందుకువచ్చి "ఎక్స్‌క్యూజ్‌మీ!" అన్నాడు జీవనతో. "ఈ వూరు మా జమీ లోనిది. మీరు మా వూర్కికి వచ్చారు. ఊరును మీరు మెచ్చారు, మిమ్మల్ని మేము మెచ్చాం. బహుమతిగా ఓ చిన్న బహుమతి నిస్తాం, తీసుకోరూ ?" అన్నాడు.

జీవన తెల్లబోయింది. ఏం జవాబు చెప్పాలో తెలియలేదు. తటాపటాయిస్తూ మురళీకృష్ణ వేపు చూసింది.

ఇంద్రసేన్ నెమలికంఠం రంగు పట్టు చీరను ప్యాక్ చేయించి — "తీసుకోండి, దీన్ని చూసి మీరు ముచ్చటపడ్డారు. మీ ముచ్చటను తీర్చడం జమీందారుగా నా బాధ్యత !" అన్నాడు.


ఆమె మనసు రాయంచ అయింది. ఆ ప్యాకెట్టును అందుకోబోయింది. అంతలోనే మళ్ళీ ఆగింది. తీసుకోవచ్చునో ? లేదో ? మురళీకృష్ణ ఏమంటాడో ? ఆమెకు తీసుకుందా మనీవుంది, తీసుకోడం మంచిది కాదని ఏదో సిక్స్త్ సెన్స్ చెప్తోంది. చివరకు జీవన ప్రలోభాన్ని జయించింది. ఆ ప్యాకెట్టును అందుకోకుండా సుతారంగా తిరస్కరించింది.


"మీ ఆదరణకు థ్యాంక్స్ ! కానీ కొత్త వాళ్ళనుండీ కానుకలందుకోడం నాకు ఇష్టం వుండదు !"

అంతవరకూ ఆమెనే ఆతృతతో పరికిస్తున్న మురళీకృష్ణకు ఎంతో రిలీఫ్ అనిపించింది. జీవన అంతరంగపు ఔన్నత్యం విద్యుల్లతలా అతణ్ణి తాకింది. అతను విజయగర్వంలో ఇంద్రసేన్ వైపు చూశాడు — 'అందరూ ఆటకత్తెలూ, పాటకత్తెలూ కాదు బ్రదర్ ఈ లోకంలో' అన్నట్లుగా. ఇంద్రసేన్ తన పరాభవాన్ని, జీవన తిరస్కారాన్ని అతిమామూలుగా తీసుకున్నాడు. నవ్వేస్తూ, "బ్యాడ్ లక్ !" అన్నాడు.

"ఎవరికి ?"







జీవన మురళి

''మీకు బహుమతిని ఇవ్వలేకపోయిన నాకూ, మంచి చీరను పోగొట్టుకున్న మీకూనూ !''

''నేనట్లా అనుకోడం లేదు, దురదృష్టం పాపం ఈ కొట్టువాళ్ళది, అంత ఖరీదైన చీరను అమ్మలేకపోయినందుకు !'' అన్నది జీవన హాస్యంగా.

''యూ ఆర్ ఏ స్పోర్ట్ !'' అన్నాడు ఇంద్రసేన్.

జీవనకు ఆ వాక్యం సరిగా అర్థం కాలేదు. తెలియనట్లుగా మొహం పెట్టకుండా, అసలు అతని మాటల్నే విననట్టుగా, ''పోదామాండీ'' అని అడిగింది మురళీకృష్ణ వైపు తిరిగి.

''పోదాం పద.''

జీవన, మురళీకృష్ణ చీరల ప్యాకెట్లు తీసుకుని షాపు బయటకు వచ్చారు.

''కాసేపు నడుద్దామండీ ! వాతావరణం ఎంతో ఆహ్లాదంగా వుంది''

''తమ చిత్తం !''

సైకిలుకు వెనక పొట్లం కట్టి, సైకిలును నడిపించుకుంటూ మురళీకృష్ణ నడుస్తున్నాడు. జీవన పైన ఎగిరే పిట్టల్నీ, రోడ్డుమీద నడిచే మనుష్యుల్నీ, పరుగెత్తే వాహనాల్నీ, బేరాలు సాగుతున్న షాపుల్నీ, ఆ షాపుల్లో అలంకారాల్నీ చూస్తూ ఆమాటా ఈమాటా మాట్లాడుతూ నడుస్తున్నది.

ఆనందపురం కొండల మధ్యలో వుంది. అయినా రహదారుల కేంద్రం కావడంతో పగలూ, రాత్రీ మేల్కొనే వుంటుంది. ఆ వూళ్ళో వో జూనియర్ కాలేజీ వుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వుంది. పన్నుల కార్యాలున్నాయి. ఓ సినిమాహాలు పర్మనెంటు బేసిస్ మీదా, టెంపరరీ బేసిస్ మీద వో డేరా హాలూ వున్నాయి. పోలీస్ స్టేషనుంది. రెండు క్లబ్బులున్నాయి. పురాతనమైన దేవాలయం వుంది. ఆ దేవాలయానికి చాలినన్ని భూములున్నాయి. అది పట్టణ వేషం వేసుకున్న పల్లెటూరు. పల్లెటూరి వెరకబాటు తనం వున్న పట్టణం. అక్కడకు దగ్గర్లో పురాతన కాలం నాటి శిథిలాలున్నాయి. ఆ శిథిలాలను చూడడానికి అప్పుడప్పుడూ తెల్లవాళ్ళు వస్తుంటారు. ఆ తెల్లవాళ్ళు రకరకాలుగా వస్త్రధారణం చేస్తుంటారు. అంచేత జీవనను వాళ్ళు కొత్తగా చూడడం లేదు. జీవన మాత్రం అందర్నీ కొత్తగా చూస్తోంది.

''ఇహ ఇంటికి వెళ్ళిపోదామా ?'' మురళీకృష్ణ అడిగాడు.

''ఏవో శిథిలాలూ అవీ వున్నయ్యన్నారుగా, అవి కూడా చూసేసి ...'' జీవన మెల్లగా అన్నది.

''ఏం ఆకలి కావడం లేదా ?''

''మీకవుతుంటే ఇంటికి పోదాం !''

''ఆకలి తీర్చుకోడానికి ఇంటికేపోవాలా ? మా వూళ్ళో డిక్కీ హోటళ్ళు ఎంత బావుంటాయో చూద్దువుగాని పదా !''

అతను జీవనను వో గుడిసె హోటలులోకి తీసుకువెళ్ళాడు. పైకి అది గుడిసెగా కనిపిస్తున్నా లోపలంతా ఎంతో శుభ్రంగా వుంది.

''ఎప్పుడొచ్చావ్ కృష్ణయ్యా ?'' హోటలు ప్రొప్రయిటరడిగాడు.

''పొద్దున వచ్చానయ్యా, బావున్నావా ?'' మురళీకృష్ణ కూడా కుశల ప్రశ్నలు వేశాడు. ''జీవనా, రెండేళ్ళ క్రితందాకా ఈ హోటల్లోనే పొద్దున్నే ఇడ్లీ, పదిగంటలకు పెసరట్టు, సాయంకాలం ఊతప్పం ... !''

''మరి ఇంట్లో అన్నమో ?'' జీవన ప్రశ్నకు అతను పగలబడి నవ్వాడు.

''రోజూ నాకూ మా బామ్మకూ యుద్ధమేగా !'' జీవన అందంగా నవ్వింది.

''అయ్యరూ ! ఈ అమ్మాయిగారు మన గెస్ట్. ఏం ఇస్తావ్ ?''

''ఉల్లి పెసరట్టు ఇయ్యమంటారా ?''

''ఇయ్యియ్యి !''

పెసరట్లు తిని, బ్రూ కాఫీ తాగి, అయ్యరును పొగిడి ఆ హోటల్లోనుండి బయట పడ్డారు వాళ్ళిద్దరూ వో అరగంటకు. వాళ్ళు బయటకు వస్తున్నారు — కార్లో ఇంద్రసేన్ మరికొందరూ, ఆ కారు వెనక రెండు మోటారు సైకిళ్ళూ అతివేగంగా పోతూ కన్పించాయి.

''జమీందారుగారు వేటకెళ్తున్నారు ?'' అన్నారెవరో అక్కడున్నవాళ్ళు.

''ఏం వేటాడుతార్ట దొరవారు ?'' మురళీకృష్ణ వెటకారంగా అడిగాడు.

''కుందేళ్ళూ, లేళ్ళూ సాధుజంతువులు ! అవి తప్ప పులుల్నీ, సివంగుల్నీ వేటాడ్డమే. అయ్య బాబోయ్ !''

''శిథిలాల దగ్గరకు మనం సైకిల్ మీద పోవలసిందే ! నడిచి వెళ్తే ఇంక రేప్పొద్దున్నే రావడం !''

''నే రెడీ !'' జీవన మనసు ఉత్సాహంతో తేలిపోతోంది. సైకిలు నేలమీద ఉరుకులు పరుగులుగా దొర్లిపోతోంది. మురళీకృష్ణ ఓ ఎంకిపాట నందుకున్నాడు. శిథిలాల దగ్గరకు వచ్చే వరకూ అతను పాట నాపలేదు. అవన్నీ పురాతన శిథిలాలు ! రాళ్ళు, మట్టిదిబ్బలు, ఎండకూ, వానకూ ఎండుతున్న బొమ్మలు. ముక్కులూ, చెవులూ పోగొట్టుకున్న ఆ బొమ్మలమీద మొలిచిన పిచ్చిమొక్కలు. ఆ పక్కనే తరతరాల చరిత్రకు సాక్షీభూతంగా మౌనంగా రోదిస్తూ పారుతోంది నిండుగా వో ఏరు.


''ఇవ్వేనా శిథిలాలు ?'' అన్నది జీవన, తీసి పారేస్తున్న ధోరణిలో.

''శిలలు ద్రవించి ఏడ్చినవి ...'' పద్యం అందుకున్నాడు మురళీకృష్ణ ''ఈ ముక్కలెప్పటివో మన తెలుగు వారికక్కరలేదు. కొంత కాలం క్రితం, స్వాతంత్ర్యం రాక పూర్వం ఇంగ్లీషువాళ్ళు వచ్చారు. అప్పటికి ఎన్నో బొమ్మలుండేవి ఇక్కడ, అందంగా, రకరకాల భంగిమల్లో. బావున్నవన్నీ వాళ్ళు బ్రిటీషు మ్యూజియంకు తరలించుకు పోయారు. వాళ్ళు వదలేసిన వాటిలో బావున్నవాటిని మనవాళ్ళే కొందరు తస్కరించారు. ఇంక మాకు ఇక్కడ మిగిలినవి ఇవిగో ఈ మట్టీ, దూగరా, కుండపెంకులూ, రాళ్ళ

న్యూట్రమూల్ శక్తి.

ఛాంపియన్లు ఎంచుకునేది యిది.

న్యూట్రమూల్. సమృద్ధి ఆయిన అమూల్ పాలు, ఎంచిన మాల్ట్, ఆరోగ్యాన్నిచ్చే విటమిన్లు, పుష్టినిచ్చే ప్రోటీన్లు, అత్యవసరమైన ఖనిజాలు, ఉల్లాసాన్నిచ్చే చాక్లెట్... యివన్నీ గూడా బోర్న్‌విటా, బూస్ట్, మాల్టోవా కన్నా చాలా తక్కువ ధరలో. మరో విషయం గుర్తుంచుకోండి, కేవలం న్యూట్రమూల్‌కే ఐ ఎస్ ఐ నాణ్యతముద్ర వుంది.



మరింత పొడుగ్గా, బలంగా, పుష్టిగా అవడం ఎలా?

కనివిని ఎరుగని శక్తినిచ్చే పుస్తకపు కానుక!

To Nutramul, P O Box 10148, Bombay 400 001 nn

ప్రియమైన న్యూట్రమూల్,

దయయుంచి నాకు దారాసింగ్ గారి 'హైట్ ఇన్‌క్రీజ్ స్ట్రెంగ్త్ అండ్ ఫిట్‌నెస్' పుస్తకం పంపించండి. నేను రు. 1-50 పోస్టేజి స్టాంపులూ, న్యూట్రమూల్ 500 గ్రా. డబ్బా కొన్న క్యాష్ మెమోనీ జతపరుస్తున్నాను సరుకు సరుకు వున్నంతవరకే యీ కానుక అని నాకు తెలుసు.

పేరు ________________ (పెద్ద అక్షరాలలో)

అడ్రసు ______________________________

మార్కెట్ చేయువారు:

గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లి.

ఆనంద్ 388 001.

daCunha/GCM/76/TL/82

ముక్కలూ, దిబ్బలూనూ ! అయితే అదిగో అక్కడ ఆ గుహ వుంది చూడు— దాన్ని చూస్తే మాత్రం నువ్వు ఆనందంతో మూర్ఛిల్లుతావు. పదపద !''

ఆ గుహలో ముందు కొంత వెల్తురుంది. మసక వెలుతురు. ఆ వెలుతుర్లోనే అటూ యిటూ గోడలకు వర్ణచిత్రలున్నాయి.

''దగ్గరకు రా, చూడు వీటిని !''

జీవన వాటికి దగ్గిరగా వచ్చి వాటిని విస్మయ నేత్రాలతో చూసి, ''ఛీ—పాడు!'' అంటూ కళ్ళు మూసుకుంది.

వాత్సాయన కామసూత్రాలకు ఆ వర్ణ చిత్రాలు రూపవ్యాఖ్యానం చేస్తున్నాయి. కోణార్క్, ఖజురహో భంగిమలు వాటికి తీసి కట్టుగా వున్నాయి. ఎన్నిరకాల రతిభంగిమలు ! సతీపతుల కుతూహల ప్రణయ రహస్య సందేశాలు !!

జీవన కంటి కొసల నుండి, వ్రేళ్లనుండి దొంగ దొంగగా మురళీకృష్ణను చూసింది. అతనొక మహాఋషిలా వాటి ముందు నిలబడి, నిర్వికారంగా వాటినే తదేక దీక్షగా చూస్తూ ఒక్కొక్క చిత్రాన్నీ వివరిస్తున్నాడు.

''ధర్మార్ధ కామమోక్షాలనేవి చతుర్విధ పురుషార్ధాలు జీవనా ! ఇందులో ధర్మ సంబంధంగా కామాన్ని నెరవేర్చుకోవడం మనుష్య కర్తవ్యం ! ఆ కర్తవ్యాన్ని గుర్తించారు కాబట్టే మన మహర్షులు ''ఇదిగో ఈ విధంగా ప్రవర్తించండి'' అంటూ నిర్దేశిస్తున్నారు. ఇందులో తప్పేముంది ?''

జీవన జవాబు చెప్పకుండా గుహాంతర్భాగంలోకి వెళుతున్నది. అక్కడ దట్టంగా సిరాలాంటి చీకటి. ఎక్కడి నుండో రివ్వున చలిగాలి. ఆ గాలి ''ఓం'' అంటూ శబ్దిస్తున్నది. ఓం...ఓం... ఓం... ఎటునుండి విన్నా అదే శబ్దం. చెవుల్లో ఆ శబ్దం దూరి గుండె లోతుల్లో ప్రతిధ్వనిస్తున్నది. ఓం..ఓం...ఓం...పంచేంద్రియాలనూ పట్టుదప్పించి సర్వదృష్టి శబ్ద బ్రహ్మం వేపు సాగిపోతున్నది. ఓం...ఓం...ఓం...జీవన కూడా తనకు తెలియకుండానే ఆ శబ్దాన్ని పునశ్చరణ చేయసాగింది ఆ శబ్దం క్రమంగా బిందువై, అణువై, మహాణువై, రూపమై, మహారూపమై ఆమెను అణగదొక్కి వేయసాగింది. ఆమె ఆ శబ్దం బరువుకు తట్టుకోలేక పోయింది. వివశయై, పడిపోతూ పోతూ 'మురళీ' అని కేకవేసింది. మురళీకృష్ణ గభాలున పరుగెత్తుకుని వచ్చాడు. పడిపోతున్న ఆమెను చేతుల్లోకి తీసుకున్నాడు. ''ఏమైంది జీవనా, ఏమైంది?'' అంటూ ఆత్రంగా అడగసాగాడు. జీవన ఎత్తైన రొమ్ములు ఉద్వేగంతో ఎగసెగసి పడుతున్నాయి. ఆమె కళ్ల నుండి సంతత ధారాపాతంగా కన్నీరు కారిపోతున్నది. ఓం... ఓం

జీవన మురళి

... అంటున్నాయి ఆమె పెదవులు వినిపించీ వినిపించకుండా.

ఆమెకు తిరిగి స్పృహ వచ్చేసరికి తాను మురళీకృష్ణ చేతుల్లో వుండడం, అతను తన వేపే తదేకంగా చూస్తుండడం గమనించింది జీవన. సిగ్గుతో దిగ్గున లేచి కూర్చుంది. అటూ యిటూ చూసింది. సూర్యుడు మామ్మూలుగానే వున్నాడు. శిధిలాలు నిశ్చలంగా వున్నాయి.

ఆ గుహ చలన రహితంగా కన్పిస్తోంది

''ఏమైంది నాకు ?'' జీవన అడిగింది.

''ఎందుకు అట్లా పడిపోయావూ ?'' మురళీకృష్ణ అడిగాడు.

''ఏదో వోమ్మనే శబ్దం నా మెదడును, ఆలోచనను, గుండెను, అనుభూతిని అన్నింటినీ ఆక్రమించుకుని, నన్ను నన్ను కాకుండా చేసింది !'' అన్నది జీవన కొద్దిగా వణుకుతూ.

''అదే ఈ గుహ గొప్పదనం ! లోపల వో మిస్టీరియస్ శబ్దం వుంది. ఆ శబ్దం ముందు ఎవరూ ఎదురుగా వుండలేరు, అలవాటయ్యేటంత వరకూ !... బైదిబై, ఇప్పుడు ఆర్‌యూ ఆల్‌రైట్ ?''

''ఆ...హా... !'' జీవన తలూపింది.

''ఇహ ఇంటికి పోదామా ?''

''పదండి !''

ఇద్దరూ ఇంటికి వచ్చారు. కాళ్ళూ చేతులూ కడుక్కున్న తర్వాత, కొన్న చీరల్లో ఒక చీరను కట్టుకుని వచ్చి జీవన, ''బామ్మ గారూ, కాళ్ళు జాపండి. నమస్కారం చేస్తాను!'' అన్నది వర్ధనమ్మతో.

కాళ్ళకు నమస్కారం చేస్తున్న జీవనను మనస్ఫూర్తిగా దీవించింది, ''కోరినవాణ్ణి కట్టుకుని, నూరేళ్ళూ పసుపు కుంకుమల్తో, పిల్లాపాపల్తో లక్షణంగా కాపురం చెయ్ తల్లీ !''

ఆ దీవెన వినగానే జీవన చెంపలు సిగ్గుల మొగ్గలైనాయి. ''ఏవండీ ?'' అన్నది ఏదో చెప్పాలన్నట్టు.

''రండి రండి ముందు భోంచేయండి, ఆ తర్వాత కబుర్లు...!'' అంటూ వర్ధనమ్మ వాళ్ళిద్దరికీ ఒకేసారి వడ్డించి, అమ్మలా అన్నీ దగ్గరుండి కనుక్కుంది. ఇద్దరూ కొద్దికొద్దిగా తినడం చూసి, ''ఏం తిండర్రా ఇది, పిట్ట మెతుకులూ, మీరూనూ'' అంటూ కోప్పడింది.

ఆమె ఇంకా కోప్పడడం పూర్తికానేలేదు, వాళ్ళిద్దరూ విస్తళ్ళ ముందునుంచి లేవనేలేదు, పరమేశ్వరం జూదంలో సర్వం వోడిపోయిన ధర్మరాజులా, ఉస్సురనుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ లోపలకు వచ్చాడు.

''ఏం నాన్నా, ఏమైంది ?'' అన్నాడు గభాలున అన్నం ముందు లేస్తూ మురళీకృష్ణ.

జీవన చేతిలో అన్నంముద్ద అట్లాగే వుండిపోయింది.

పరమేశ్వరం కొడుకువేపు చూడలేనట్టుగా తల అవతలకు తిప్పుకుని. జేబులోనుండి ఓ కాయితం తీసి అందించాడు.

టైపు చేసిన కాయితం.

ఆ కాయితం కింద ఇంద్రసేన్ సంతకం వుంది.

పరమేశ్వరాన్ని సర్వీసునుండి సస్పెండు చేస్తూ ఇంద్రసేన్ ఇచ్చిన ఆర్డరు కాయితం అది.

''నిన్ను... నిన్ను... సస్పెండు చేశారా నాన్నా ?!'' మురళీకృష్ణ నమ్మలేకపోతున్నాడు. అతని అన్నంచెయ్యి ఎండిపోతున్నది.

''కలలోనైనా అబద్ధం చెప్పవే, హాస్యానికైనా పాపం చెయ్యవే, నీకు సస్పెన్షన్ ఏమిటీ?''

వర్ధనమ్మ రోషంగా ప్రశ్నిస్తున్నది. ''నా కొడుకెటువంటివాడో నాకు తెలుసు. లోకానికి తెలుసు, కొత్తగా వచ్చిన ఈ కుర్రనాగన్నకేం తెలుసూ ?''

జీవన చెయ్యి కడుక్కుని అక్కడకు వచ్చి వో మూలగా నిలబడింది. తనకు పట్టుచీర బహుమతిగా ఇవ్వబోయిన ఇంద్రసేన్, పరమేశ్వరంగారి నెందుకు సస్పెండు చేశాడో ఆమెకు అర్థం కాకుండా వుంది. ఇంద్రసేన్ పెద్ద మనసు గల పెద్దమనిషా ?... చిన్నమనసు గల సంస్కారహీనుడా ?

''ఏం జరిగింది మావయ్యగారూ ?'' అని అడిగింది చీరకొంగు వేలికి చుట్టుకుంటూ.

''ఏం జరిగిందా ?'' పరమేశ్వరం విషాదంగా నవ్వాడు. ''వినండి, చెబుతాను.''

ఆయన చెబుతున్నాడు. వాళ్ళు వింటున్నారు.

* * *

రోజూలాగానే ఇవ్వాళా సరిగ్గా పదినిముషాల తక్కువ పది గంటలకల్లా స్కూలుకు వెళ్ళాను.

మాకూ స్వాతంత్ర్యం వచ్చింది ... !

ఈ దేశంలో
ప్రజల కంటే ముందు
అవినీతికి
అధికధరలకే
'స్వాతంత్ర్యం'
వచ్చిందనుకుంటూ ...!
అందుకే అవి
ఏ ఏడుకాఏడు
స్వేచ్ఛా విహంగాల్లా
ఆకాశపు అంచుల్లోకి
ఎగిరిపోతున్నాయి
విజయగర్వంతో.

- తాతినేని తులసి మోహన్

వెళ్ళిన ఒకటి రెండు నిముషాలకల్లా రిజిష్టరులో సంతకం చేసేసాను. అయిదు నిముషాల తక్కువ పదికి ప్రేయర్ బిగిన్ చేయించాను. పది గంటలకు గంట కొట్టే సరికి క్లాసులు స్టార్టయ్యాయి. గ్రౌండ్‌లో పిట్ట పురుగులేదు.

అటెండెన్సు రిజిష్టరు రూము రూముకీ తిరుగుతోంది. నేను కూడా నా చెకింగ్ రౌండ్ పూర్తి చేసుకుని వచ్చి నా గదిలో, నా చెయిర్‌లో కూచుని రొటీన్ వర్క్ చూసుకోడం మొదలెట్టాను. పేరుకు హెడ్మాష్టరు కానీ, వాస్తవానికి గ్లోరిఫైడ్ హెడ్ క్లార్క్ కాదూ మా ఉద్యోగం? ఎన్ని ఫైళ్ళూ! ఎన్నిరకాల కరస్పాండెన్సూ! ఎన్నెన్ని సంతకాలూ! డబ్బుకు సంబంధించిన ఏమేం లావాదేవీలూ!

సరే, నా గొడవలో నేనున్నా. ఇంతలో ప్యూను ముత్యాలు పరుగెత్తుకుంటూ వచ్చాడు. రహస్యం దాచుకోలేనట్టుగా వాడు నానాయాతనా పడిపోతున్నాడు. "ఏమిటి ముత్యాలూ?" అనునయంగా అడిగాడు.

"చెకింగ్‌కు వస్తార్టయ్యా— సడన్ చెకింగ్‌కు!" అన్నాడు వాడు వగరుస్తూ.

"ఎవరు?"

—"జమీందారుగారండీ!"

"నీకేం మతిబోయిందేవిట్రా? ఆయన పోయి పదేళ్లపైనే అయింది కద్రా?"

"సచ్చిపోయిన జమీందారుగారు కాదంటండీ! బతికొచ్చిన కుర్ర జమిందారు గారంటండీ!"


"ఒరేయ్ నాయనా, నన్ను చంపక కాస్త తెలిసేట్టు చెప్పు!" నేను కాస్త ఆత్రంగానే అడిగాను.

"అదిగాదండి! పెద్ద జమీందారుగారు సచ్చిపోనారా అండీ! ఆరు పోయిన్నాటికి కుర్రాయనకు పదిహేనేళ్ళు కూడా లేవుగందాండి! అందుకుని ఆయన్ను మదరాసో, వూటీయో, లండనో పంపించేసేర్టండి, నాకైతే నికరంగా తెలీదు మరి. ఆయనకిప్పుడు సదూవైపోయింది టండీ పాతికేళ్ళుకూడా వొచ్చేసినాయి కదుటండీ! మనూరు, తనబంగ్లా, పొలమూ పుట్రా, ఆస్తీ గిట్రా చూసేసుకుందామని అనిపించేసిందిటండీ! దాంతో సెలుగుర్రైదుగురికి మాత్రం ఈ సంగతి రగస్యంగా కబురెట్టే మొన్న బయల్దేరి వొచ్చేసినార్టండి. వొచ్చీ రాగానే దివానీగారు లేరండీ — పాపం ఆయనకో చాకలి రేవెట్టేసినార్టండి! దేవిడీలో పద్దతులన్నీ మార్చేస్తున్నార్టండీ! అబ్బో —మాసెడ్డ సిక్కుట బాబూ ఆయనో!" ముత్యాలు నాకు బాగా దగ్గరకు వచ్చి—రహస్యం చెబుతున్నట్టుగా అన్నాడు.

"ఆయనగారికి నోట్లోకీ, పడకలోకీ సుక్క లేకపోతే సుకం వుండదుటండి!"

"ఆహా!"

"వస్తూనే సక్కలోకి వో పాటల పిల్లను కూడా తెచ్చుకున్నాట్ట బాబయ్యా!"



"ఛీ! ఛీ!"

"ఆనందపురంలో కంటికి నచ్చిన సరుకు దొరుకుద్దో లేదో, అని ఆ పనిసేశాట్టండి ఆయనగోరు, ఆయన మడుసులే అన్నారు!"

ఆ మాటలు నాకు జుగుప్సను కల్గించాయి. అతనంటే అప్పుడే వో తక్కువ భావం ఏర్పడి పోయింది లోలోపల.


"ఇస్కూలు ఆయన బాబు కట్టించింది కదండీ! ఇంతకాలం ఆ దివాన్జీ ప్రెసిడెంటుగా వున్నాడు గదాండీ ఆళ్ళ తరపున! ఇంకేం కుదర్దని, తానే తీసుకున్నాట్టండీ అధికారం! అది మనకందరికీ తెలియజెప్పడం కోసమూ, అంతా సరిగ్గా వుందో లేదో చూట్టం కోసమూటండీ, ఇప్పుడొత్తున్నది!

"రానీవయ్యా, తలతీసి మొలేస్తాట్ట! ఉన్నదేదో చూస్తాడు. నమస్కారాలందుకుని వెళ్ళిపోతాడు."

"అంతేనండయ్య!" ముత్యాలు వెళ్ళిపోయాడు.

(ఇంకా వుంది)


వ్యక్తిగతం



భారతీయ జ్ఞాన పీఠం బహుమతి (రు 150000) అందుకున్న హిందీ కవయిత్రి శ్రీమతి మహాదేవి వర్మ. ఈమె వయసు 76. ఉత్తర ప్రదేశ్‌కి చెందినవారు....




జె. ఫ్రెడ్‌బాయర్ నడవలేక చక్రాల కుర్చీ వాడుతాడు అంత బాగా కనపడదు, వినపడదు. వయసు 99. అయినా, చురుకుగానే వ్యాపారం చేస్తున్నాడు. ఈయన నడిపే కంపెనీల అమ్మకాలు పోయిన ఏడు ఆరుకోట్ల రూపాయల పయిగా ఉన్నాయి. లాభాలు ఇందులో 25 శాతం పయినే ఉన్నాయి. అందుకనే షేర్ హోల్డర్‌లు ఈయన రిటయిరు కానక్కరలేదంటున్నారు. ఈయన ఉండేది అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని లూయిసియానా రాష్ట్రంలో ...



వల్లభబాయి రంకేది వైద్య వృత్తి. ఈయన వయసు 76. ఉండేది గాంధీగారు పుట్టిన పోర్‌బందర్. ఈ మధ్యనే ఆయన రాజస్థాన్ లాటరీలో రు 1 కోటి బహుమతి గెలుచుకున్నాడు ...

వారఫలం



26-8-1983 శుక్రవారం మొదలు 1-9-1983 గురువారం వరకు

♈ మేషం: సుఖశాంతులుంటాయి. ప్రజా రంగంలో పేరు తెచ్చి కొంటారు. చాల కాలంగా నిలచిన డబ్బు చేతి కందుతుంది. పెద్దల వలన గాని, రాజకీయంగా గాని జరుగ వలసిన పనులు నెరవేరుతాయి. స్త్రీలకు: బంధు విరోధం రాకుండా చూచుకోవాలి.

♉ వృషభం: ఉద్యోగం లభిస్తుంది, అలాగని ఊరుకోవద్దు. శ్రమ చేయటం మానుకోవద్దు. మీ ప్రయత్నలోపం ఉండరాదు. పని పాటల వారిపై అజమాయిషీ చేయాలి. స్త్రీలకు. దూర ప్రయాణాలు చెప్పదగిన అంశం. వీలైతే మాను కోవటం మంచిది.

♊ మిథునం: అధికారుల వలన గాని, రాజకీయంగా గాని, సాంఘికంగా గాని జరుగ వలసిన పనులు నెరవేరుతాయి. ప్రజా రంగంలో పేరు తెచ్చి కొంటారు. పెద్దల మూలాన మీ కేదో మేలు జరుగుతుంది. స్త్రీలకు: ప్రజా రంగంలో పేరు ప్రతిష్ఠలు ఉన్నత విద్యానుకూలత గలవారం.

♋ కర్కాటకం: గ్రామంలో గాని, నగరంలో గాని మీకు పెద్దరికం ఏర్పడుతుంది. పంచాయితీ వ్యవహారాలలో పెద్దరికం కనిపిస్తుంద వ్యాపారం బాగా సాగి పోవటానికి ఏ అభ్యంతరం లేదు స్త్రీలకు: కళా రంగ ఖ్యాతి, ధనలబ్ధి గలవారం.

♌ సింహం: బంధువులనో, పెద్దలనో కలిసికో మన్నారు. దాయాది వర్గం వలన పీడ ఏర్పడవచ్చు. సాహితీ లోకంలో మంచి పేరు తెచ్చి కొంటారు. ఒకవేళ ధన లబ్ధికి అవకాశ మున్నది. స్త్రీలకు: సుఖ శాంతులు, వస్తు వాహన సేకరణకు అవకాశం గలవారం.

♍ కన్య: వ్యాపారం బాగా విస్తరిస్తుంది. నష్టం ఏ మాత్రం రాదని బాగా విజృంభించాలి. చాల మంది వ్యాపార నిమిత్తం ప్రయాణాలు చేయ మున్నారు. కొందరకు కళా సాహితీ రంగాలలో పేరు కలుగుతుంది. స్త్రీలకు: దూర ప్రయాణాలు, బంధువుల వలన శుభ వార్తా శ్రవణం గలవారం.

♎ తుల: సులభంగా ఒకానొక వ్యవహారం మీకు అనుకూలమే. వ్యాపారంలో ఎలాంటి లోపం కనిపించదు. విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి అనుకూలత గలదు. రాజకీయ రంగాన అభివృద్ధి గలదు. స్త్రీలకు: కళా రంగ ఖ్యాతి, ఆదాయం గల వారం.

♏ వృశ్చికం: మీతో వ్యాపార నిమిత్తం పోటీ పడే వారుంటారు, గమనించి మెలగండి. మేలు పొందిన వారు పెద్దగా లాభదాయకంగా సంచరించరు. స్త్రీలకు. అంద వలసిన ధనం అందటం, అవసరాలు తీరటం జరుగుతుంది.

♐ ధనుస్సు: మేలు పొందిన వారు తిరిగి కూడా చూడరు. అధికారులు మీకు అనుకూలంగా ప్రవర్తిస్తారు. ఆదాయం గల వారం చాలమందికి పరదేశాలకు పోవలసిన పరిస్థితు లుంటాయి. స్త్రీలకు: మాటకు విలువ పెరగటం, ఆదాయం అభివృద్ధి చెందటం గమనిస్తారు.

♑ మకరం: శ్రమించండి. ఖర్చులు బాగా తగులుతాయి. గనుక, తగినంతైనా సేకరించాలి గదా! వ్యాపార విస్తరణ కార్యక్రమం చేపట్ట మున్నారు. మీకు నాలుగు విధాలా లాభదాయకమే. స్త్రీలకు: ఉద్యోగాభివృద్ధి, వృత్తిలో పెంపు నూతన నాంశాలు గ్రహించటం చెప్ప దగిన అంశాలు.

♒ కుంభం: నల్లని వస్తు విక్రేతలకు లాభమున్నది. శుభ కార్యానుకూలత చేకూరుతుంది. వృత్తిలో ఆదాయం, రాక తనఖా పడిన ధనం అందటం గమనిస్తారు. స్త్రీలకు: పనుల వత్తిడి వలన ఏది ముందు చేయాలో, ఏది వెనుకనో తెలిసికోలేక తికమకలు పడుతారు. నిదానం ప్రధానం.

♓ మీనం: వ్యాపారంలో సాటివారి పోటీ హెచ్చే అవకాశ మున్నది. సభా కార్యక్రమంలో కొందరు పాల్గొనటం జరుగుతుంది వృత్తి యందు అభివృద్ధి కనిపిస్తుంది. ఉన్నతాధికారుల నుండి జరుగ వలసిన పనులు సుకరంగా నెరవేరుతాయి. స్త్రీలకు: ఉద్యోగంలో మార్పునకు అవకాశం, కించిత్తు ఆదాయం, కొందరకు నూతనోద్యోగ ప్రాప్తి నిశ్చయం.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి ★

నీతిలేని కథ

నందం రామారావు

''ఏయ్ రిక్షా ! వస్తావా ?''

అప్పుడే బేరం దింపి చెమట తుడుచుకుంటున్న వీరయ్య ఆమాట విని తలెత్తి చూశాడు.

ఎదురుగా ఎవరో సూట్‌వాలా !

ఒక చేత్తో సూట్‌కేస్ పుచ్చుకుని, మరో చేత్తో గాగుల్స్ సరిచేసుకుంటూ ఠీవిగా నిలబడి వున్నాడు.

''వొస్తాను బాబూ. ఎక్కడికి పోవాలా?'' అనడిగాడు వీరయ్య.

''బస్సుస్టాండుకి ఎంతివ్వమన్నావ్ ?'' అన్నాడు సూట్‌వాలా.

''రెండు రూపాయలిప్పించండి బాబూ !!''

''ఏవిటీ ? రెండు రూపాయలా ? నువ్వీ వూరికి క్రొత్తనుకుంటాను. రూపాయిస్తాను. వస్తావా ?''

వీరయ్య నివ్వెరపోయాడు ఆమాటకి. బస్సుస్టాండుకి రూపాయా ? ఎంతలేదన్నా రెండు మైళ్ళపైన వుంటుంది. అందులోనూ ఎండ మాడ్చేస్తోంది.

రానని చెప్పాలనుకున్నాడు. మరో రోజైతే అలాగే చెప్పేవాడు. కానీ, ఈ రోజు లేస్తూనే అనుకున్నాడు — సాయంత్రం లోపు ఇరవై రూపాయిలు సంపాదించాలని. అందుకే, ఏ బేరాన్నీ పోనియ్యడం లేదు !

''ఏవిటీ చెప్పు ?''

వీరయ్య భుజం మీదున్న తుండుగుడ్డను దులిపి, ముఖం తుడుచుకుంటూ —

''రూపాయన్నర ఇప్పించడయ్యా !'' అన్నాడు.

సూట్‌వాలా కాదన్నాడు.

చివరకు బేరం రూపాయిన్నరకు కుదిరింది.

సూట్‌వాలా రిక్షా ఎక్కాడు.

వీరయ్య రిక్షా తొక్కుతున్నాడు. టైమ్ మూడు గంటలవుతోంది. ఇంకా చల్లబడలేదు. అసలే వేసవికాలం.

వీరయ్యకి ఆయాసం వస్తోంది. చేతులు జారిపోతున్నాయి. కాళ్ళు తడబడిపోతున్నాయి.

ప్రొద్దున్న ఇంటినుంచి వస్తూ గంజినీళ్ళు మాత్రం తాగాడు. మధ్యాహ్నం పావలా బన్ను, ఇరవై పైసల 'టీ'తో సరిపెట్టుకున్నాడు.

సాయంత్రం ఏడుగంటలకి ఇరవై రూపాయలు సంపాదించాలి. ఆ డబ్బుతో కడుపు నిండా తాగెయ్యాలి. రోజూ, డబ్బులేక గ్లాసు, అరగ్లాసుతో సరిపుచ్చుకుంటున్నాడు. ఈరోజైనా పండుగ చేసుకోవాలి. ఇప్పటికి పన్నెండు రూపాయలు సంపాదించాడు. ఇంకా నాలుగ్గంటల టైముంది. మిగతా ఎనిమిదిరూపాయలూ సంపాదించాలి !

వీరయ్య తాగబోయే సారాని తలచుకుంటూ వుషారుగా రిక్షా తొక్కసాగాడు.

* * *

రాత్రి ఎనిమిదిగంటలకు వీరయ్య 'సారా' పూటుగా తాగేసి హాయిగా పాడుకుంటూ ఇంటి దారిపట్టాడు.

వీరయ్య ఇంటికొచ్చేసరికి, అప్పటివరకూ మొగుడి కోసం ఎదురుచూస్తూ కూర్చున్న ఎల్లమ్మ లేచి గబగబా ఎదురొచ్చింది. వీరయ్య, ఎల్లమ్మను పక్కకు తోసేసి లోపలకొచ్చి నులక మంచం వాల్చుకుని పడుకున్నాడు.

మొగుడు నూకలుగానీ, డబ్బుగానీ తెచ్చి తన చేతిలో పెడతాడని ఆశగా చూస్తున్న ఎల్లమ్మకి, వీరయ్య అలా వెళ్ళి పడుకోవడంతో కోపం ముంచుకొచ్చింది.

ఇంట్లో నూకలుకూడా లేవు ! ప్రొద్దుట నుంచీ పిల్లలు ఆకలని ఏడుస్తుంటే —

''ఆనికి మీ అయ్య నూకలు తెత్తాడు. వొండిపెడ్తా'' అంటూ ఓదార్చింది ఇప్పటి వరకూ పిల్లల్ని.

ఈడు డబ్బంతా తగలేసి పీకల్దాకా తాగొచ్చాడన్నమాట !

అప్పటివరకూ వున్న నీరసంపోయి, ఆవేశం రాగా వీరయ్య దగ్గరకొచ్చి చెయ్యి పట్టుకుని కుదుపుతూ —

''నిన్నే. లెగు !!'' అంది ఎల్లమ్మ.

వీరయ్య బలవంతాన కళ్ళు విప్పుతూ —

''ఏంటే నీ గోల !!'' అన్నాడు.

''నూకలేవీ.''

''లేవు. రేపు తెత్తాలే.''

మొగుడు మాటలకి ఒళ్ళు మండిపోయింది ఎల్లమ్మకు. చూరులో వున్న కత్తి తీసి మొగుడి గుండెల్లోకి దింపాలన్నంత కోపం కలిగింది !

రెండు రోజులయింది పిల్లలు అన్నంతిని. వీరయ్యేమో సంపాదించిందంతా తాగేసి వస్తున్నాడు.

ఎప్పటివో ముక్కిపోయిన నూకలుంటే ప్రొద్దున్న గంజికాసి పిల్లలకు తలో గుక్కెడు పోసింది.

ఇప్పుడేం చెయ్యాలి ?

ఎల్లమ్మ చుట్టూ చూసింది.

పిల్లలు బిక్కమొగాలేసుకుని తలోచోట కూర్చున్నారు. ఆ స్థితిలో వాళ్ళని చూడగానే ఆ తల్లికి జాలి, దిగులూ కలిగాయి. ఎల్లమ్మకి ఆకలి బాధ ఎక్కువవడంతో కోపం, ఆవేశం చల్లారి నీరసం ముంచుకొచ్చింది.

ఎల్లమ్మకు ఆరుగురు సంతానం. పెద్దపిల్ల నీలి పదహారేళ్లది. ఆ తర్వాత వెంకటేశు పదమూడేళ్లవాడు. వాడి తర్వాత వాళ్లు చిన్న పిల్లలు.

ఇదివరకు ఎల్లమ్మ నాలుగిళ్లల్లో పాచిపని చేసి భర్త డబ్బులిచ్చినా, ఇవ్వకపోయినా ఇల్లు గడుపుకొచ్చేది ! కానీ, ఆఖరిపిల్ల పుట్టాక పెద్ద జబ్బుచేసి నీరసించిపోయింది. ఇంట్లో పని కూడా చేయలేకపోయేది. నీలి పదహారేళ్లదయినా సరైన తిండిలేక బొత్తిగా ఎండిపోయి వుండడంతో ఎక్కడాపనికి పెట్టలేదు. మొగుడు తీరు చూస్తుంటే నీలిని ఎక్కడో అక్కడ పనికిపెట్టక పోతే లాభంలేదనుకుంది. కానీ, నీలికి పని దొరికే వరకయినా ఈ ప్రాణాలు నిలుస్తాయో లేదోననే సందేహం కలిగింది ఎల్లమ్మకి.

రేపు గంజినీళ్ళైనా లేకపోతే ప్రాణాలు పోవడం ఖాయం. ప్రొద్దున్నే వీరయ్యచేత ఎలాగో అలా చారెడు నూకలైనా తెప్పించాలి !

* * *

ఉదయం బారెడు ప్రొద్దెక్కినా వీరయ్య మంచంమీద నుంచి లేవలేదు !

''ఏందయ్యోయ్. ఇంకా తొంగుండావే లెగు. లెగు'' అంటూ చెయ్యి పుచ్చుకుని లేపబోయింది ఎల్లమ్మ.

చెయ్యి చురుక్కుమంది.

''ఓలమ్మో. ఈ మడిసికి జొరం వొచ్చి నట్టుండాదే. ఇప్పుడేం సెయ్యాల'' అనుకుంది గాబరాగా.

''అమ్మా ! ఆకలే'' పిల్లలు లేచి తల్లి చుట్టూ చేరారు.

అసలే విసుగ్గా వున్న ఎల్లమ్మ —

''తెల్లారిందా మీకు ?'' అంటూ వాళ్ళకి తలొకటీ అంటించి అవతలకు నెట్టింది.

ఎండ కరకరలాడుతోంది.

పిల్లలకి అన్నం కావాలి.

భర్తకి మందు కావాలి.

వీటన్నిటికీ డబ్బు కావాలి ?

ఎల్లమ్మ దిగులుగా వీరయ్య మంచం ప్రక్కనే కూర్చుంది.

నీలి, తాను ప్రొద్దున్న గుడికెళ్ళినప్పుడు ప్రసాదంగా తెచ్చుకున్న బెల్లంముక్కని నీళ్ళల్లో కలిపి పిల్లలచేత తాగించింది.

వీరయ్య మూలుగుతున్నాడు. ఆఖరి పిల్ల పాలకోసం ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయింది.

ఎల్లమ్మకూ్కడా నీరసంతో కళ్ళు తిరుగుతున్నాయి. మంచం. పట్టీమీద తల వాల్చి కూర్చుంది.

అదిగో, ఆ సమయంలో వెంకటేశు తడికీ తోసుకుని లోపలకొచ్చాడు. లోపలంతా కలయ చూశాడు.

తుఫాను బీభత్సం తర్వాత పాడుపడిన వూరులా వుందా ఇల్లు !

అందరూ తలోచోటా నీరసంగా పడుకుని వున్నారు.

నిన్న పొద్దున్న అరగ్లాసుడు గంజి్రతాగి ఇంట్లోంచి బయట పడ్డాడు వెంకటేశు.

రాత్రి అయ్య నూకలు తెచ్చి వుంటాడు. అమ్మ అన్నం వండి వుంచుతుందనే ఆశతో వచ్చాడు.

ఇంటిస్థితి చూశాక ఒక్క క్షణం కూడా అక్కడ వుండబుద్ధి కాలేదు వెంకటేశుకు.

గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

* * *

సాయంత్రం ఆరు గంటలయింది.

వెంకటేసు వంతెన గట్టుమీద వెల్లికలా పడుకుని ఆకాశంవేపు చూడసాగాడు.

వంతెన క్రింద కాలువమీద నుంచి వచ్చే చల్లటి గాలి శరీరానికి తాకుతోంది. వంతెనమీద కార్లూ, రిక్షాలూ, సైకిళ్ళూ మనుషులూ ప్రవాహంలా సాగిపోతున్నారు.

'అయ్య తాగకుండా వుంటే ఎంత బావుణ్ను.'

ఈ మాట ఎప్పుడూ అనుకుంటూనే వున్నాడు.

ఈ రోజూ అనుకున్నాడు.

ఇప్పుడూ అనుకుంటున్నాడు.

కానీ ఏం లాభం ?

వెంకటేశు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి !

క్షణ క్షణానికి పెరిగిపోయి, కడుపులోని ప్రేవుల్ని తినేస్తున్న ఆకలిని భరించలేక పోతున్నాడు.

ఏం చెయ్యాలి ?

ఎలా ఈ ఆకలిని చంపాలి ?

గట్టుమీద పడుకున్న వెంకటేశు నెమ్మదిగా లేచాడు. పొట్ట వెన్నుకి అతుక్కుపోయింది. నీరసంతో కళ్ళు తిరుగుతున్నట్టుగా అన్పించి, క్షణంసేపు వంతెన గోడకు ఆనుకుని నిలబడ్డాడు. ఆ తర్వాత జారిపోతున్న లాగూని పైకి లాక్కుంటూ, మెల్లగా నడిచి వంతెన దాటి రోడ్డుమీద కొచ్చాడు.

ఒక్కసారిగా లైట్లు వెలిగాయి. వీధులన్నీ పకపకా నవ్వుతున్నట్లున్నాయి. వెంకటేశు చుట్టూ చూస్తూ నడుస్తున్నాడు. అద్దాల తలుపుల్లోంచి రకరకాల తినుబండారాలు నోరు వూరిస్తున్నాయి.

హోటళ్ళల్లోంచి బయటకొస్తున్న ఖరీదైన మనుషులు, రోడ్డు ప్రక్కనున్న బళ్ళల్లోవి కొనుక్కు తింటున్న మామూలు మనుషులు.

వీరెవరూ వెంకటేశుని చూడ్డం లేదు.

ఎక్కడ చూసినా తినే వస్తువులే.

ప్రపంచంలోని ఆకలంతా వెంకటేశు కడుపులోనే వున్నట్టుంది !

వెంకటేశు రెండు మూడు తినుబండారాల బళ్ళముందు నిలబడి చేయి చాపాడు. కానీ, వాడికి తిట్లూ, విదిలింపులు మాత్రమే దక్కాయి ! వెంకటేశు అక్కడ్నుంచి కదిలి ఒక మిఠాయి షాపుముందు నిలబడ్డాడు.

ఎదురుగా కంటికి నిండుగా ఏవేవో తీపి పదార్థాలు !

డేగలాగ వాటివేపే చూస్తూ నుంచున్నాడు. కొందరు ఎవరిక్కావల్సినవి వాళ్ళు కొనుక్కుని వెడుతున్నారు. వెంకటేశు చూస్తూ సహించ లేకపోయాడు.

కడుపులో అంతులేని ఆకలి ! ఎదురుగ్గా ఆకలిని తీర్చే ఆహారం !

ఇప్పుడు తన ఆకలి తీరాలంటే ఆ పదార్థాలు తన చేతిలోకి రావాలి. తనకూ వాటికీ ఎక్కువ దూరంలేదు. చెయ్యేస్తే అందుతుంది. చెయ్యి వెయ్యడానికి జేబులో డబ్బులుండాలి. ఆ డబ్బులు లేకపోవడం వల్లనే ఆ పదార్థాలు తనకు కొన్నిమైళ్ళ దూరంలో వున్నట్టుగావుంది.

"ఛొ ... ఫో."


కుక్కను విదిల్చినట్టు విదిల్చాడు షాపు యజమాని.

వెంకటేశుకి పట్టరాని దుఃఖం వచ్చింది. దుఃఖంతోపాటు ఆవేశం కలిగింది. క్షణంసేపు, కంటికి షాపులోవి తీపి పదార్థాలు తప్ప ఇతర ప్రపంచమే కన్పించలేదు.

అంతే !

మరుక్షణంలో నిలుచోడానికి ఓపికూడా లేని వెంకటేశు రోడ్డుమీద పరిగెడుతున్నాడు.

ఏం జరిగిందో తెలుసుకునేసరికి షాపు



చరితార్థత

శతాబ్దాల పోరాటానికి తుది మెట్టు
అహంకృత తెల్లవారి ఆట కట్టు
తరతరాల భరతజాతి విజయానికి తొలి మెట్టు
అర్ధరాత్రి జాతి అంత వెన్నెలతో కనుకట్టు
దివ్వె ఒకటి వెలిగింది; కాంతి రవ్వ విరిసింది
చీకటి దొంగల ప్రతి చేతికి కరదీపిక
మనీషులందించిన అమృతభాండం మన స్వాతంత్ర్యం
నేటి మనుషుల పాలిట మారింది స్వ(హా)తంత్రతంగ
పొరుగువాణ్ణి దోచుకొనే తారకమంత్రతంగ
అహర్నిశలు ఆడుతున్న మోసపు యంత్రతంగ
స్వాతంత్ర్యపు ప్రౌఢకాంత కన్నీటిని చిమ్ముతోంది
భరతజాతి భవిత అంతా బూడిద పన్నీరు అవుతోంది
సమభావం, సంతోషం వారికి అందజేయ
మన స్వతంత్ర భారతినే సర్వజగతి పూజింపగ
ఇకనైనా పురోగమించి, చరితార్థత నందుకొందాం
స్వాతంత్ర్యపు సందేశం నరనరాల నింపుకొందాం
బజారుకెక్కిన మన భారతి కన్నీటిని తుడిచేద్దాం.

— "సుచంద్ర"

*

ఏడాదికోసారి ఎగురు

ఈ జనం పెళ్ళిచూపుల్లో
పై మెరుగులకే మోసపోయిన వరులు
రాజకీయ వ్యూహాల మత్తు మాటలకు
మెత్తబడిపోయిన కంచి మేకలు
నిర్దమైన నిలువుటద్దంలో
ప్రతిబింబాన్ని నమ్మనివాళ్ళు
తెల్లని పాలలో నల్లని నీళ్ళే
ఎక్కువని ఎరగని వాళ్ళు
నినాదాల ఉరుముల్ని విని
ఆచరణ వర్షం కోసం
ఎదురుచూస్తున్న వాళ్ళు
చీకటి బజారులో పడి మగ్గుతున్న
వీళ్ళనే సూర్యుడు మేల్కొలుపుతాడు ?
ఓ ప్రియమైన పతాకా
అంతవరకు —
ఏడాదికోసారి ఇలాగే ఎగురు.

— 'పైడిపాల'

నీతి లేని కథ

యజమానికి రెండునిముషాలు పట్టింది. మొదట తెల్లబోయి, ఆ తర్వాత తెలివితెచ్చుకుని —

"దొంగ. దొంగ" అని అరవసాగాడు.

రోడ్డుమీద వ్యక్తులు ఎక్కడివారక్కడ ఆగిపోయారు. వారిలో కొందరు ధర్మమూర్తులు, న్యాయాన్ని నిలబెట్టడానికి కంకణం కట్టుకున్న వారు వెంకటేశు వెనకే పరిగెత్తారు.

ఆకలితో నీరసించిపోయిన వెంకటేశు వేగంగా పరిగెత్తలేకపోతున్నాడు.

ఆకలి అన్నదేవిటో తెలియని ఆ వ్యక్తులు వేగంగా పరిగెడుతున్నారు వెంకటేశుని పట్టుకోవడానికి.

మరునిముషానికి వెంకటేశుని పట్టుకున్నారు. 'ఎలాగైతేనేం న్యాయాన్ని రక్షించాం' అన్నట్టు వాళ్ళ ముఖాల్లో విజయగర్వం తొంగి చూస్తోంది.

ఎముకుల పోగులాటి వెంకటేశు బక్కచిక్కిన శరీరంపై కొవ్వుతో బలిసిన కొన్ని చేతులు టపటపా పడ్డాయి.

మొదటి దెబ్బకే వెంకటేశు నేలకు కరుచుకుపోయాడు. చేతిలోని రెండు లడ్డూలు దూరంగా పడిపోయాయి. "పడిపోవడం అంతా వేషం. ఈడ్చుకెళ్ళి పోలీస్టేషన్లో పడెయ్యండి. రోగం కుదుర్తుంది." ఎవరో ధర్మమూర్తులు సెలవిస్తున్నారు.

మరో ధర్మమూర్తి వెంకటేశు చెయ్యి పుచ్చుకుని లేపబోతున్నాడు.

ఇంతలో —

"ఆగండెహె. పసోడిని పట్టుకుని పసువులా కొడుతున్నారు" డబ్బాలో రాళ్ళుపోసి గిలకరించినట్టుగా మాటలు వినిపించగా అందరూ అటువేపు తిరిగారు.

పెద్ద పెద్ద పువ్వుల లుంగీ, తెల్లలాల్చీ, నల్లగా, పొడవుకుతగ్గ లావుతో రీవిగా నిలబడ్డ ఆ వ్యక్తిని చూసి అందరూ వెనక్కి తగ్గారు!

తమకంటే బలవంతులతో పోట్లాట పెట్టుకోవడం మంచిదికాదనే సూత్రం వాళ్ళకు తెలుసు. అందుకే మెల్లగా అక్కడ్నుంచి తప్పుకున్నారు!

ఆ వ్యక్తి ప్రక్కనున్న కిళ్ళీకొట్టు దగ్గర నుంచి ఒక సోడా తీసుకొచ్చి, వెంకటేశు ముఖం మీద ఆ నీళ్ళు చల్లాడు.

వెంకటేశు నెమ్మదిగా కళ్ళు విప్పాడు. మరో సోడా వెంకటేశుతో తాగించాడు. వెంకటేశు లేచి కూర్చున్నాడు.

ఆ వ్యక్తి వెంకటేశుకు చెయ్యి అందించి — "లెగు" అన్నాడు.

వెంకటేశు లేచి అతని వెంట నడవసాగాడు.

వెంకటేశు రెండడుగులు వేసిన వాడల్లా ఆత్రుతగా గిరుక్కున వెనక్కితిరిగి చూశాడు. అతని చేతిలోంచి జారిన లడ్డూలు ముక్కలై ఇసుకలో కలిసిపోయి వుంది!

వెంకటేశు భావం గుర్తించి ఆ వ్యక్తి — "ఇక అది పనికిరాదులే, రా!!" అన్నాడు.

ఆ వ్యక్తి వెంకటేశుని ఓ హోటల్లోకి తీసుకెళ్ళి బన్ను, టీ ఇప్పించాడు. వెంకటేశు ఆత్రంగా తినేశాడు.

వెంకటేశు వేపే చూస్తూ, సిగరెట్ తాగుతూ కూర్చున్న ఆ వ్యక్తి — "ఇంకో బన్ను కావాలా?" అనడిగాడు.

వెంకటేశు సిగ్గుపడుతూ — "వద్దు" అన్నాడు.

"లే. పోదాం. నువ్వు నడవగలవా?"

ఆకలి తీరడంతో వెంకటేశు కాళ్ళల్లోకి శక్తి వచ్చింది. తన ఆకలి తీర్చిన ఆ వ్యక్తి వేపు కృతజ్ఞతగా చూస్తూ — "ఓ" అన్నాడు.

"అయితే పద."

నడుస్తున్నారు.

"నా పేరు గురువులు."

వెంకటేశు తలెత్తి గురువులు వేపు చూశాడు.

"నీ గురించి చెప్పు" అన్నాడు గురువులు.

ఏం చెప్పాలో తెలియలేదు వెంకటేశుకి.

"నీ పేరు?"

"ఎంకటేశు."

"నీకు అమ్మా, బాబూ వున్నారా?"

"ఆ"

"మీ అయ్య ఏం చేత్తాడు."

"రిచ్చా లాగుతాడు."

"మీ అయ్య తాగుతాడా?"

వెంకటేశు తలొంచుకుని—


"ఆ. తాగుతాడు" అన్నాడు.

గురువులు పెదవులపై చిరునవ్వు వెలిగింది. జేబులోంచి సిగరెట్‌తీసి వెలిగించుకుని—

"ఐతే, నువ్వు దొంగతనం సెయ్యడానికి కారణం అదన్నమాట" అన్నాడు పొగవదుల్తూ.

వెంకటేశు తెల్లబోతూ గురువులు వేపు చూశాడు. గురువులు దూరాన బ్రిడ్జిమీద వెడుతున్న రైలుకేసి చూడసాగాడు.

(ముగింపు పై వారం)


కవితాగానం చేసే కళ్లకు...
ఐటెక్స్
అపురూప సౌందర్యంతో పొంగిపోయే
యవ్వనంతో మురిపించే వనితల వదనాలను
ఆకర్షించే అతివల కళ్లను, ఆనందంగా
కొనచూపులతో నటనమాడించేది ఐటెక్స్
శాస్త్రీయ విధానంతో తయారుచేయబడు
ఐటెక్స్ కాటుక అందాలు చిందేటి
యువతుల కళ్లను దోషమేమీ చేరనీయక
చల్లగా కాపాడుతుంది_
చూపులనే మాటలుగా మార్చే ఐటెక్స్
ఐటెక్స్ 39 సంవత్సరములుగ మీ నమ్మకానికి
పాత్రమైన ఉన్నతమైన చిహ్నం.
EYETEX REGD.
Eyetex REGD
అరవింద్ లాబరేటరీస్ మద్రాసు 600 033
Imageads-AL 1293 Tel

సీరియల్

మూగ ముత్యాలు

యలమంచిలి ఝాన్సీలక్ష్మి

(గత సంచిక తరువాయి)

ఓ రోజున కాలేజి నుంచి వస్తూంటే, శశిరేఖ కనిపించిదిది సారధికి. ఆమె ప్రక్కన ఓ యువకుడున్నాడు. అతని కనుబొమ్మలు ముడుచు కున్నాయి.

"ఈ రేఖకి యీ జన్మలో బుద్ధిరాదు !" అతని మనసు గొణిగింది. కావాలనే అక్కడే నిలబడిపోయాడు. శశిరేఖ వుత్సాహంగా నవ్వుతూ, ఏదో చెబుతోంది. సారధిని చూడగానే నిర్ఘాంత పోయింది.

"మీ పేరేమిటో చెబుతారా దయచేసి ?" సారధి మృదువుగా ప్రశ్నించాడు.

ఆ యువకుడు క్షణంసేపు ఆగిపోయాడు. ఆ తరువాత చెప్పాడు. "శ్రీనివాస్ అంటారు నన్ను ! మీరు..."

"శశిరేఖ నడగండి ! చెబుతుంది !" సారధి చరచరా నడిచి వెళ్ళిపోయాడు.

"రేఖా ? ఎవరీ మనిషి ? నీ పైన సర్వ హక్కులున్నట్లు చూశాడు !" శ్రీనివాస్ ప్రశ్న విన్న తరువాత అన్నది –

"సారధి ! అని చెప్పలేదూ ! ఇతనే! కళ్ళ తోనే యిది తప్పనీ, అది ఒప్పనీ నిర్ణయం చేస్తాడు ! చూశావుగా ! క్షణంలో మనల్ని ఏదో అపరాధం చేసిన మనుషుల్లా తేల్చిపారవేసి ఎంచక్కా వెళ్ళిపోయాడో !"

"నీకేమౌతాడన్నావ్? ఇతని పేరు ఎక్కడో విన్నట్టుందే !"

"అన్నయ్య నంటాడు ! నాకు మాత్రం అతణ్ణి చూస్తే యీ మధ్య గుళ్ళో దేవుణ్ణి జూసినట్లుంటోంది ! అతని ముందు నోరెత్తా లంటేనే భయం భయంగా వుంటోంది ! నేను చెప్పేది వినడసలు ! కొన్నిసార్లు 'ఎన్నో రోజులు' నాతో మాట్లాడకుండా వుండిపోతాడు ! రవ్వంత ఆలస్యంగా యింటికి వెళ్తే చూపులతోనే ప్రశ్ని స్తాడు ! రెండు మూడు గంటలు ఆఫీసులోనే వుంటే–ఫోను చేస్తాడు ! వాక్కాదు ! హెడ్ క్లర్కుకి ! మొన్న మనం పిక్చరు జూసి హోటల్లో డిన్నరు తీసుకుని వెళ్ళేసరికి బాగా ఆలస్యమై పోయింది గదా ! నేను వెళ్ళేవరకు అలాగే భోం చేయకుండా కూర్చుని వున్నాడు. నేను ఏమీ చెప్ప కుండా పడుకున్నాను ! భోజనం వడ్డిస్తున్న వాడే ఆగిపోయాడు ! వెంటనే గిన్నెలన్నింటినీ సర్దేసి తాను కూడా పడుకున్నాడు ! నా మూలాన తాను వుపవాసం జేశాడు ! విచిత్రమైన మనిషి !" రేఖ సారధి వెళ్ళిన వైపే చూస్తూ చెప్పింది.

"నే నుండగా నిన్నెవరూ ఏమీ చేయలేరులే డార్లింగ్ !"

"నన్ను వెళ్లనివ్వు !" రేఖ యింకా ఆలోచనల నుంచి తేరుకోనేలేదు.

"ఎందుకతడంటే యింత భయం ? !"

"భయంగాదు ! తలనొప్పిగా వుంది ! వెళ్తానుమరి !" ఆమె సెలవు తీసుకుని యింటికి వెళ్ళేసరికి లోపలి నుంచి సారధి గొంతు విన్పిస్తోంది.

"అరుంధతమ్మగారు నన్ను యింటి నుంచి వెళ్ళిపొమ్మన్నదే యిందుకురా ! శశిరేఖ విచ్చల విడిగా తిరుగుతోంది ! 'అలాంటి బజారు మనిషి నీ చెల్లెలని నలుగురికీ చెప్పక ముందే బయటికి నడువ'మన్నదామె. 'ఇన్నాళ్లెందుకు చెప్ప లేదన్నాను ! చిన్నాన్న చెప్పవద్దన్నారట ! ఆ తరువాత నన్ను అమ్మి డబ్బు సంపాదించాలను కుందట ! ఆ పని సాధ్యంగాక నన్ను వెళ్లి పొమ్మంది ! విజయక్కూడా కబురుచేస్తానంది ! మా అమ్మ గురించి యింకా ఏమేమో అన్నది ! "కులాన్ని గంగలో కలిపింది నీ చెల్లెలు ! ఎంత మందిని మోసం జేసిందో వెళ్ళిచూడు" అన్నది వచ్చి చూస్తే... ... ఆమె శాపం యదార్ధమై నట్లన్పిస్తోందిరా ! నా మనస్సుని నిర్దాక్షిణ్యంగా ముక్కలు ముక్కలుగా కోసివేస్తోందీ రేఖ."

అప్పుడే రేఖ లోనికి వచ్చింది–నిశ్శబ్దంగా చెప్పులు విడిచి కాళ్ళూ చేతులు కడుక్కోవడానికివెళ్తూంటే సలీమ్ పిలిచాడు–

"రేఖా ! శ్రీనివాస్ ... ... నిన్ను పెళ్లి జేసుకుంటానన్నాడా ?"

"నాకు పెళ్లంటేనే అసహ్యం !" రేఖకి తల్లి గుర్తుకొచ్చింది.

సారథి తల వంచుకున్నాడు. సలీమ్‌కి నోట మాటే రాలేదాపైన.

"నేను బజార్లు పట్టుకుని తిరుగుతున్న మనిషిని ! నాకోసం ఎవ్వరూ బాధపడ నవసరం లేదని చెప్పండి సలీమ్‌గారూ! అయినా నా జీవితం నాది ! మధ్యన యీాయనెవరండీ బాబూ నా గురించి బాధపడడానికి ! ఇన్ని నీతులు చెబుతూన్న వీళ్ల నాన్నే మా అమ్మని మోసం జేసి పారిపోయాడు !

"రేఖా !" సారథి కోపంగా అరిచాడు.

"ఏం ! ఎందుకలా అరుస్తావు ? అబ్దుల్ దాదా తమ్ముడు నాకంతా చెప్పాడు నిన్ననే ! అరుంధతమ్మకింకా అసలు రహస్యం తెలీదు ! నువ్వెవరివో నాకు తెలుసు ! మీ నాన్న వేయి అబద్దాలు జెప్పి నిన్ను అగ్రహారంలో వున్నవాళ్ల కప్పగించాడు ! తిండికి మొహం వాచినట్టు నువ్వక్కడేవుండిపోయావు ! మీ నాన్న అమ్మని వదిలేసి ఎక్కడికో పారిపోతే–ధైర్యంగా బ్రతికాం ! నీలాంటి పిరికివాళ్ళంటే నా కసహ్యం ! నువ్వసలు నాకేమీగావు ! కాలేవు ! నీక్కావలసింది డబ్బు ! అందుకే సలీమ్‌ని పట్టావు ! నాదగ్గరా ఓ పది వేలున్నాయని తెలిసి నన్నూ పంజరంలో పెట్టా లనుకున్నావు !" శశిరేఖ కళ్ళు కోపంతో, అవమానంతో జ్యోతుల్లా ఎర్రబారిపోయాయి.

సలీమ్ ఆగ్రహాన్ని నిగ్రహించుకోలేక పోయాడు –

"నీలో ఆడపిల్ల లక్షణాలులేవని యిన్నాళ్ళూ విచారిస్తున్నాను ! కానీ నువ్వు మనిషివికూడా కాదని యిప్పుడే తెలిసింది ! వాడికేం గతి పట్టిందని నీకు వండి వార్చి అమర్చుతున్నాడో

జరిగిన కథ – 4: సోమయాజులుగారి మనుమరాళ్లు విజయ, రాజ్యలక్ష్మి. సారధితో విజయ పెళ్లి ఆగిపోయింది. సోమయాజులుగారు ఇచ్చిన డబ్బులో 5 వేలు తక్కువగా సారధి సోమయాజులుగారికి తెచ్చి ఇస్తాడు. అతని ప్రవర్తనకు ముగ్ధులయ్యారు సోమయాజులుగారు. సారధి విజయ, రాజ్యలక్ష్మిల బాధ్యతను స్వీకరిస్తాడు. సోమయాజుల గారిచ్చిన డబ్బుతో తన కూతురు సీత పెళ్లి చేస్తుంది అరుంధతమ్మ. తన వైవాహిక జీవితం సుఖంగా లేదని సారధి చెల్లెలు సీత అతనికి ఉత్తరం రాస్తుంది. సారధి తన స్వంత చెల్లెలు శశిరేఖను సన్మార్గంలో పెట్టుటకు ప్రయత్నిస్తుంటాడు. శశిరేఖ, సారధి ఒకరికొకరు తమ జీవితానుభవాల్ని చెప్పుకుంటారు. రెండు మూడు రోజులు ఇంటికి రాని శశిరేఖ కోసం ఆమె ఆఫీసుకు వెళుతాడు సారధి. శ్రీనివాస్ అనే ఆఫీసర్‌తో కలిసి శశిరేఖ ఢిల్లీ వెళ్లిందని తెలుసుకొని క్రుంగిపోతాడు. ఆమె రామ్ అనే అతనికి తనను గురించి వ్రాసిన ఉత్తరం చదువుతాడు. ఢిల్లీ వెళ్లిన శశిరేఖ తిరిగి వస్తుంది. సలీం, సారధి, శశిరేఖ, ఆషా కలసి సలీం కారులో సినిమాకు వెళుతారు. సలీంకు సారధిపట్లగల ఆరాధనను మనస్సులోనే మెచ్చుకొంటుంది శశిరేఖ. సారధి, శశిరేఖ సినిమానుంచి కారులో వెళ్లగా, సలీం ఆషాను టాక్సీలో వాళ్లింటి దగ్గర దింపి వెళుతాడు.

కాస్త చెప్పమ్మా ! నువ్వు మగరాయుడిలా రోడ్లు కొలుస్తూంటే వాడు ఆడపిల్లలా యింటిదగ్గర నీక్కావలసినవి అమర్చడంలో సతమతమై పోతున్నాడు ? నీ బోడి పదివేలు వాడి కాలిగోరు ఖరీదు చేయివని గుర్తుంచుకో ! సలీమ్‌ని వాడేమీ పట్టలేదు. సలీమే ప్రదక్షిణాలు చేస్తున్నాడని తెలుసుకో !''

''సలీమ్ ! నువ్వు... యింటికి వెళ్ళు !'' సారధి ఏమీ జరగనట్టే శాంతంగా అన్నాడు.

సలీమ్ వెళ్ళిపోయాడు విసురుగా నడుస్తూ ! సారధి లేచి సూట్‌కేసులో బట్టలు సర్దుకున్నాడు.

''ఇదిగో తాళం చేతులు ! నేను వెళ్ళిపోతున్నాను ! ఈ రూమ్ నీదే యిక ! అద్దె, వగైరా అన్నీ నేనే కడతాను !'' అన్నాడు గుమ్మంలో నిలబడి.

''అక్కర్లేదు ! నీ దానధర్మాలు నాకవసరం లేదు ! మళ్ళీ నాక్కన్పించకుండా వుంటే అదే పదివేలు !''

''నీ మాట వింటే నట్టేట్లో మునిగినట్లే ! ఇప్పటికయినది చాలు !'' సారధి, మరో మాటకి తావు యివ్వనేలేదు.

''పీడ వదిలింది ! అడుగు బయట పెట్టనీయడయ్యె ! ఊపిరాడనట్టుండేది ! అతణ్ణి చూస్తూంటే ! మనిషి పుట్టింది ఏడవడానికా ? నీతులనీ, నియమాలనీ, పూజలనీ, పుణ్యమనీ ముక్కుమూసుక్కూచుంటే – నాలుగు క్షణాల్లో చావవలసిందే !''

శశిరేఖ మనస్సులో మళ్ళీ విశృంఖలత మేల్కొంది !

సారధి సీతను చూడ్డానికి వెళ్ళాడని రేఖకి తెలియదు.

అతణ్ణి చూడగానే సీతకి కన్నీళ్ళాగలేదు. ఎన్నాళ్ళకో వచ్చాడన్న కోపంతో మనసు మూగదై పోయింది! ఎదురు రాబోయినదే ఆగి పోయింది.

సారధి గొంతు పెగలనేలేదెంతోసేపటివరకు. సీతని అప్పుడే మొదటిసారి చూసినవాడిలా రెప్ప వేయడం కూడా మరిచిపోయాడు.

కనుకొలకుల్లో నీరు. కంఠం నిండుగా ఆనందం. దానితోబాటు కలిసి ఆడి పాడిన తీయని స్మృతులు అతని గుండెల్ని పిండి వేశాయి.


''గుర్తున్నానా ?'' సీత మనస్సులోని దుఃఖం ప్రశ్నించింది.

''మనుషుల్ని మర్చిపోయేటంత గొప్పవాడు కాదమ్మా నీ అన్నయ్య !''

''అందుకేగాబోలు యిన్ని వేలసార్లు వచ్చి వెళ్ళావు !''

''నీ కోపం నా గుండెల్ని కోసివేస్తోందమ్మా. నేనింకా మనిషిలా బ్రతికి వున్నానంటే, నీవే కారణం ! నిన్ను కొత్త పెళ్ళికూతురులా చూడాలని కలలుగన్నాను... నీకోసం ఏమేమో తీసుకురావాలని అనుకునేవాణ్ణి. కానీ ఒక్క చీర తీసుకురావడానికి కిన్నాళ్ళు పట్టింది !'' అతడు సూట్‌కేసులోనుంచి ఓచీర తీసి సీత చేతుల్లో పెట్టాడు.

''ఎందుకురా యింత ప్రేమ యింకా నాపైన నీకు ! నేను... నీ జీవితాన్ని ... పూర్తిగా



మూగ ముత్యాలు

నాశనం జేశాను. అమ్మ నా సుఖం కోసం నీ బ్రతుకున చీకటిని గ్రుమ్మరించింది. ఆ కోపంతో నన్ను మరిచిపోయావనుకున్నాను...'' సీత చెక్కిళ్ళు తడిసిపోయాయి కన్నీటితో.

''ఈ సంవత్సరం నుంచీ ప్రతి రోజూ వద్దామనుకునేవాణ్ణమ్మా! కానీ మీ మామ గారికి... మహా నిష్ఠ అని విన్నాను! మడీ, మంత్రాలు ఆయనకి పంచప్రాణాలని తెలిసింది. నాకీమధ్య... వాటిని పాటించడానికే సమయం వుండడం లేదు. అదీగాక వట్టి చేతులతో ఎలా రావాలో తెలియలేదు. మీవాళ్ళు 'ఎవరీ మనిషి?' అని అడిగితే నువ్వు తలవంచుకోవలసివస్తుందన్న భయం నన్ను రానివ్వలేదిన్నాళ్ళూ! మీ మామ గారు తీర్థ యాత్రలకి వెళ్ళారని మొన్న అగ్రహారం నుంచి వచ్చిన మునసబుగారబ్బాయి చెప్పాడు! అందుకే వచ్చానమ్మా!''

''నాకో అన్నయ్య వున్నాడని నేనెప్పుడో చెప్పేశాను! సరేలే! ముందు భోంచేద్దువుగాని పద! ఎప్పుడు తిన్నావో! కళ్ళెంత లోతుకు పోయాయో చూడు! అసలింతకి బ్రతకాలని వుందా లేదురా నీకూ? ఎందుకిలా చిక్కి శల్యమై పోయావ్?'' సీత భోజనం వడ్డిస్తూ గుండె లోని ప్రేమనంతా కళ్ళల్లో వుంచుకుని అడిగింది

''నేనేమైనా ఏమీ ముంచుకుపోదుగానీ నువ్విలా అయిబోయావేమిటి సీతా? ఇంకా అతను మారలేదామ్మా?! ఆ కళ్ళక్రింద నల్లటి గీతలెందుకేర్పడ్డాయి?!''

''ముందు భోంచేయరా!'' అతనికి విసన కర్రతో విసురుతూ కూర్చుంది. ఎన్నేళ్ళ క్రిందటో తప్పిపోయిన కొడుకు మళ్ళా దొరికి నట్లుగా వుందామె కతణ్ణి చూస్తుంటే.

''కొన్నిసార్లు నాకు అన్నం తినబుద్ధివేసేది గాదమ్మా! నువ్వు గుర్తువచ్చేదానివి! ఇక ఒక ముద్దకూడా నోట్లోకి వెళ్లేదిగాదు!'' అతని గొంతు గద్గదమైంది! పొరబోయి దగ్గువచ్చి వూపిరాడనీయలేదు.

''మంచినీళ్ళు! మంచినీళ్ళు త్రాగరా! అయినా ఎందుకలా మాట్లాడతావు? తినేప్పుడు మాట్లాడగూడదని నాన్న నిన్నెన్నిసార్లు తిట్టారో నీకు గుర్తులేదా?'' సీత దగ్గు తగ్గిన తరువాత కోప్పడింది.

''అదంతా ఓ తీయని కల సీతా! నాకిపుడు నాన్నా లేరు! అమ్మా...లేదు!''

అతని భోజనం పూర్తయిన తరువాత అడిగింది.

''శశిరేఖ కన్పించిందని వ్రాశావుగానీ, ఎలాంటి మనిషంటే సమాధానం వ్రాయలేదేమిటన్నయ్యా?''

''ఎలాంటి మనిషో తెలియకే వ్రాయలేదమ్మా!''

''అసలు అమ్మ అన్నది నిజమేనా? మీ... అమ్మ... రజియా అని... తెలిసిందా?''

''తెలిసింది! నేను అబ్దుల్ దాదా మనవణ్ణి సీతా! రాజశేఖరంగారి కొడుకునని మనవూరి వాళ్ళ నమ్మకం! అదీ నిజమే!''

''అయితే... ఆమె... పెద్దమ్మ... పెద నాన్నని...''

''వేదమంత్రాలతో, మేళ తాళాలతో పెళ్ళి జరగలేదట అమ్మకీ నాన్నకీ! నాన్న ఓసారి జైల్లోనుంచి వచ్చిన తరువాత బాగా జబ్బు పడ్డారట! అబ్దుల్ దాదాకూడా ఆ రోజుల్లో కాంగ్రెసులో జేరి జైలుకెళ్ళినవాడేనట! జైల్లోనే యిద్దరికీ పరిచయమై స్నేహంగా మారిందట! జ్వరంతో యింటికి వచ్చినా చూసే వాళ్ళు లేరని అబ్దుల్ దాదా వాళ్ళింటికి తీసుకు వెళ్ళాట్ట! నాన్న టైఫాయిడ్‌తో నెలరోజుల వరకు మంచం దిగలేదట! అన్నాళ్ళూ నాన్న గారిని కంటికి రెప్పలా కాపాడింది దాదాకూతురు. రజియా! నాన్న రాజ్యం అని పిలిచేవారట! ఆ తరువాత అమ్మలోని సౌశీల్యమూ, వినయమూ అందచందాలూ, నాన్న మనస్సుని పట్టి బంధించి వేశాయట! ఓ రోజున 'రజియాని' రాజ్యలక్ష్మిగా మార్చి ఓ గుళ్ళో పూలమాలలు వేసుకున్నారట! సాక్ష్యం ఆ గుళ్ళోవున్న దేవుడూ, అబ్దుల్ దాదా, అతని తమ్ముడు రహీమ్! అంతే! మరెవరికీ తెలియదా పెళ్ళి సంగతి! అమ్మా, నాన్నా అయిదారు నెలలు దేశమంతా తిరిగి వచ్చారట! నేను పుట్టేవరకు నాన్న జైల్లో అడుగుబెట్టలేదట! ఆ తరువాత రెండు మూడేళ్ళవరకు కాంగ్రెసు మీటింగులకి పరుగెత్తాడు. అడపా దడపా జైళ్ళ కెళ్ళడం సరిపోయిందట! అమ్మకి నాన్న దేవుడట! ఏంజేసినా ఎదురు చెప్పేదిగాదట! ''ఈ దేశంకోసం పుట్టారు మీరు! నేను మీ కోసం పుట్టాను! మీరు తప్ప నాకు ఏమీ తెలియదు! నాకు ఆ కాంగ్రెసు కధ చెప్పినా అర్థంగాదు! మీ కధ చెప్పండి! ఎన్నేళ్ళయినా వినగలను!'' అనేదట నాన్నగారు కాంగ్రెసు నడిపే వుద్యమాల గురించి వివరిస్తుంటే! అతని గొంతు నిండగా బాల్యంలో చూసిన తల్లి పట్ల ఆరాధన! ఊహ తెలిసిన తరువాత చూడ లేకపోయానన్న బాధకూడా కలిసి ఆ స్వరం మరింత మధురంగా విన్పించిందామెకి.

''బాబు పెద్దవాడై మీలాగే పేరు ప్రతిష్టల్ని సంపాదించుకుంటాడు! అందుకే అచ్చం మీ పోలికే! నా బంగారు తండ్రి నన్ను 'లాజ్జెం' అని పిలుస్తుంటే నా మనస్సు ఆనందం పట్టలేక పోతోంది!'' అని... నాన్నతో...నాకబుర్లే చెప్పేదట ఆయనవున్నంత సేపు.'' సారధి కళ్ళనిండుగా అశ్రుబిందువులే సీతకి అతని బాధ అర్థమైంది. ''వీడికీ పెద్దమ్మపైన ఎంత ప్రేమ వుందో!'' అనుకుంది లోలోన అతడివంక చూస్తూ.

''నువ్వు అమ్మ దగ్గరికి ఎప్పుడొచ్చావన్నయ్యా?''

''ఓ సారి నాన్న వెంట మీ యింటికి వచ్చానట అప్పటికి నాకు నాలుగేళ్ళుంటాయట. పిల్లలు లేరన్న విచారంతో చిన్నాన్న, చిన్నమ్మా మంచం బట్టారట. నన్ను చూసి చిన్నాన్న సంతోషంతో పెంచుకుంటానన్నారుట. మీ... అమ్మ... అయితే నన్ను క్షణం వదలలేదట అయిదారు రోజు లుంచుకుని పంపించుతానని బ్రతిమాలిందట. నాన్న ఏమీ అనలేక వెళ్ళి పోయారట. కానీ మళ్ళీ పది రోజుల తర్వాత వస్తే ''ఈ నా బంగారు తండ్రి తీసుకువెళ్తే నా ప్రాణాలుండవండీ!'' అని మీ అమ్మ ఏడ్చిందట.నాన్నగారేమీచెప్పలేక వెళ్ళిపోయారు.ఆ తరువాత చిన్నాన్న నన్ను దత్తత చేసుకున్నారు. మా అమ్మ సంగతి తెలిసిన చిన్నమ్మ. . నన్నిక ఎక్కడికీ పంపించనన్నదట. కానీ నువ్వు పుట్టిన

ప్రవీణా ఆర్ట్స్ (విజయవాడ) వారు ఇటీవల రాష్ట్రస్థాయి నృత్య పోటీలు నిర్వహించారు. ఆ సందర్భంగా కార్యక్రమాలని ప్రారంభిస్తున్న సినీనటుడు రంగనాథ్‌ని, వేదికపై ఉన్న సినీ నటి ప్రభ, శ్రీయుతులు ధూళిపాళ, కర్నాటి రామమోహనరావు, నటరాజ రామకృష్ణ, సుంకర కనకారావు, అజీజ్, సెబాస్టియన్‌గార్లని చిత్రంలో చూడవచ్చు.




మీ దినచర్య
టాన్‌టెక్స్®
తోనే ప్రారంభించండి.
పగలు మొదలు రాత్రి వఱకు టాన్‌టెక్స్‌నే
ధరించండి దాని అమరిక, పొందిక మీ
దినచర్య లందు ఎంతో తోడ్పడును.
IS 4964
ISI
మీకు ఖచ్చితంగా
సరిపోతుంది
టాన్‌టెక్స్
బ్రీఫ్‌లు • వెస్ట్‌లు • క్యాజుయల్స్ • స్పోర్ట్స్
పిల్లల దుస్తులు
THE SEAL OF QUALITY
TANTEX
TTK తంపూరి
Imageads-M- TT.1568 Tel

తరువాత...నేను చిన్నమ్మ కళ్ళకి ఓ రాక్షసుడిలా కన్పించానమ్మా !''

''నువ్వు పెదనాన్నగారి దగ్గరికి వెళ్ళిపోయే పని !'' సీత తల్లిని సమర్థించలేకపోయింది.

''చిన్నాన్నకి నేను ఆరో ప్రాణం! అందుకే నా కసలు రహస్యం చెప్పనేలేదు. తీరా చెప్పబోయే సరికి చిన్నమ్మ అడ్డుపడింది. ఆ తరువాత నేను... మన యింటికి... ఆధారమయ్యాను!''

''ఇదంతా నీకు యిపుడెలా తెలిసిందిరా?''

''నేను నా సూట్ కేసు తీసుకువెళ్ళిపోయాను గదా ! నా పుస్తకాలు తీసి సర్దుకుంటూంటే చిన్నాన్నగారి డైరీ కన్పించింది. మొదటి పేజీలో నాకు వుత్తరం వ్రాసివుంచారు ! నాన్న గురించి అంతా వ్రాశారందులో ! అడ్రసు కూడా వ్రాసివుంది. ఆ వివరాలన్నీ పట్టుకుని హైద్రాబాదంతా గాలించాను. అబ్దుల్ దాదా తమ్ముడు కన్పించాడు ఓ నెల రోజులకి, ఎంతో ఆశతో నాన్న గురించి ప్రశ్నించాను ! కానీ నాన్న అప్పటికే లేరు ! రేఖ పుట్టిన తరువాత ఓసారి నాన్న ఢిల్లీ వెళ్ళారట ! అక్కడే జైల్లో ఆర్నెల్లున్నారట ! రేఖకి ఎనిమిదేళ్ళట అప్పుడు. జైలునుంచి విడుదలై వస్తూంటే హిందూ ముస్లిమ్‌ల గొడవలమూలాన – ఓ ముస్లిమ్ కుర్రవాడు నాన్నని కర్రతో కొట్టి పారిపోయాట్ట మీటింగు చెప్పినందుకు. నాన్నగారిని హాస్పిటల్లో జేర్పి అమ్మకి కబురంపారట డాక్టరుగారు. ఆయన నాన్నగారికి ప్రాణస్నేహితుడట. అమ్మ రేఖని దాదా కప్పగించి ఢిల్లీ వెళ్ళేసరికి నాన్న ... చనిపోయారట ! ఆ మాట విన్న అమ్మ పిచ్చిదానిలా ఏడ్చిందట ! పది రోజులు హాస్పిటల్లోనే వుండి... ఆ దిగులు భరించలేక... తానుకూడా... గుండెజబ్బు...తో చనిపోయి నాన్నని చేరుకుందట ! రేఖనీ, నన్నూ.. కలిసి... వుండమని ఓ వుత్తరం వ్రాసిపెట్టుకుందమ్మ తన పెట్టెలో !''

సారధి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. సీత పైటచెంగుతో కళ్ళు వత్తుకుంది.

''దాదా... వెళ్ళి అమ్మని దహనంజేసి వచ్చాక నాకోసం కబురంపితే మీ అమ్మ... మా అబ్బాయిని కూడా కూడూ గుడ్డా లేకుండా చంపడానికా ? పంపను పొమ్మన్నదట. అప్పటికి నేను... మీ అమ్మకి... కన్నకొడుకుని... మించిన ఆత్మబంధువుని ! మళ్ళీ దాదా కబురుచేసేసరికి... అంతా తారుమారైంది. రేఖ ఒంటరిదని తెలిసినా చుట్టూ ఓ పద్మవ్యూహం అల్లి వెళ్ళనీయలేదు.''

''అమ్మ గుండెల్లో రాక్షసి కాపురం చేస్తోందిరా !''

సారధి విరక్తిగా నవ్వాడు. ''రేఖ ... ఎన్ని కష్టాలు పడిందో చెప్పలేనమ్మా ! ఒక్కసారి నాకు రేఖ కన్పిస్తే యిలా కానిచ్చేవాణ్ణి గాదు ! తిండికీ, బట్టకీ, ఒకటేమిటి ! అన్నింటికీ ... మొహం వాచిపోయింది ! నా చెల్లెలు భిక్షమెత్తుకున్నట్లు...స్నేహితులయిళ్ళల్లో...ఆడంబరాన్నీ, తెలివితేటల్నీ, పిచ్చి ఫేషన్లనీ ప్రదర్శించి...పొట్ట నింపుకుని బతికిందిన్నాళ్ళూ ! ఇపుడు...స్వంత అన్నని...నమ్మను పొమ్మంటూన్నది! ఇన్నాళ్ళూ 'ఎక్కడికెళ్ళావని ?' నిలదీస్తోంది ? నన్ను 'మిస్టర్ సారధీ !'అని పేరు పెట్టి పిలుస్తోంది ! నేనూ ఓ వేటగాణ్ణే మోనన్న భయంతో ఎవరెవరికో వ్రాసి నిజాల్ని తెలుసుకుంటోంది ! నా గుండెలు పగిలిపోయేట్టు ప్రవర్తించు తోందమ్మా ! వేళకి యింటికి రాదు ! చక్కగా పొందికగా చీర కట్టుకోదు ! పిచ్చి స్నేహాలే బతుకున సర్వస్వంగా భావించుతోంది ! పెద్దవాళ్ళంటే భయంలేదు ! 'ఈ మనిషి నావాడు' అన్న మమకారం కూడా లేదా మనస్సులో ! ఎలా రేఖని మనిషిని జేయాలో తెలియక విలవిలలాడిపోతోందమ్మా నా మనస్సు !'' సారధి గుండెల్లోని బాధని విప్పిచెప్పుకున్నాడు.

సీతకి సారథి పసిపిల్లవాడిలా కన్పించాడు.

''ఒరే ! అన్నయ్యా ! నీకు నేనున్నానురా! నా గుండెల్లోన వున్న ఆప్యాయతా, అనురాగం అన్నీ నీకోసమేనురా ! నీ బాధ నాదిరా !'' అని గుండెలకు హత్తుకుని లాలించాలన్నంతగా వూగిపోయిందామె మనస్సు !

''ప్చ్ ! కానీ... వీడు... నా కన్నయ్య ! పెద్దవాడైపోయాడు ! ఓ ఆడపిల్లయి నా బావుండేది ! గుండెల్లో దాచుకునేదాన్ని !'' నిట్టూర్చింది నిస్సహాయంగా.

''ఇప్పుడు విచారించినా లాభంలేదమ్మా ! ప్చ్ ! పోనివ్వు !... ఏదీ ! బావగారి ఫోటో వుందా ? ఓసారి చూపించు !''

సీత అయిష్టంగానే లేచింది.

ఫోటో చూసిన సారధి కనుబొమలు ముడవడ్డాయి.

''ఎక్కడో చూశానమ్మా ! ఆ! అతనే..'' అతని గుండెల్లో భయం, అనుమానం సర్పాల్లా పడగలెత్తి బుసలుకొట్టాయి !

''బహూశా ఏ హోటల్లోనో, చూసి వుంటావు ! అదీ ఓ అందాల విసనకర్ర ప్రక్కన అయివుంటుంది !'' ఆమె పరమ శత్రువుని గుర్తించి చెబుతున్నట్లు నిరాసక్తంగా చెప్పింది.


''సీతా !'' అతని మనస్సునిండుగా ఆందోళన .


''అవున్రా ! ఆయనక్కావలసింది అందమైన అమ్మాయిలు ! ఆపైన ఆ అవినీతిని హాయిగా అనుభవించడానికి నిషా !'' సారధి సీత బాధని చూడలేనన్నట్లు తలవంచుకున్నాడు.


''నీకుతప్ప ఎవరికీ చెప్పుకోలేనురా నా బాధని ! చెప్పుకున్నా నా గుండెల్లోని దుఃఖం కరిగి ఆవిరి అయిపోయిందని తెలిసీ చెప్పుకుంటున్నానురా ! నీ కోసం బతుకుతోందీ సీత !'' ఆమె మనస్సులో అనంతమైన వ్యధ ! అతని గుండెలు తరుక్కుపోతున్నాయి సీత నిస్సహాయతను చూస్తూంటే. సారధి మనస్సులో శశిరేఖా, శ్రీనివాస్ మెదిలాయొక్క క్షణం! ఎవరిని ఎవరు ఓదార్చాలో తెలియనట్లుండిపోయాడు !

''ఈ శశిరేఖ నా సీత జీవితంలో నిప్పులు పోస్తోందా ?!'' అతడి వూహల్లో భయం !

''శశిరేఖ ... కూడా యీయన ... స్నేహితుల్లో ... వున్నదనుకుంటా నన్నయ్యా !






రుచిచూస్తే తెలుస్తుంది!
మేము
వుపయోగించిన
వస్తువులు
ఆ ప్రత్యేకతకి కారణం
ప్రకృతి సిద్ధమైన మూల పదార్థాలు.
అందుచేత ట్రూ బిస్కట్లకి లభించాయి—
స్వచ్ఛత, పోషకత్వం, సంపూర్ణత్వం.
ట్రూ బిస్కట్లు. ఆరగించి ఆనందించడానికి
ఇతరులతో పంచుకోడానికి ఇతరులకి
ఇవ్వడానికి అందరికీ కావలసిన
అనేకరకాలు.
ట్రూ
బిస్కట్
with the extra energy of honey
TRUE
Glucose
TRUE
marie
BISCUITS
TRUE MARIE BISCUITS
Scrunch
TRUE biscuits
TRUE
NICE
biscuits
MONDE SELECTION
TRUE
YELAKKAI CUSTARD CREAM
biscuits
GLUCOSE
హనీ గ్లూకోజ్
గ్లూకోజ్ మరియు స్వచ్ఛమైన తేనెతో శక్తినిచ్చే బిస్కట్
SUGAR
మారీ
అన్ని వేళలకి కాఫీ త్రాగేటప్పుడు, టీ తీసుకునేటప్పుడు లేక ఏ సమయంలోనయినా
MILK
COCOA
స్క్రంచ్
మింట్ చేరిన తియ్యని, కరకరలాడే చాక్‌లెట్ క్రీమ్ బిస్కెట్
MILK
SUGAR
నీస్
సహజమైన కొబ్బరి కురిడీతో చేసి పంచదార జల్లిన రుచికరమైన బిస్కెట్
ఏలక్కాయ కస్టర్డ్ క్రీమ్
MILK
పోషకత్వం కలిగి, గట్టిగావుండే కస్టర్డ్ క్రీమ్ మరియు ప్రకృతిసిద్ధమైన ఏలక్కాయలతో రుచికరమైన కలయిక, ఆరగించడానికి, అందించి ఆనందించడానికి
HTM AFL 2812

మొన్న వచ్చినపుడు నిషాలో 'శశీ! మై స్వీట్ హార్ట్!' అని కలవరించారు!''

సారధికి నోట మాటే రాలేదెంతో సేపటి వరకు!

''అదంతా వ్యామోహం సీతా! శశిరేఖది... ఎవర్నీ శాశ్వతంగా బంధించే స్వభావం గాదు!'' అతనికలా చెప్పడానికి ఎంతో సిగ్గుగా వుంది. అతని నవనాడులూ క్రుంగిపోయాయి.

''కానీ ... యీయన రేఖలోని అందాన్ని ఆరాధిస్తున్నారన్నయ్యా! బహుశా ఆయన భార్య శశిరేఖ అని నలుగురితో కూడా చెప్పేశారేమో యీపాటికి! నాకు .నిన్ననే. .ఉత్తరం వచ్చింది! వాళ్లిద్దరూ కలిసి . బెంగుళూరు . వెళ్లారట! నా కిష్టం లేకపోతే విడాకులివ్వమన్నారు! పుట్టింటికి ..వెళ్తే మంచిదన్నారు. . నన్ను ... నీతో రానివ్వరా అన్నయ్యా! నేనీ అవమానాన్ని భరించలేనురా! నన్నిక్కడే వదిలి .వెళ్తే నేను బ్రతకనురా!'' సీత హృదయ విదారకంగా ఏడవ సాగింది

గుండెల్లో దాగివున్న దుఃఖం సముద్రంలా పొంగి ఆమెను ముంచివేయసాగింది

సారధి భుజంపైన వాలిపోయి వెక్కి వెక్కి ఏడవసాగింది. అతనికి ఆమె నెలా ఓదార్చాలో అర్ధం గాకుండా పోయింది.

''చూడమ్మా! ఏడ్చి ఏమీ సాధించలేం! నేనున్నానమ్మా నీకు! శశిరేఖకి ... నేను నచ్చ చెబుతాను!''

''రేఖ మాత్రం నీకు . చెల్లెలు గాదా? ఎలా...చెప్పగలవురా?'' ఆమె కళ్లు వత్తుకుని అడిగింది.

సారధి ఏదో అనబోయి ఆగిపోయాడు –

''శశిరేఖ నోసారి చూడాలనుందిరా!''

''నిప్పని ముట్టుకుంటే కాల్తుందని తెలిసీ నిప్పని కౌగిలించుకునే రేఖని చూసి మాత్రం ఏం చేయగలవు సీతా!''

''నీ మాటని కూడా చెవినిపెట్టదా?''

మూగ ముత్యాలు

''మనిషికి హద్దులుమీరిన స్వేచ్ఛా జీవితం అలవాటైనపుడు ఎదుటివాళ్ళని లెక్కే చేయ దమ్మా! రేఖని శాసించి కూర్చోబెట్టడం చాలా కష్టం! ఆపైన నువ్వంటే యీర్ష్య! ద్వేషం!''

''ఎందుకూ? నేను శ్రీనివాస్ గారి భార్యనని తెలుసా?''

''తెలియదు! ఆ మాట తెలిస్తే శ్రీనివాస్‌ని చెంగున ముడివేసి ఆడిస్తుంది! నీకో అన్నయ్య వున్నాడు! అమ్మ వుంది! మొన్నటి వరకు నాన్నగారున్నారు! ఇందరి ప్రేమ నీకు లభిస్తోందని యీర్ష్య! తనకి ఎవ్వరూ లేరని బాధ! కోపం! అందుకే మన అనుబంధాన్ని అసలు హర్షించదు!''

''ఎందుకంత విశృంఖలత ఆమెలో?''

''అది యీనాటి నాగరికతా లక్షణం అంటుంది!''

''ఏవిటి? బట్టలు చాలీచాలకుండా కట్టు కోవడమా?! లేక తన అందంతో మగవాళ్ళని ఆకర్షిస్తూ, ఆ వెర్రి వ్యామోహంలో తనను తాను నాశనం చేసుకోవడం నాగరికతా! ఓసారి చూడాలన్నయ్యా రేఖని! నేను సీతననే చెప్పు! కానీ శ్రీనివాస్‌గారి మనిషినని చెప్పకు!''

ఆ తరువాత సారధి వేములపల్లి వెళ్ళాడు. సోమయాజులుగారతనికి ఓసారి వచ్చివెళ్ళమని వుత్తరం వ్రాశారు. అతనికి లోలోన విజయని చూడాలన్న కోరిక కొండంతై కూర్చుంది.

''రా! బాబూ! నీకోసమే చూస్తున్నా నయ్యా!''

సోమయాజులుగారు ఆప్యాయంగా ఆహ్వానించారు.

''తాతయ్యా! నేను మీకు వ్రాసిన సంబంధం నచ్చిందా! విజయ ఒప్పుకుందా?''

అతడు ఓ సంబంధం గురించి వ్రాశాడాయనకి. బ్యాంకులో ఆఫీసరని కూడా తెలియ జేశాడు.

''విజయ మెట్రిక్ పాసై కాలేజిలో చేరింది బాబూ! పెళ్ళి మాట ఎత్తితే యుద్ధం చేసింది! నీ వుత్తరం చూసి మండిపడింది! తాను పెళ్ళి చేసుకోదట! నీకు పెళ్ళిముడి పడనీయదట! ఇదంతా అర్థంలేని కోపం నాయనా. కోపం మనిషిలోని అజ్ఞానాన్ని రెచ్చగొడుతుంది నాకీమధ్య ఆరోగ్యం సరిగా వుండడం లేదు బాబూ. విజయని చూస్తే మొండికెత్తింది. రాజ్యం చిన్నపిల్ల. చదువు కుంటోంది. ఈ దీపం ఎప్పుడో ఆరిపోతుంది. ఆ తరువాత వీళ్ళకి దిక్కెవరు బాబూ? ఎవరిని చూసినా ఈ వున్న ఆస్థిని కాజేయాలనుకునే వాళ్ళే. విజయతో చెబితే ఏడుస్తుంది. ఈ తాతయ్యకి చావు లేదనుకుంటుంది. పిచ్చితల్లి! నిర్భయంగా నా ముందు నిలబడి నిజాన్ని చెప్పిన నీలోని మనిషి నాకు నచ్చాడయ్యా! అవమానాన్ని భరించీ– మా డబ్బుని అణా పైసలతో సహా యిచ్చివేశావు. ఒకవేళ... నేను పోతే వీళ్ళని ఓ ఒడ్డుకు చేర్చుబాబూ!''

''మీరు నూరేళ్ళూ చల్లగా బ్రతకాలి తాతయ్యా! మీరలాంటి భయం పెట్టుకోండి.''

''నాకు చావంటే భయంలేదు నాయనా! పుట్టినవాణ్ణి చావకుండా ఎలా వుంటానయ్యా పిల్లల్ని నిరాధారంగా వదలిపెట్టి పోతే ఏమౌ తారోనన్న విచారం నన్ను తొలిచివేస్తోంది. నువ్వు కాస్త అప్పుడప్పుడు వచ్చి యోగక్షేమాలు కనుక్కు వెళ్ళాలి నాయనా! వాళ్ళిద్దరికీ నువ్వు ఆప్త బంధువని నా విశ్వాసం. వీలునామాలో నిన్ను గార్డియన్‌గా వ్రాయించాను. విజయకీ విషయం తెలియదింకా. అసలు తెలియనీయకు. కోపంలో యీ ఆస్థిని కూడా కాదని వెళ్ళిపోతుంది.''

''మీరలా చేయవలసిందిగాదు తాతయ్యా! నేను... విజయ కేమని సమాధానం చెప్పను?''

''వజ్రాన్ని వజ్రంతోనే కోయగలం బాబూ! విజయని నీ స్వచ్ఛమైన మనస్సు జయిస్తుంది!!''


''తాతయ్యా!.. మీరు గాలి మేడల్ని కట్టకండి. నేను విజయకి అర్హుణ్ణి కానని ముందే చెప్పాను!''

''ఆస్థి లేదనా బాబూ? మనిషి ఆస్థిని సంపాదించనూగలడు. పోగొట్టనూగలడు. కానీ నిర్మలమైన మనస్సుని సంపాదించడం చాలా కష్టం!''

''ఆ మనస్సుకి కులం, గోత్రమూ వుంటాయా తాతయ్యా!''

''ఇంద్రియాణి పరాణ్యాహు
రింద్రియేభ్య పరం మనః
మనసస్తు పరాబుద్ధి ర్యో
బుద్ధేః పరతస్తు సః''

పుట్టుకతోనే మూగ, చెవిటిగా అవిటితనాన్ని పొందినా పట్టుదలతో ఉత్తమ కార్మికునిగా పేరు తెచ్చుకుని పశ్చిమ బెంగాల్ గవర్నర్ శ్రీ పాండేనుంచి అవార్డుని అందుకుంటున్న ఖరగ్‌పూర్ రైల్వే కార్మికుడు శ్రీ ఎల్లప్ప నూకరాజుని చిత్రంలో చూడవచ్చు.





డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

జి. వి. కె. ఆర్. - శ్రీకాకుళం

నాకు వివాహమై 6 నెలలు అయినది. నా భార్యకు చేతులమీద కాళ్ళమీద తెల్లటి స్పర్శజ్ఞానములేని మచ్చలున్నవి. డాక్టరుకి చూపిస్తే అది లెప్రసీ అని చెప్పారు. ఆవిడ పెళ్ళికి పూర్వము మూడు సంవత్సరములు మందులు వాడినదట. మరి మచ్చలు ఎందుకు పోలేదు? అవి మా దాంపత్యానికి ఏటువంటి హాని కలిగించవా? అవి నాకు వచ్చే ప్రమాద మున్నదా? పుట్టే పిల్లలకు ఈ వ్యాధి వస్తుందా? ఇది త్వరగా నయమవాలంటే ఏ మందులు వాడాలి?

★ తెల్లని మచ్చలన్నీ లెప్రసీ మచ్చలని అనుకోవటం తప్పు. నిపుణులైన వైద్యులవద్ద చూపించి రోగనిర్ణయం చేసుకొన్న తర్వాతగానీ మందులు వాడకూడదు. లెప్రసీ అని నిర్ధారణ జరిగిన తర్వాత ఇవ్వవలసిన ప్రమాణంలో డాప్సోన్ మాత్రలు వాడవలసి ఉంటుంది. దాంపత్య జీవితానికీ ఈ రోగానికీ సంబంధం లేదు. పుట్టే పిల్లలకి ఈ రోగం వచ్చే అవకాశం లేదు. వైద్యుల సలహామేరకు డాప్సోన్ మాత్రలు వాడటం మంచిది. దీనికి లొంగదని వైద్యులు అనుకొంటే వారు క్లోఫాజిమీన్, రిఫామైసిన్ అనే మందులు వాడతారు.

జి. ఆర్. ఆర్. - గుంటూరు

నా కుమారుని వయస్సు 13 సంవత్సరములు. ఒక సంవత్సరము నుండి ఉదయంనుండి సాయంత్రము వరకూ తుమ్ములు విపరీతముగా వచ్చుచున్నవి. జలుబు ఎప్పుడూ వుంటుంది. ఎక్స్‌రే తీయించాము. జలుబు అదే తగ్గుతుంది, ఊపిరితిత్తులలో నెమ్ము లేదన్నారు. ముక్కు వెంట ధారగా ఎప్పుడూ వుంటుంది. దీనికి ఏమి చెయ్యాలి?

★ దీనిని క్రానిక్ పెరాన్నియల్ రైనోరియా అని అంటారు. ఈ రోగ లక్షణం అలర్జీ వల్ల ఏర్పడుతుంది. పిరిటాన్ విటమిన్ 'సి' మాత్రల వాడకం, తప్ప ప్రత్యేకంగా ఈ రోగానికి చికిత్స అంటు ఏదీ లేదు. కాలక్రమేణా శరీర తత్వంలో మార్పు వచ్చే అవకాశం ఉంది.

ఎస్. ఎస్. ఎస్. - తాడేపల్లి గూడెం

నాకు అతి ఆకలి, షివరింగు వచ్చుచున్నది. చెమటలు ఎక్కువగా పట్టును. రాత్రులందు మూడుమార్లు మూత్ర విసర్జన చేయవలసి వుంటుంది. ఇప్పటికి 10 కిలోల బరువు తగ్గినది. థైరాయిడ్ గ్రంధి దేనివల్ల పెరుగును? పెరగకుండా వుండాలంటే వైద్యము ఏమిటి? దీనివల్ల కేన్సర్ వచ్చే సూచనలు ఏమైనా వున్నాయా?

★ మీకు ఉన్న లక్షణాలు థైరోటాక్సికోసిస్ అనే రోగాన్ని సూచిస్తున్నాయి. థైరోటాక్సికోసిస్ రావటానికి థైరాయిడ్ గ్రంధి ఎక్కువగా థైరాక్సిన్ అనే హార్మోనును ఉత్పత్తి చేయటమే కారణం. ఇలా ఎక్కువగా పని చేయటానికి పిట్యూటరీ గ్రంధి పనితనం కొంతవరకు కారణం అవుతుంది.

ఈ రోగం ఉన్నవారు కొన్ని ప్రత్యేక పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహా మేరకు "నియో మెర్కజాల్" అనే మందు వాడవలసి ఉంటుంది. కొందరికి శస్త్ర చికిత్స ద్వారా ఈ గ్రంధిని పూర్తిగా గాని, కొంతవరకు గాని తీసివేయవలసి ఉంటుంది. కొందరికి కేన్సర్ రావచ్చునని అభిప్రాయం.

జి. ఎ. — విజయనగరం

బహిస్టు కాకుండా వుండేందుకు మాత్రలు విపరీతంగా వాడాను. ఇప్పుడు పెళ్ళి అయినది విపరీతమైన కడుపునెప్పివల్ల డాక్టర్లు ఆపరేషన్ చేసి గర్భకోశంలోవున్న కాయల్ని తీసేసారు. ఇది జరిగి 4 సంవత్సరములయినది. నేటికీ సంతానము కలుగలేదు. డాక్టరు సలహాపై ఫెర్టిల్‌మాత్రలు వాడుతున్నాను. సంతానము కలుగుతుందంటారా?

★ ఫైబ్రాయిడ్ ఆపరేషన్ చేసి తీసినంత మాత్రాన పిల్లలు కలుగరనుకోవటం పొరపాటు. మగవారు కూడా పరిశోధింప చేసుకోవటం ముఖ్యం. ★

ఈ శరీరాన్ని మించి పైనున్నవి యింద్రియాలు నాయనా! ఆ యింద్రియాలకన్నా చైతన్యవంతమూ, శ్రేష్టమైనది మనస్సు! అందుకే భగవంతుడు,'ఇన్ద్రియాణాం మనశ్చాస్మి' అని స్పష్టంగా యిన్ద్రియాలలో మనస్సుని 'నేనే' అని చెప్పాడు! అయినపుడా మనస్సుకి కులం ఎందుకు బాబూ!! ఈ సకల చరాచర సృష్టినంతటినీ సృష్టించిన వాడు భగవంతుడు! పరోక్షంగా ఆయనలోని మనస్సే యీ సృష్టికి కారణం! అంతటి మహోన్నతమైన మనస్సుకి అర్ధంలేని యీ కులాలూ, గోత్రాలూ అవసరం లేదు నాయనా! నీకీ సమస్య ఎదురైందా సారథీ?" సారథి జవాబు చెప్పలేనన్నట్లు తల వంచుకున్నాడు.

"ఇవన్నీ మనిషి సృష్టించుకున్న సమస్యలు బాబూ! నా కొడుకు యజ్ఞయాగాదులు చేసిన బ్రాహ్మణవంశంలో పుట్టాడు! వేద మంత్రాలు వల్లెవేసిన పండితుల వంశంలో జన్మించాడని, గొప్పవాడవుతాడనీ వాళ్ళమ్మ కలలుగన్నది! కానీ యింతటి గొప్పదనుకున్న కులం వాడిని వుద్ధరించ లేకపోయింది బాబా! వాడి మనస్సే వాణ్ణి సర్వ నాశనం చేసింది! కులంగాదు నాయనా మనిషిని వున్నతుణ్ణి చేసేది! నీలో వున్న పవిత్రమైన మనసే నిన్ను మనిషిని చేస్తుంది! దేవతగా మారుస్తుంది! దేవుణ్ణి చేస్తుంది!"

"కానీ యీ ప్రపంచంలో వున్నవాళ్ళం దరూ సోమయాజులుగారు తాతయ్యా!"

ఆయన నవ్వారు తలాడిస్తూ.

"గోరంత దీపం కొండంత వెలుగు నిస్తుంది బాబా!"

"ఆ వెలుగుని పంచుకోడానికి నేనపుడపుడు వస్తాను తాతయ్యా!" సారథి మనస్సులో జరుగుతూన్న మహాయుద్ధం ముగిసి, శాంతి నెలకొన్నంత ప్రశాంతంగా వుంది.

"చీకటిని మింగగలిగినవాళ్ళే వెలుగుని పంచుతారయ్యా! నీకు వేల సమస్యలు వచ్చినా చలించగూడదు! ఈ సృష్టినంతటినీ శాసించగల మనస్సుకి యీ సమస్యలు అడ్డుగా నిలబడలేవు సారథీ! మహాసముద్రంలో ఎన్ని వేల జీవ రాశులున్నాయో! ఎన్ని ఆటు పోటులో! అన్నిటినీ యిముడ్చుకోగల శక్తి వుంది గనుకే అది మహాసముద్రం అయింది బాబూ! మనస్సూ ఓ మహాసముద్రం సారథీ!"

[ఇంకా వుంది]

ఇంట్లో అమ్మ చేసిన కాఫీకి యోగ్యమైన బిరుదు.




ఇంట్లో వాళ్ళందరికీ ఏది మంచిది అన్నది అమ్మ కన్న మించి ఇంకెవరికి తెలుస్తుంది!

ఇక కాఫీ రుచి విషయం ఎత్తామంటే అమ్మదే తుది నిర్ణయం. ఆ నిర్ణయంపైనే అందరికీ గౌరవం.

అందుకు కారణం కాఫీ చేయడంలో అమ్మ అనుభవసారమే. అనుదినం అమ్మ చేతి కాఫీ తెచ్చే ఆ తొలి వెలుగుల తాజాదనం తిరుగులేనిది దాన్ని తయారుచేసి అందించే అమ్మ చేయి అంతకన్న తిరుగులేనిది.

అది అమ్మ హస్తవాసి అందమూ, లేక ఆమె రహస్యమందమూ! చక్కని రుచీ,సువాసనా ఇచ్చే ఆ ఖచ్చితమైన రంగుకు కాఫీ విత్తుల్ని వేయించడం, ఆ పొడి కొట్టడం, వడకట్టడం...



ఇక చుక్క చుక్కగా కిందికిదిగే ఆ డికాక్షన్ చిక్కగా ముదురు రంగుతో నోరూరించే దాని సువాసన, నురుగు తేలుతూ, పొగలు కక్కుతూ అది అందించే ఆహ్వానం. అబ్బ ' ఆ తాజాదనపు సువాసనకు జోహార్లు చెప్పాలి. నురగల బుడగలలో దోబూచులాడుతూ వచ్చే ఆ రుచికి జేజేలు పలకాలి.

ఆ మేళవింపులో పరిపూర్ణత సాధించడానికి ఎన్నేళ్ళ తపస్సు అవసరమైందో '

సన్‌రైజ్. శ్రేష్ఠతకొక బిరుదు.

ఇంట్లో అమ్మ చేసే కాఫీ గురించి మాకు అన్నిటికన్న ఎక్కువగా నచ్చిన విషయం అదిచ్చే ఆ "తొలి వెలుగుల తాజాదనపు" అనుభూతి.

అందుకే మా మిశ్రమానికి "సన్‌రైజ్" అన్న పేరు పెట్టాం. అదెంత మంచిదంటే, అత్యుత్తమమైన కాఫీకి అదొక యోగ్యమైన బిరుదు అని మా విశ్వాసం.

అమ్మ పద్ధతే అచ్చంగా మా పద్ధతీనూ

అమ్మలాగే, కాఫీ గొప్ప అంతా 'సరైన' కాఫీ



విత్తుల ఎంపికలోనే ఉందన్న సంగతి మేమూ గుర్తించాం, అందుకే, చిక్కదనం, సువాసనా సరైన పాళ్లలో ఇచ్చే కాఫీ విత్తుల ఎంపికలో మా నిపుణులు శిక్షణ పొందారు.

అమ్మ చేసినట్టుగానే మేమూ కాఫీ విత్తుల్ని సరిగ్గా తగినంత మేరకు వేయిస్తాం. అలా ఆ చిక్కదనం, సువాసన, రంగు పరిపూర్ణ స్థాయిలో వచ్చేలా చేస్తాం.

సరిగ్గా అలాంటి సమయంలో ఆ విత్తుల్ని అతి వేగంగా చల్లారుస్తాం. దానితో వాటి మంచితనం, సువాసన, రుచి, చిక్కదనం, రంగు అన్నీ అలా అందులో నిలిచిపోతాయి.

ఆ విత్తుల్ని నాజూగ్గా పొడికొట్టి, బ్రహ్మాండమైన పర్కొలేటర్లలో పడపోస్తాం. దీనితో ముదురు రంగుతోటి, ముగ్గుల్ని చేసే సువాసన తోటి అతి చిక్కని డికాక్షన్ తయారవుతుంది.

అనుదినం ఉదయం పూట అమ్మ కాఫీ రుచికి నోచుకున్న వారందరికీ ఇది సుపరిచితమైందే.

చిక్కని డికాక్షన్ నుంచి మళ్ళీ పొడి.


ఈ దశలో డికాక్షన్‌ను సుతారంగా ఆరబెట్టడం ద్వారా దాన్ని పొడి రూపంలోకి మార్చడం జరుగుతుంది. ఈ పద్ధతి వెనక 40 ఏళ్ళ పరిశోధన, అనుభవాల పరిపూర్ణత ఉంది.

ఇక బంగారు-గోధుమ రంగులో ఉన్న ఆ పొడిలో తాజాదనం, సువాసన సమృద్ధిగా ఉంటాయి.


ఆ తాజాదనాన్ని అలా నిలిపి ఉంచడం కోసం

ఆ పొడిని జాడీలలోకి, సంచీలలోకి నింపి, దాని సువాసన, రుచి, చిక్కదనం అన్నీ అందులోనే దాగి ఉండేలా సీలుచెయడం జరుగుతుంది. ఆ గుణాలన్నీ కలసి ఏ వేళలోనైనా, ఏ జాములోనైనా

ఆ సన్‌రైజ్ తొలివెలుగుల తాజాదనపు అనుభూతి మీకు నిస్సందేహంగా అందుతుంది.



ఇక సన్‌రైజ్ అచ్చంగా ఇంట్లో అమ్మ పద్ధతి లోనే తయారవడం వల్ల, ఆ శ్రేష్ఠతకు ఇదొక యోగ్యమైన బిరుదే అనవచ్చు కదా మరి!



ఇంట్లో అమ్మ చేసిన కాఫీ అందించే ఆ తొలివెలుగుల తాజాదనపు అనుభూతి కోసం.

ఎంపిక చేసిన పట్టణాలలో మాత్రమే లభించును

HTD-FSL-7910 TEL



మురళీమోహన్, జమున, కృష్ణంరాజు 'కోటికొక్కడు'

సినిమా విశేషాలు

-జి. వి. జి.

దాసరి రచన, దర్శకత్వంలో "తిరుగుబాటు"

"ఆగస్ట్ 15 నుంచి షూటింగ్ ఉంటుంది" అన్నారు దాసరి నారాయణరావు. ఈయన రచన, దర్శకత్వంలో దాసరి పద్మ సమర్పించే తారకప్రభు ఫిలిమ్స్ "తిరుగుబాటు" చిత్రంలో మోహన్‌బాబు, జయసుధ నాయకానాయికలు. దాసరి కూడా ఒక విశిష్టమైన పాత్రను నిర్వహిస్తారు.

"కిలాడీ దొంగలు"

"హాస్యరస ప్రధాన చిత్రం," అన్నారు శౌరి వెంకటేశ్వర్లు. గతంలో పలు చిత్రాలకు సహకార దర్శకుడుగా అనుభవం గడించిన ఈ యువకుడు తొలిసారిగా దొడ్డి సూర్యకుమారి, కంద్రాతు బంగారయ్య సమర్పించే ఎస్ ఎస్ మూవిటోన్ "కిలాడి దొంగలు" చిత్రానికి స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు. మురళీమోహన్, రాధిక, నూతన్‌ప్రసాద్, పద్మనాభం, నాగేష్, మాడా, మమత, మీనా, కొత్త నటులు సత్యన్నారాయణ, ఎస్ చంద్ర పాల్గొంటారు. ఎ ఎల్ నారాయణ కథకుడు. రాజన్ – నాగేంద్ర సంగీతం, బి జనార్ధనరావు ఛాయ, కె గోవిందస్వామి కూర్పు, ఎస్ దిలీప్‌సింగ్ శిల్పంతో ఈ చిత్రాన్ని నిర్మించే డి. అప్పారావు "ఆగస్ట్‌లో పాటలు రికార్డ్ చేసి, సెప్టెంబర్‌లో షూటింగ్ మొదలెడ్తాం," అన్నారు.


ఎ. ఎన్. ఆర్. తో శ్రీ శరత్ ఆర్ట్స్ "దొంగ కృష్ణుడు"


"ఆగస్ట్ 1, 2 తేదీల్లో సాంగ్స్ రికార్డవుతాయి. ఆగస్ట్ 18 నుండి 31, సెప్టెంబర్ అక్టోబర్‌లలో 21వ తేదీ నుండి నెలాఖరువరకు— మూడు షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తయిపోతుంది," అన్నారు ఫిలిమ్ జర్నలిస్ట్ టి ఆర్ శ్రీనివాస్. ఈయనా, సి హెచ్ రామారావు కలిసి నిర్మించే శ్రీ శరత్ ఆర్ట్స్ తొలి చిత్రం "దొంగ కృష్ణుడు"లో ఎ ఎన్ ఆర్., సుజాత, శరత్‌బాబు, రంగనాథ్, జగ్గయ్య, రావు గోపాలరావు, నాగేష్, సుమలత, పండరీబాయి, మమత ముఖ్య తారాగణం. భీశెట్టి లక్ష్మణరావు కథకు ఆత్రేయ సంభాషణలు రాస్తున్నారు. వేటూరి, సి నారాయణరెడ్డి గీతాలకు చక్రవర్తి స్వరకర్త. నవకాంత్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, రవి కూర్పు, సలీమ్ నృత్యాలు, నరసింహారావు ప్రొడక్షన్, దిలీప్ సహకార దర్శకత్వం నిర్వహిస్తారు. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కొమ్మినేని శేషగిరిరావు.

'నేటి భారతం'లో విజయశాంతి



పూర్ణిమ 'ఈ పిల్లకు పెళ్లవుతుందా?'





శ్రీదేవి, ఎస్ వరలక్ష్మి, అక్కినేని 'శ్రీరంగనీతులు'

"ఈ పిల్లకు పెళ్ళవుతుందా?" లో తండ్రి కొడుకుల సంవాదం

వంటింట్లో రాంబాబు (పరుచూరి) డబ్బాలన్నీ వెతికాడు. చివరికి ఆ డబ్బాలన్నీ కింద పడేసి, విసుగ్గా హాల్లోకి వచ్చాడు.

కోటేశ్వర్రావు (గుమ్మడి) నవ్వుతూ, "ఏవిట్రా ఏవిటే, డబ్బాలమీద ప్రతాపం చూపిస్తున్నావ్ ?" అని అడిగాడు.

"జేబులో రూపాయిలేదు. ఇంట్లో చిల్లి గవ్వకూడా కనిపించటంలేదు." నిట్టూర్చాడు రాంబాబు.

"అహా ! ఆ రోజు నాకు ఉద్యోగం ఊడిందంటే చంకలెగరేశావుగా మరి? ఆ మాత్రం ఉద్యోగం సంపాదించలేకపోయానా ?"

"గవర్నమెంటు ఉద్యోగానికి వయసు దాటిపోయింది. ప్రయివేట్ కంపెనీవాడెవడూ మన ఫేస్ చూస్తే ఉద్యోగం ఇవ్వడు... ఓ పది కొట్టించు."

"ఏవిటది ?"

"రుపీసు."

"రుపీసు కాదు — నా పచ్చి బద్దలు. ఎక్కడ్నుంచి తెచ్చి..."

"చూడు, ఫాదరూ ! కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వానికి ఓవర్ డ్రాఫ్ట్ ఇచ్చినట్టు— అప్పుడప్పుడు కన్నతండ్రి కొడుక్కి అప్పు ఇస్తూ ఉండాలి అది రూలు !"

"అసలంటూ ఒకటి ఏడిస్తే కదోయ్ అప్పులునూ, ఓవర్ డ్రాఫ్ట్‌లునూ పనికిమాలిన వెధవాని — పనికిమాలిన వెధవా !"

ఇక లాభంలేదనుకున్నాడు రాంబాబు "ఉద్యోగం ఊడిపోయిన తర్వాత ఫాదర్‌కు బి పి బాగా పెరిగిపోయింది" గొణుక్కుంటూ వెళ్లిపోయాడు

వేజెళ్ల సత్యనారాయణ దర్శకత్వంలో బి హెచ్ అజయకుమార్ నిర్మించిన శ్రీ బాల బాలాజీ కంబైన్స్ "ఈ పిల్లకు పెళ్లవుతుందా?" చిత్రం ఆగస్టు విడుదల

'బోళా శంకరుడు' దాసరి, సుజాత



"భామా రుక్మిణి"

''డార్లింగ్... డార్లింగ్... డార్లింగ్'' అనంతరం రచయిత, దర్శకుడు భాగ్యరాజా కథా నాయకుడుగా నటించిన పై చిత్రాన్ని ఎస్. వి. ఎస్. క్రియేషన్స్ పతాకంలో సహదేవ వెంకటేశ్వరరావు నిర్మిస్తున్నారు. ''విశేషమేమిటంటే నిజజీవితంలో భాగ్యరాజా భార్య అయిన ప్రవీణ ఈ చిత్రంలో ఆయన రెండో భార్య రుక్మిణిగా నటిస్తోంది. మొదటి భార్య భామగా రాధిక నటించింది. తల్లి పండరీబాయి కోసం విచిత్రమైన పరిస్థితుల్లో మరో పిల్లను వివాహం చేసుకునే భాగ్యరాజా అంతకు ముందు తను ప్రేమించిన ఓ యువతిని పెళ్ళి చేసుకొని ఉంటాడు. ఇద్దరు భార్యలమధ్య ఇరుకున పడ్తాడు. దాంతో కథ తమాషాగా నడుస్తుంది. నాగేష్ హాస్యం ఈ చిత్రంలో హైలైట్. సంపూర్ణ వినోదాత్మక చిత్రం,'' అన్నారు ఈ చిత్ర దర్శకుడు ఆర్. భాస్కర్. వసంతకుమార్ మాటలు, వేటూరి పాటలు. ఎం. ఎస్. విశ్వనాథం సంగీతం, రవి కూర్పు నిర్వహిస్తున్నారు



''ఇప్పుడు నేను హీరో కాళ్ళమీద పడేసీను తీస్తారా ?- ప్చ్! దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఇంకా ఆడదానికి రాలేదు !''

పురోగమనమా ? తిరోగమనమా ?

ఒక వంక తయారయ్యే చిత్ర నిర్మాణ సంఖ్య పెరిగిపోతోంది. మరోవంక ఫ్లాప్ చిత్రాల సంఖ్య మితిమీరి పోతోంది.

నిరుడు మొదటి ఆరునెలల్లో 38 చిత్రాలు విడుదలకాగా, ఈ ఏడు పూర్వార్థంలో 56 చిత్రాలు విడుదలయ్యాయి; వీటిల్లో విజయవంతమైన చిత్రాలను వేళ్ళమీదలెక్కపెట్టొచ్చు. ఇక అన్ని ఘట్టాలూ పూర్తి చేసుకుని సిద్ధమై కూడా విడుదలకు నోచుకోని చిత్రాలు లెక్కకు మిక్కిలి ఉన్నాయి.

అయినా, కొత్త చిత్రాలకు పూజలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు ఆర్టిస్టులు 1984 డిసెంబర్ వరకు కాల్‌షీట్లు లేవంటున్నారు. ఎక్కడ చూసినా ఒకటే హడావుడి. పైకి మాత్రం తెలుగు చిత్ర పరిశ్రమ పచ్చగా కనిపిస్తోంది.

మొత్తంమీద ఈ పరిశ్రమ తీరుతెన్నులు ఓ పట్టాన అంతుబట్టడంలేదు






సినిమా

"రౌడీ రాజా"

"కాని కాలం వచ్చినప్పుడు కర్రే పామై కరుస్తుంది. అలాంటి సమయాలలో ఆత్మ స్థైర్యం కావాలి. మా చిత్రంలో ప్రభుకు విధి వక్రించగా అన్యాయంగా ఓ హత్యానేరం అతనిపై మోపబడింది. పాప(ల)రావు (నూతన్‌ప్రసాద్) చేయని పాపంలేదు. చేయించని నేరంలేదు. అతని ఆటలను రౌడీ రాజా కట్టిస్తాడు," అన్నారు ఎస్. రవీంద్రరెడ్డి. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఏలూరి దుర్గాప్రసాద్ సమర్పించే అభినయ మూవీస్ "రౌడీ రాజా" చిత్రంలో సత్యనారాయణ, రాజేష్, రంగనాథ్, రమణమూర్తి, జీవా, చిట్టిబాబు, సుత్తి వీరభద్రరావు, పి. జె. శర్మ, ఆనందమోహన్, హరిబాబు, తులసి, పుష్పలత, అన్నపూర్ణ, అత్తిలి లక్ష్మి, రాగిణి, ఇతర పాత్రధారులు. ఆత్రేయ మాటలు, వేటూరి పాటలు, చక్రవర్తి సంగీతం, కె.ఎస్. ప్రసాద్ ఛాయ, గౌతమ్‌రాజు కూర్పుతో జె. అప్పిరెడ్డి. జి. తిరుపతిరావు నిర్మాతలు.

'లంకెల బిందెలు'లో గిరిబాబు,





తెనాలి సమీపంలోని బుర్రిపాలెంలో 'ప్రజారాజ్యం' ఔట్‌డోర్ షూటింగ్ సందర్భంగా తీసిన చిత్రం. అన్నపూర్ణ, రాజ్యలక్ష్మి, సత్యకళ, కృష్ణ, ప్రభాకరరెడ్డి పాల్గొన్న ఒక దృశ్యం.

"రైలు దోపిడి"

"ఆగస్టు 15న షూటింగ్ ప్రారంభిస్తున్నాం. రైలు దోపిడీ సన్నివేశాల చిత్రీకరణ కోసం ఒక రైలును అనుమతి పొంది ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటున్నాం. కీకారణ్యాలలో కూడా కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తాం," అన్నారు గోటేటి శ్రీ రామారావు. ఈయన నిర్మాణ సారథ్యంలో కె. ఎస్. రెడ్డి దర్శకత్వం నెరపే గోటేటి ప్రొడక్షన్స్‌వారి పై చిత్రంలో కవిత, అనూరాధ, నూతన్‌ప్రసాద్‌లను ఇంత వరకు ఎంపిక చేసినట్లు నిర్వహణ బాధ్యతలు వహించే జి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఆరుద్ర స్క్రిప్టు రాస్తున్నారు. రంగా ఛాయ, బి. చలం శిల్పంతో జి. సత్యవతి, జి. నారాయణరావు నిర్మాతలు. మూడు షెడ్యూల్స్‌లో అక్టోబర్‌కు షూటింగ్ పూర్తవుతుంది.

మోహిని, అంజలీదేవి, కృష్ణ



కృష్ణంరాజుతో నాచు శేషగిరిరావు చిత్రం

"ఆగస్టు ఆఖరివారంలో పాటలు రికార్డు చేసి, సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 7 వరకు మద్రాసులో తొలి షెడ్యూల్ జరుపుతాం," అన్నారు గతంలో "బంగారు తల్లి, మాంగల్యానికి మరోముడి, పులిబిడ్డ" చిత్రాలు నిర్మించిన నాచు శేషగిరిరావు. ఈయన కొత్త చిత్రంలో కృష్ణంరాజు, రాధ నాయకా నాయికలు. సత్యానంద్ రచన, చక్రవర్తి సంగీతం, పి. లక్ష్మణ్ ఛాయ, డి. వెంకటరత్నం కూర్పుతో కోడి రామకృష్ణ దర్శకుడు. డిసెంబర్‌కు షూటింగ్ పూర్తవుతుంది. ఈ చిత్రం 'హేరంబ చిత్ర' పతాకంలో తయారౌతుంది.

డైరెక్టర్ తాతినేని ప్రసాద్ చిత్రాలు

శ్రీ రంగసాయి పిక్చర్స్ జూలై 20 నుంచి ఆగస్టు 10 వరకు ఒకే షెడ్యూల్లో పూర్తి చేసే చిత్రంలో చంద్రమోహన్, రంగనాథ్, సుధాకర్, గొల్లపూడి మారుతీరావు, రాంజీ, అల్లు రామలింగయ్య, పూర్ణిమ, తులసి, అన్నపూర్ణ పాల్గొంటున్నారు. తాండవకృష్ణ నిర్మాణ సారథ్యంలో శేషయ్య నిర్మాత. జాన్సన్ రచయిత. కె. వి. మహదేవన్ సంగీత దర్శకుడు. యోగానంద్ ఛాయాగ్రాహకుడు. నాగేశ్వరరావు సంకలనకర్త. గూనా సహదర్శకుడు.


ఎ. వి. ఎం. సంస్థ నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్మించే చిత్రానికి కుమరన్ నిర్మాత.

వచ్చే మే నెలలో అమెరికాలో షూటింగ్ జరిగే సుజాత చిత్రవారి చిత్రానికి కె. బాలాజీ నిర్మాత.

"ప్రజారాజ్యం" చివరి షెడ్యూల్

"జూలై 16 నుంచి తెనాలి, గుంటూరు, సంగం జాగర్లమూడి ప్రాంతాలలో షూట్ చేశాం," అన్నారు జి. ఆదిశేషగిరిరావు. ఈయన నిర్మాణ సారథ్యంలో జి. నాగరత్నమ్మ నిర్మించే "ప్రజా రాజ్యం" చిత్రాన్ని అక్టోబర్‌లో విడుదల చేయదలిచినట్లు కృష్ణ చెప్పారు. ఈయనతోపాటు జయప్రద, రావు గోపాలరావు, గిరిబాబు, అల్లు రామలింగయ్య, రాజ్యలక్ష్మి, కె. విజయ మున్నగువారు ఔట్‌డోర్‌షూటింగ్‌లో పాల్గొన్నారు. పరుచూరి సోదరులు కథ, మాటలు రాశారు. జి.హనుమంతరావు స్క్రీన్‌ప్లే సమకూర్చారు. వేటూరి, వెలుట్ల గీతాలకు జె. వి. రాఘవులు స్వరకర్త. పుష్పాల గోపీకృష్ణ ఛాయ, శ్రీనివాసరాజు శిల్పం, కోటగిరి గోపాలరావు కూర్పుతో ఎం. మల్లికార్జునరావు దర్శకుడు.

జయమాలిని 'సింహపురి సింహం'



కొత్తగొంతులు

— టి.యల్. కాంతారావు

పంజరంలో పక్షి
ఎపుడూ పాడగా ఎరగను నేను
మూగదనుకుంటూనే ఎదిగాను
బాలికని
యువతినయి స్త్రీ నయ్యాను
బ్రతకడం నేర్చుకుంటూ
ఒకరోజున పంజరంలో పక్షి
ఎందుకు పాడదో అర్థమయింది
ప్రతి పలుకూ ఒక పాశం
ప్రతి పాటా ఒక పంజరం
— 'రౌద్రి'

ప్రముఖ కవి, సాహిత్య చరిత్రకారుడు, విమర్శకుడు అయిన ఆరుద్ర గారి రెండవ కుమార్తె 'రౌద్రి' అసలు పేరు భాగవతుల లలిత. తల్లి శ్రీమతి కె. రామలక్ష్మి పేరు వినని చదువరి ఉండడు. మనస్తత్వశాస్త్రంలో మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి బి. ఎ. డిగ్రీ పుచ్చుకున్నారు రౌద్రిగారు. తెలుగు, ఆంగ్లం, హిందీ, తమిళం చదవటం, మాట్లాడటం, తెలుగు, ఆగ్లం, హిందీలలో రచన చేయగల సామర్ధ్యం ఈమెకుంది. జర్నలిజంలో డిప్లొమా పొందారు. సమకాలీన సాంఘిక, సాహిత్య, రాజకీయ పరిణామాలను నిశితంగా అనుశీలించడం ఈమె ప్రవృత్తి. తెలుగులో చిన్న కథలను ఈమె రాసింది. 1981 లో నిశీధి సంగీతం అనే ఆంధ్ర, ఆంగ్ల కవితా సంకలనాన్ని రౌద్రి గారు ప్రచురించారు. ఆ కవితా సంకలనానికి ప్రివ్యూ శ్రీశ్రీ గారు రాయటం సంకలనానికే ఒక హైలైట్. దాంట్లో శ్రీశ్రీ గారు రౌద్రి కవిత్వాన్ని గురించి ఇట్లా అన్నారు. ''పాఠ్యగ్రంథ నిర్ణేతలు వీటిని కవిత్వంగా అంగీకరించక పోవచ్చును. పత్రికా సంపాదకులు వీటిని తిరగ గొడితే నాకాశ్చర్యం కలగదు. కవి సమ్మేళనాలలో ఈ కవితలను పఠిస్తే ప్రేక్షకుల నుండి కరతాళ ధ్వనులు రాక పోవచ్చును. అయినా ఒక విశుద్ధ చిత్త వృత్తి నుండి వెలువడిన కవితలుగా వీటిని నే నాహ్వానిస్తున్నాను. ఈ కవితా సంపుటానికి రచయిత్రి ఇంగ్లీషు పెట్టిన పేరు 'డార్క్ రాప్సోడీ' తెలుగుల 'నిశీథి సంగీతం'. ఏమీ కనిపించని చీకటిలో చెవులకు మాత్రమే వినిపించే సంగీతం దీనిలో ఉంది.''

స్థితప్రజ్ఞత కోసం నిరంతరం సాధనలో, ప్రపంచంలో శృతి కలియని ఆవేదనలో, కోర్కె మంద్రపంచమంగా, బాధలు అనుమంద్రంగా, ఆశ ఆధార షడ్జంగా, సందేహం పక్క పాఠీణిగా సాలోచనమైన నేత్రం అంతర్ముఖమైన దృక్కులతో, తటస్థత మతంగా, అనాసక్త ప్రసంగా యిన్నేళ్ళూ అస్వనితమైన అంతర గాంధారాన్ని, యిన్నాళ్ళూ అనాహతమైన కవితా నాదాన్ని ఇప్పుడిప్పుడే గాత్రం విప్పి వినిపిస్తున్నారీ కవయిత్రి. తన గీతి; తన రీతి వేరని తనది ఉలిపికట్టె బాట అని ఎవరూ విని ఎరుగని పాట అని తన పరిచయంలో చెప్పుకుంటున్నారు రౌద్రి. ఒకరి పువ్వులు వేరొకరి కలుపు మొక్కలుగా, ఒకరి నిశీథి మరొకరి సూర్యోదయంగా, ఒకరి జైలు ఇంకొకరి మైదానంగా, ఒకరి స్వేచ్ఛ, ఇంకొకరి ఇరకాటంగా ఎవరికి వారే ఒక అండగా బ్రతుకుతున్న వర్తమాన అంధకారంలో నిశీధి సంగీతాన్ని ఆలపిస్తూనే ఆగామి కాంతి సంగీతానికి స్వరాలు నిక్షిప్తం చెయ్యటం రౌద్రిగారి స్థితప్రజ్ఞతకు తార్కాణమే. జడ చైతన్యాలమధ్య, స్మృతి, విస్మృతులమధ్య, చావు బ్రతుకుల మధ్య ప్రేమ ద్వేషాల ద్వంద్వాలలో ఒక మేధాజీవి ఆలోచనా విధానం ఎలా వుంటుందో రౌద్రి నిశీధి సంగీతంలో తెలుస్తుంది.

సోహమ్ కోహమ్ గీతాలు రౌద్రిగారి కవితా తాత్విక అవగాహనకు మార్గం చూపుతాయి. ఈ వేదన వైయక్తికమా? సామాజికమా? అనే ప్రశ్నలకు బదులు ఈ వేదనలో ఉన్న వస్తువును గురించి ఆలోచించటం మంచిది. సర్వ ప్రాణికోటికి సహజమైన జీవుని వేదన ఒకటుంది. అదే ఈమె తపన. కొన్ని ఆంగ్ల గేయాల్లోనూ, కొన్ని తెలుగు గీతాల్లోనూ టాగూర్ గుర్తుకు రాక తప్పదు. టాగూర్‌ని ఈమె అనుకరించిందని కాదు నేనవేది. ఆ ప్రభావం వ్యక్తంగానో అవ్యక్తంగానో ఈ గీతాల్లో అక్కడక్కడ కనబడుతుంది. చలం వేదనను



అనుభవించినవాడే. అట్లాగే వజీర్ రహ్మాన్ కూడాను. ఆ వేదనలో చిత్తశుద్ధి, నిజాయితీ, జీవితంపట్ల తపన, పరుల బాగోగులకోసం వాళ్ళుపడ్డ బాధ కనబడతాయి. అంత స్థాయిలో కాకపోయినా ఈ నిశీధి సంగీతంలో మధుర నిషాద ధ్వని రూపం ఏ ఆచ్ఛాదనలూ లేకుండా కనబడుతుంది. 'నువ్వు వెలుపలికి వచ్చి చూడబోయేది వెలుతురు అని చెప్పలేనపుడు నువ్వు వున్నది చీకటి అనికూడా చెప్ప వద్దు నాకీ బాధ్యత వద్దు తప్పుకుంటాను' అని నిజాయితీగా చెప్పగలిగిన కవుల సంఖ్య చాలా తక్కువ. టొరంటో టొరంటో ఈ వ్యవస్థమీద పెద్ద సెటైర్. 'తిరుగులేని విసువు చెందని యాత్ర — జ్ఞాపకాల చెట్లు వెనుకకి పరిగెత్తే — నమ్మకం రైలు పట్టాల మీద — వింత అనుభవాల రైలుబండిలో — నా సుదూర గమ్యాలకి — ఆశతో ఆశనుంచి— ఆశగా — ఆశకు నా పయనం' అనే కవయిత్రి మాటల్లో మానవ మహాపథికుడు జేరుకోవాల్సిన మజిలీ ధ్వనిస్తోంది.

తెలుగు కవిత్వానికి మార్మికవాదం కొత్తదికాదు. మార్మికవాదుల కవిత్వం అంతా స్పష్టాస్పష్టంగా చదువరికి కనబడుతుంది. గీతాంజలి చదువుతున్నంతసేపూ ఏదో తెలుస్తున్నట్లే ఉంటుంది. ఇంకొకడికి చెప్పటానికి నోరు తెరిస్తే ఏమీ తెలియనట్లే ఉంటుంది. భావకవి కృష్ణశాస్త్రిగారుకూడా 'ఏదియో అపూర్వ మధురస్మృతి ధ్వనియించు కాని అర్థమ్ముకాని భావగీతమ్ములవి' అన్నాడు. శ్రీశ్రీ కూడా 'అందీ అందకపోయే నీ చేలాంచలముల' అన్నాడు కవిత్వాన్ని గురించి. రౌద్రకవితలో మార్మిక ఛాయలు బాగా ఎక్కువగా కనబడతాయి. అక్కడ కవితా విశ్లేషణ కంటె పాఠకుడి హృదయానుభూతే ప్రధానం. విశ్లేషణకు పూనుకున్నప్పుడు ఆకారం వికారంగా మారొచ్చు.

ఆంధ్ర, ఆంగ్ల కవితా ఖండికల్లో — రెంటిలోనూ, ఈ మార్మిక ఛాయలూ, జీవుని వేదన, ఒక సౌందర్య భావనను గురించిన తపన, అచ్చమైన కవిత్వ సాధన స్పష్టంగా కనబడతాయి. రౌద్రి ఇప్పటి నిశీధి సంగీతమే రాసింది. ఆగమ కాంతి సంగీతాన్ని కూడా భవిష్యత్తులో వినిపిస్తుందని నా నమ్మకం.

ఉయ్ వెంటాన్ డ్రీమింగ్
విష్షింగ్
అండ్ వెన్ ట్రూత్ స్టుడ్ నేకెడ్ బి -
-ఫోర్ అవర్ అయిస్
ఉయ్ సెడ్ దిస్ ఈజ్ నాట్ ది
ట్రూత్ ఉయ్ సీక్
దిస్ ఈజ్ నాట్ ది లైట్
ఉయ్ వాంట్

కిటుకు

కె.కె. రఘునందన



"ఏమండీ! మరోసారి చెపుతున్నాను. గుర్తుంచుకోండి. ఎవళ్ల కాళ్లు పట్టుకుంటారో ఏమో ... నాకు తెలీదు. అయినా ఇన్నేళ్లు వచ్చాయి ... మీకు తెలీదేమిటి? మన వాసుగాడికి ఈ యేడైనా సీటు వచ్చేటట్లు చూడండి. ఈ రోజుల్లో మనం మామూలుగా... అమాయకంగా బ్రతికేస్తే లాభం లేదండీ ... దేన్నైనా కిటుకుతో సాధించాలి."

నేను విశాఖపట్టణం బయలుదేరేముందు శ్రీమతి చెప్పిన మాటలు మరోసారి గుర్తుకొచ్చాయి.

నా జీవిత భాగస్వామిగా అడుగుపెట్టిన నాటినుంచీ దీప్తి అంతే! ప్రతీ విషయాన్ని పదేపదే గుర్తు చేస్తుంది. అది కొందరికి చాదస్తంగా కనిపించవచ్చుకాని నా మట్టుకు అది మంచి పద్ధతే! కారణం దీప్తి వాస్తవాన్ని గుర్తించి దాని గురించి చెప్పి ఆ విధంగానే నడుచుకోమంటుంది.

ఇంటినుంచి రంగడి కిళ్లీబడ్డీ దగ్గరకు వచ్చి పది నిముషాలయింది. ఇంకా కోటపాలెం బస్సు రాలేదు. వచ్చే సూచనలు కూడా కనిపించ లేదు.

విసుగ్గా వాచీ కేసి చూసాను.

ఏడున్నరయింది.

ఈ ప్రపంచాన్నయినా మార్చవచ్చునేమో కానీ బస్సులను సరిగ్గా టైము కొచ్చేటట్లు చెయ్యడం మాత్రం సాధ్యం కాదనిపించింది.

ఇలా ఆలోచిస్తూండగానే కోటపాలెం బస్సు వచ్చి ఆగింది. బస్సులో దూది దిట్టంగా కూరబడ్డట్టు జనం నిండుగా ఉన్నారు. బస్సు ఓ సైపుకు రాక్షసపక్షి రెక్కలా వాలిపోయింది. ఫుట్‌పాత్ భూమికి అంటుకుపోయి రోడ్డు రాపిడికి అరిగిపోతుందా అనిపించింది.

ఎలాగో కండక్టర్‌ని 'అర్జంటుగా పనుంద'ని బ్రతిమాలి— ఇస్త్రీబట్టల్నీ, అప్పుడే దువ్విన క్రాఫింగ్‌ని లెక్కచెయ్యకుండా పూర్వాశ్రమంలో మునివర్యుడిలా ఒంటికాలి తపస్సుకు పూనుకుని బస్సెక్కాను.

ఆ జనం మధ్య ... ఊపిరాట్టంలేదు.

సీతారామునిపేట ... గొర్లిపేట .. క్రొత్తపేట ... నెల్లిమర్ల ... ఇలా ఎక్కేవాళ్లని ఎక్కించేస్తున్నాడు.

అయినా యిటువంటి బూట్లు వేసుకుని కిక్కిరిసిన బస్సులో ఎందుకు ఎక్కడం? అంటూ ఓ బట్టతలాయన నేను చూసుకోకుండా కాలు త్రొక్కిన నేరానికి నామీద చిరాకు పడ్డాడు.

అసలా బస్సులో ఎలాగైనా విజయనగరం వెళ్లి ఎనిమిది గంటలకు బయలుదేరే నాన్‌స్టాప్ బస్సులో విశాఖ వెళ్లాలని నా తపన. అందుకే కిక్కిరిసిన బస్సులో ఈ ప్రయాణం.

విజయనగరం బస్సు చేరిందనటానికి నిదర్శనంగా బస్సు స్టాండులో మురికి వాసనంతా మా ముక్కు పుటాల్ని అదరగొట్టింది.

బస్సు దిగి ఒక్కసారి తృప్తిగా గాలి పీల్చాను. చెదరిపోయిన జుత్తుని సరి చేసుకున్నాను.

"విశాఖపట్టణము పోయే నాన్‌స్టాప్ బస్సు బయలుదేరుటకు సిద్ధముగా నున్నది." మూడు భాషల్లోనూ వినిపించిన ప్రకటన విని పరిగెత్తి బస్సెక్కాను. అప్పటికే అది కదలటానికి సిద్ధంగా ఉంది.

అన్ని సీట్లు నిండిపోయాయి. ముందర ఒకేఒక్క సీటు మాత్రం ఖాళీగా ఉంది. ఆ ప్రక్కతన్ని అడిగి కూర్చోబోయాను. "లెండి... లెండి యిది ఎమ్మెల్యేగారి సీటు... ఇది మరెవ్వరికీ ఇవ్వరు. ఇదిగో రెండు టిక్కెట్స్ తీసాను ఇంకాయన వచ్చేస్తారు." అంటూ నన్ను లేవగొట్టాడు.

దిక్కులేక నిల్చున్నాను. నాలాగే ఓ పది మంది దాకా అడిగి ఢీలాపడిపోయారు. ఈలోగా కండక్టర్ 'టిక్కెట్ టిక్కెట్' అని అరుచుకుంటూ వచ్చాడు.

టిక్కెట్ తీసుకుని నిల్చున్నాను.

ముందుకెళ్లాక కండక్టర్ మాలాగే ఆ కుర్రాడిని సీటు ఎవరికని ప్రశ్నించాడు.

"ఎమ్మెల్యేగారి కండీ!" చెప్పాడు

"ఏ సమితి?" కండక్టర్ ప్రశ్న.

చెప్పాడు కుర్రాడు.

మరేం మాట్లాడకుండా తన సీట్లోకి వెళ్లి కూర్చుని ఎస్సార్ పూర్తిచేసి బయిలదేరమని డ్రైవర్‌తో చెప్పాడు.

బస్సు స్టార్టయింది.

ప్రజా ప్రతినిధులు

ప్రాచీన కాలంలో రాజులు తమ రాజ్యంలోని ప్రజల యోగక్షేమాలను గమనిస్తూ, తమ బిడ్డల మాదిరిగా చూచుకునేవారు. ప్రజలకు ఎలాటి కష్టాలూ ఉండేవి కావు. రాజును ప్రజలు దైవసమానంగా గౌరవించేవారు. వేనుని కాలంలో ఆ రాజు ప్రజా కంటకుడుగా ఉన్నందున్న ప్రజలు అతన్ని రాజ్యపాలన నుండి తొలగించినా, అతని కుమారుడైన పృథువునే చక్రవర్తిగా చేశారు. కాని కాలక్రమాన పాలకులు స్వార్థపరులై, ప్రజల మంచిచెడ్డలను గమనించక, వారిని హింసిస్తూ ఉన్నందున, రాజులు పాలకులుగా ఉండరాదనీ, ప్రజా ప్రభుత్వం ఏర్పడాలనీ ప్రజలలో గట్టి అభిప్రాయం ఏర్పడింది. ఒక్క భారతదేశంలోనే కాదు, ప్రపంచంలోని యితర దేశాలలో కూడా ప్రభువులపై తిరుగుబాట్లు జరిగి, ప్రజా ప్రభుత్వం ఏర్పడుతూ వచ్చింది. అమెరికా, ఫ్రాన్సు, రష్యా మున్నగు దేశాలు మనకంటే ముందే స్వాతంత్ర్యం సంపాదించాయి. భారతదేశం గాంధీ మహాత్ముని నాయకత్వంలో పోరాటం సలిపి, స్వాతంత్ర్యం సంపాదించింది. ప్రభుత్వం ఏర్పడింది.

ఆయా ప్రాంతాలలోని ప్రజలు తమ క్షేమాన్ని కోరగలరనే నమ్మకంగల వ్యక్తులను తమ ప్రతినిధులుగా ఎన్నుకుంటారు. ఆ ప్రతినిధుల నాయకుడు మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసి, తాను ముఖ్య పాత్రను వహించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాడు. ప్రజల విశ్వాసాన్ని కోలుపోయినప్పుడు ప్రభుత్వం నిలవదు. అందువల్ల ప్రతినిధులు ప్రజల కష్టసుఖాలను బాగా గమనిస్తూ, తమ ప్రభుత్వానికి మంచి పేరు తేవలసి ఉంటుంది. విమర్శిస్తే కోపించి శాంతాన్ని పోగొట్టుకోకూడదు.



ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

రెండేళ్లనుంచీ వానలులేక మద్రాసు, పరిసర ప్రాంతాలలో నీటి ఎద్దడి అధికమయింది. తాగడానిక్కూడా నీళ్ళు దొరకడం కష్టమైపోయింది. పగలు తమతమ పనులకు పోయి వచ్చిన ప్రజలు రాత్రి నిద్రమాని నీటి వేటకు బయలుదేరవలసి వస్తున్నది. పరిస్థితులను గమనించడానికో ఒక చోటికి ఇద్దరు ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, పత్రికలవారూ వెళ్లగా, ఒక వ్యక్తి "నీళ్లులేక చచ్చిపోతున్నాం. మీరు ఫోటోలు తీయించుకుని పేపర్లలో పడడానికీ, దానికీ వస్తారుగాని మా కష్టాలను గమనించరు" అని అన్నాడట! ఒక ప్రజాప్రతినిధి కోపించి ఆ వ్యక్తినితోసివేశాడట. ఒక స్త్రీ ఆ వ్యక్తిని కాపాడిందట! ఆ ప్రతినిధి పత్రికలవారితో "ఈ విషయం పేపర్లో వెయ్యకుండా ఉంటే మంచిది. ఒకవేళ మీరు వేసినా నేను లెక్కచెయ్యనులెండి" అన్నాడట!

ఇలాంటి ప్రజా ప్రతినిధులు ఉంటే ప్రజల అగచాట్లకు అంతం ఉండదనిపిస్తుంది.

ఇంతలో గబుక్కున ఓ బట్టతలాయన బస్సెక్కాడు. ఇందాకటి కుర్రాడు ఆయన్ని చూడగానే — "రండి ఎమ్మెల్యేగారూ! నమస్కారం" అని లేచి వినయంగా నమస్కరించాడు.

కండక్టర్‌కూడా నమస్కారం పెట్టాడు.

నేనాసక్తికరంగా చూసానతనివంక...

బంగినపల్లి మామిడిపండులా నిగ నిగలాడుతున్న ముఖం... ముందుకు పొడుచుకు వచ్చిన బొజ్జ... ఖరీదైన బట్టలు...

ఎందుకో రాజకీయ నాయకుణ్ణి చూడగానే నాకు వాళ్ల సంభాషణపై ఆసక్తి పుడుతుంది.

బస్సు శరవేగం పుంజుకుంది...

"ఈసారి మాత్రం ఎలాగైనా సాధించాలి సార్!" అన్నాడు కుర్రాడు.

"తప్పకుండా! ఈసారి మిస్ అయితే మన ప్రిస్టేజ్ ఏంకాను? ఈ 'ఎమ్.ఎల్.ఏ.' గిరి విలువేముంటుందికనుక" అన్నారు ఎమ్.ఎల్.ఏ. గారు మీసాలు మెలివేస్తూ.

కిటుకు

ఇంకా ఆ కుర్రాడు ఏవేవో అడుగుతున్నాడు. ఎమ్మెల్యే సమాధానం యిస్తున్నాడు... క్రొత్త పార్టీ గెలుపుమీద... యిప్పుడు వాళ్ళ వాగ్దానాల్ని అమలుపరిచే తీరుపైన రకరకాలుగా విమర్శిస్తున్నారు యిద్దరూ.

వాళ్ళు ఏదో ముఖ్యమైన పనిమీద విశాఖ వెళ్తున్నట్లు గ్రహించాను.

పుష్పక విమానంలా ఝామ్మని పోతోంది నాన్‌స్టాప్. ఇంకా ఎమ్మెల్యేగారి సంభాషణ ఆగలేదు.

ఇలా ఓ గంట గడిచేసరికల్లా అందాల విశాఖను చేరింది బస్సు.

ఆర్టీసీ కాంప్లెక్సులో దిగాను.

ఆ కుర్రాడు, ఎమ్మెల్యే కూడా దిగి కాంప్లెక్సులో హోటల్‌కు దారితీసారు... ఆవురావురుమంటున్న కడుపులో కాస్త టిఫెన్ పడేద్దామని నేనూ వెళ్లాను.

నేను వాళ్ళకెదురుగా కూర్చున్నాను.

సర్వరొచ్చి నిలబడ్డాడు. వాళ్ళు కాఫీ చెప్పారు.

"ఏమండీ! ఎమ్మెల్యేగారూ! ఏమిటి సంగతి...యిప్పుడు మనం వెళ్లవలసింది చెంగల్రావు పేటేనా!" అన్నాడు ఆ కుర్రాడు.

"పోన్లెద్దూ బుజ్జీ...ఏదో నాకు పనుందని బస్సుకు రావటం లేటవుతుందని ... సీటు ఎలాగైనా రిజర్వ్ చేయించాలని చెప్పి ఏదో కిటుకు చెప్పాను. అంతేగాని బస్సు దిగాక కూడా 'ఎమ్మెల్యే' అంటూ ఏమిటా హాస్యాలు ..." అంటూ చిలిపిగా బుగ్గమీద కొట్టాడు అభినవ ఎమ్మెల్యే.

అంతే! ఒక్కసారి వాళ్ళ మాటలకు కళ్లప్పగించి చూస్తూండి పోయాను.

" దేన్నైనా "కిటుకుతో" సాధించాలి " శ్రీమతి చెప్పిన మాటలు పదే పదే మార్మోగసాగాయా క్షణం. ★

maa(S) PP 1 Tel b 82

సీరియల్

మానస మురళి

కొడాలి సాంబశివరావు

16

(గత సంచిక తరువాయి)

సిగ్గుతోనూ, అవమాన భారంతోనూ మానస తల వాలిపోయింది. ఇనస్పెక్టరు విజయ్ ఆమెను ఏహ్యంగా చూడసాగేడు. ఏ వ్యక్తి దృష్టిలో పడకూడదని రోజూ జాగ్రత్త పడుతుందో సరిగ్గా మళ్ళీ ఆ మనిషి చేతిలోనే దొరికిపోయింది మానస.

ఒకసారి లాడ్జి... రెండోసారి రౌడీల బారినుంచి...

మళ్ళీ ఇప్పుడు మూడోసారి ... బ్రోతల్ హౌస్ రైడింగ్‌లో... అక్కడ మానసను చూసి అతను లోలోన కొంచం బాధపడ్డాడు. తరువాత నిర్దయగా అందరితోపాటు ఆమెనుకూడా జీపు ఎక్కించి స్టేషన్‌కు తీసుకువచ్చాడు విజయ్.

"ఇది నీకు మూడోసారి..."

"అందులో మీరు ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదు. నా వృత్తే అది! నా వృత్తికి మీరు శత్రువులు... దురదృష్టం నన్ను వెక్కిరించి మళ్ళీ మీకు పట్టించింది —"

"ఇప్పుడుకూడా నీకు సిగ్గు కలగడంలేదా?"

మానస జవాబు చెప్పలేదు. అరక్షణం అతని వంకచూసి నవ్వింది. తప్పుచేసి దొరికి పోయికూడా అలా నవ్వగలుగుతున్నందుకు ఆమె మీద విపరీతమైన కోపం కలుగుతుంది అతనికి. కానీ కఠినంగా ఏమీ అన్లేకపోతున్నాడు.

"ఈ సారి అంత తేలిగ్గా తప్పించుకోలేవు. నీకిది అలవాటైపోయింది. చదువు సంస్కారం వుండికూడా ఇలా చేసే ఆడవాళ్లను నేను క్షమించలేను —" గంభీరంగా అన్నాడు.

"నేను చదువుకున్న కొద్దిపాటి చదువు సంస్కారాన్ని నేర్పింది నిజమే! జీవితానుభవాలు ఈ దారినే నడవమని శాసించాయి. పరిస్థితులు— సంస్కారాన్ని, ఆత్మాభిమానాన్ని చంపేశాయి... ఇంతకన్నా ఎక్కువ చెప్పలేను. మీరు ఏం శిక్ష విధించ దలుచుకున్నారో వేయండి —" అని తల దించుకున్నది మానస.

ఎంతోమంది దోషుల్ని పట్టుకుని నిర్దయగా శిక్షించాడు విజయ్.

కానీ; మానస విషయంలో అంత కఠినంగా వ్యవహరించలేకపోతున్నాడు. ఏదో బలమైన కారణాంతరాలవలన ఆమె తప్పుదారి త్రొక్కిందని గ్రహించాడు. తనకు తెలియకుండానే ఆమంటే ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నాడు.

దారితప్పిన ఆమె జీవితాన్ని సవరించాలన్న కోరిక కలుగుతోంది. ఆమె వ్యక్తిత్వం అతని మనసును మెత్తబరుస్తోంది.

"నీ పేరేమిటి ?—" అడిగాడు విజయ్.

చెప్పింది మానస. 'అందమైన పేరు; అందమైన మనిషి... మరి ఈ వృత్తిలోకి ఎలా దిగింది ? ఈమెనిలా దిగజార్చిన పరిస్థితులు ఏమిటి ?—' అనుకున్నాడు విజయ్.

"ఈ వృత్తి మానలేవా ?"

"మానేయగలను. కానీ... మా ఇంటిల్లి పాది పస్తులతో మాడిపోతారు—"

"అందుకని ఈ నీ చ వృత్తి ని ఇలాగే కొనసాగిస్తా నంటావు ?—" అని అడిగాడు కఠినంగా.

"కొనసాగించాలని నా కేనాడూ ఆలోచన లేదు. కాకపోతే పరిస్థితులు వక్రించినప్పుడు తల దించుకోక తప్పదు—"

"పరిస్థితులు... పరిస్థితులు... ఇదొక సాకు. మనసుంటే మరొక మార్గం లేకపోలేదు. ఉద్యోగం చేయ్. నీ వాళ్లను పోషించు. ఇలా ఒళ్లు అమ్మిన సంపాదనతో మీవాళ్లను సాకేకన్నా వాళ్లందరికీ ఇంత విషం ఇచ్చి చంపేయడం వుత్తమం !—" ఆవేశంగా అన్నాడు విజయ్.

మానస అతనివంక విభ్రాంతిగా చూసింది.

"నిజమే ఇనస్పెక్టరుగారూ ! మా వాళ్ళం దరికీ ఇంత విషమిచ్చి నేనూ ఇంత తీసుకుంటే సమస్యేలేదు... ఆ పని చేయడానికి నాకు ధైర్యం లేదు. నేను పిరికిదాన్ని. అసలు బ్రతకడానికన్నా, చావడానికే ఎక్కువ ధైర్యం కావాలి. నన్ను నమ్ముకున్న వాళ్లకింత తిండి పెట్టాలనే ఆరాట పడ్డానుగానీ, వాళ్లకు విషమిచ్చి చంపాలన్న ఆలోచన ఏనాడూ కలగలేదు. అలాంటి సమయం వచ్చినపుడు తప్పకుండా చేస్తాను. ఆ పని చేయ గలిగిననాడు ఇలా మీ ముందు దోషిలా నిలుచునే అవసరమే వుండదు, ప్రపంచంలోకెల్లా అతి సులువైన పని ఎదుటి మనిషికి నీతి చెప్పడం !

ఆచరణలోకి వచ్చేసరికి ఎవరికి వాళ్లు కప్పదాట్లు వేస్తారు. ఎవరిదాకా ఎందుకు మీ విషయమే తీసుకోండి. నేను తప్పు చేసానని దండిస్తున్నారేగానీ— నాకు మంచి మార్గం చూపుతున్నారా ? చూపగలరా ?

నేను చదివింది స్కూల్ ఫైనల్. ఉద్యోగం ఎవరిస్తారు ? ఆ వేటలో అలసిపోయి ఓడిపోయాను. ఏ ప్రయత్నాలు చేయకుండా ఈ దారికి వచ్చాననుకుంటే పొరపాటు. అన్ని

జరిగిన కథ — 7 : విజయ్ ప్రేమను అంగీకరిస్తుంది మురళి. శివశంకరం మురళిని తన ప్రియురాలు మీనాగా భ్రమ చెందుతాడు. తన మనవడి కోరికపై రాజమణి మురళిని తన ఇంటి కోడలుగా చేసుకుంటానని మురళి పిన్నికి చెపుతుంది. కారణం చెప్పకుండా విజయ్‌ను దూరమవ్వమంటుంది మురళి. పుష్కరాల్లో దొరికిన తనను పెంచి పెద్ద చేసిన వారి కోసం త్యాగం చేయాలనుకుంటుంది మురళి. శివశంకర్‌కు బ్లడ్ కేన్సర్ అని తెలిసి దిమ్మెరపోతుంది. ఈ విషయం ముందే తెలిసి ఉంటే విజయ్‌ను దూరం చేసుకునుండను కదా ! అని వాపోతుంది. శివశంకర్ మురళి సాహచర్యంలో ఉల్లాసంగా, ఆనందంగా ఉంటూంటాడు. ఒకరోజు మురళి శివశంకర్ కోరికను తిరస్కరిస్తుంది. అతను ఆమెను మురళీప్రియగా గుర్తిస్తాడు. ఆమె ఆ విధంగా నాటకమాడుతున్నది తన డబ్బు కోసమే అని నిందిస్తాడు. ఊహించని విధంగా అతను ఆమె మెడలో పసుపుతాడు కడతాడు. మురళి మెడలో తాళికట్టిన మూడురోజులకే మరణిస్తాడు శివశంకర్. మురళి చెప్పిన కథ విని సానుభూతిగా చూసాడు విజయ్. ఆమె కోరగా తన కథను చెప్పసాగాడు — హోటల్ మంజులో జరిగిన పోలీసు రైడింగ్‌లో మానస, సుకుమార్‌లను అరెస్ట్ చేస్తాడు ఇన్‌స్పెక్టర్ విజయ్. సుకుమార్‌ను మంత్రిగారి ఆజ్ఞానుసారం విడుదల చేయక తప్పలేదు విజయ్‌కి. మానసను కూడ విడుదల చేస్తాడు. రాత్రి ఇంటికి వస్తున్న మానసను రౌడీల బారినుండి రక్షించి ఆమె ఇంటికి చేరుస్తాడు విజయ్. ఇన్‌స్పెక్టర్ విజయ్ పేరు వింటేనే పేవ్‌మెంట్లమీద చిల్లర వ్యాపారాలు చేసేవారు, అవినీతిపరులు గడగడలాడుతుంటారు. ఏ కొద్దిమంది స్వార్థపరులకో తప్ప విజయ్ కార్యదీక్షత, నిజాయితీ చాలమందిని ఆకర్షించాయి.

ప్రయత్నాలు— అనుభవాల తరువాతే ఈ బాటను ఎంచుకున్నాను.

ఇప్పుడు చెప్పండి. నాకు మీరు ఉద్యోగం ఇప్పించగలరా ? దారితప్పిన నా జీవితానికి మంచి మార్గం చూపగలరా?—'' ఛాలెంజి చేస్తున్నట్లు ధైర్యంగా అడిగింది మానస.

ఇనస్పెక్టరు విజయ్ లోలోన విస్మయం చెందాడు ఆమె ధోరణికి. ఎంతోమంది అమ్మాయిల్ని చూసాడు. కానీ ఈమెలో వున్న ధైర్యం, తెగువ ఇంతవరకు ఎవరిలోనూ కనిపించ లేదతనికి.

''చెప్పండి ఇనస్పెక్టర్‌గారూ ! అసలు నామీద మీ కెందుకింత శ్రద్ధ ?''

''నీవంటే సింపతీ—''

''అర్థంలేని సింపతీ అంటే నా కసహ్యం ! నా దౌర్భాగ్యాన్ని ఎత్తిచూపి దెప్పి పొడవడం కాదు నాకు కావల్సింది. నా జీవితంలోకి తొంగి చూసి అర్థం చేసుకుంటే చాలు.''

విజయ్ రెండు క్షణాలు ఆగి ''ఆల్‌రైట్ నీకు ఉద్యోగం వేయిస్తాను—'' అన్నాడు.

''అదే జరిగితే, మరోసారి ఇలా మీ ముందు దోషిలా నిలబడను. కానీ, మీరు నాకు ఉద్యోగం వేయిస్తానంటుంటే నమ్మకం కలగడం లేదు. ఆ మధ్య ఒక వెధవ నా శరీరంతో ఆడుకుని నా తమ్మునికి ఉద్యోగం వేయిస్తానని మోసంచేసాడు. ఇక ఏ ప్రతిఫలాపేక్షా కోరని మిమ్మల్ని ఎలా నమ్మను ?''

''కావచ్చు, నేనుమాత్రం నీకు నిస్వార్థంగా ఉద్యోగం వేయిస్తాను.''

''అప్పుడు మీకు జీవితాంతం కృతజ్ఞురాలిగా వుంటాను—''

విజయ్ మనసు కొద్దిగా కుదుటబడింది




''రేపు పది గంటలకు రా. ఇక నీవు వెళ్ల వచ్చు—''

మానస కృతజ్ఞతగా చేతులు జోడించి అక్కడ నుంచి వెళ్లిపోయింది.

17

శ్రీనివాస ఏజన్సీస్‌లో మానసకు చిన్న ఉద్యోగం వేయించగలిగాడు విజయ్. అది ప్రయివేటు కంపెనీ కాబట్టి జీతం రెండువందలే ఇస్తామన్నారు. ఆ చిన్న ఆధారం దొరికినందుకే మానస సంబరపడి వెళ్లి ఉద్యోగంలో చేరింది.





'ఎన్నో రోజుల నుంచి తపించి వేధించిన ఉద్యోగం ఇన్నాళ్లకు లభించింది. ఇలాంటి అవకాశం కొన్ని రోజుల క్రితం దొరికినట్లయితే తన జీవితం మరోకలా వుండేది. తన గుండెకింత రంపపుకోత వుండేది కాదు. ఏ దేవుడు కరుణించాడో ఇనస్పెక్టర్ విజయ్ రూపంలో వచ్చి తనకు సాయం చేసాడు.–' అని విజయ్ పట్ల కృతజ్ఞతా భావం మరింత పెరిగింది మానస మానసంలో.

ఆఫీసులోకి అడుగుపెట్టిన తొలిరోజే ఆమె ఎన్నో అవమానాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎన్నో తీవ్రమైన చూపుల్ని, వ్యంగ్యమైన విసుర్లను తట్టుకోవాల్సి వచ్చింది.

'వారందరి దృష్టిలో తనొక పతిత. డబ్బుకు వళ్లు అమ్ముకునే నీచురాలు.' చాలా మంది చూపులు, ప్రవర్తన ఆ విధంగానే వున్నాయి. ఆ ఒక్కరోజు అనుభవంతోనే ఆ ఉద్యోగమంటే మొహం మొత్తింది. అక్కడి మనుష్యులమీద జుగుప్స కలిగింది.

'ఏమిటి ఈ మనుష్యుల తత్వం ? నేను పతితనే కావచ్చు. అయితే మాత్రం ఇలా ముఖం మీదే అసహ్యంగా మాట్లాడుతారా ? వీళ్లంతా చదువుకున్నవారు. కానీ సంస్కారం ఏది ? తమ లాగే పొట్ట నింపుకునేందుకు వచ్చిన అభాగ్యురాలి మీద సానుభూతి చూపించరే ?

వీళ్ల దృష్టిలో తను హీనురాలు. ఆ భావాన్నే అడుగడుగునా ఎత్తి చూపుతూ తనకు నరకాన్ని సృష్టించుతున్నారు. అనరాని మాటలతో తన మనసును ముక్కలు చేస్తున్నారు. వీళ్లతో కలిసి తనెలా పని చేయాలి ? తనవల్ల కాదు... తనీ వాతావరణంలో ఇమడలేదు. ఇమడాలనుకున్నా ఈ మనుషులు తనను తమ పంచకు చేరనివ్వరు.

ఆత్మను, అభిమానాన్ని చంపుకుని వీళ్లందరి మాటల్ని భరిస్తూ తను పొందగలిగే దేమిటి ? కేవలం ఓ రెండు వందల రూపాయల జీతం మాత్రమే ! అలాంటి రెండువందలు తను ఒక్క

మానస మురళి

రాత్రిలో సంపాదించగలదు. కొన్ని గంటలు తన శరీరం తనది కాదనుకుంటే ఇలాంటి డబ్బు చాలా సంపాదించవచ్చు. కేవలం డబ్బుకోసమే అయితే ఆ వృత్తి ఎంతో మేలు. ఆ వృత్తిలో పొగడ్తలే గానీ, ఇలాంటి మాటపోటీలుండవు. తను కోరుకునేది డబ్బేకాక, తనకంటూ ఒక విలువ, గౌరవము పొందాలని ఇక్కడకు వచ్చింది. అందరి ఆడవాళ్లలా తనూ ఇకనుంచి పవిత్రమైన జీవితం గడపాలని ఆశించింది. గడిచిన జీవితానికి ముసుగు కప్పేసి క్రొత్త జీవితం కొనసాగించాలని వచ్చింది.

కానీ; జరుగుతున్నదేమిటి ? ఈ సమాజం తనను క్షమించడం లేదు తన గత జీవితాన్ని అడుగడుగునా ఎత్తిచూపుతూ మెత్తని కత్తులతో గుండెను కోస్తోంది. చీకటి నుంచి వెలుగులోకి రావాలని ప్రయత్నిస్తుంటే– ఈ సమాజం నీకా విలువ లేదంటూ తిరిగి చీకట్లోకే నెట్టేస్తుంది. ఇక తను వెలుగు చూసే ప్రాప్తం లేదా ?—' అని మానస లోలోన కుమిలిపోయింది.

మరుదినం ఆఫీసుకు వెళ్లాలంటే విపరీతమైన భయం కలిగింది. తన తోటి ఉద్యోగస్తుల వికృతమైన చూపులు – వక్రమైన విసుర్లు గుర్తుకు వచ్చి ఆ ఉద్యోగానికి నీళ్లు వదులుదామనుకుంది. కానీ, రాకరాక వచ్చిన ఉద్యోగాన్ని మానేయడం మూర్ఖత్వం. 'ఎవరు ఏమనుకున్నా తనను కాదనుకుంటే సరి–' అని నిబ్బరపరుచుకుని వెళ్లింది మానస.

ఆమె ఆఫీసులో అడుగుపెడుతూనే గుసగుసలు మొదలయ్యాయి.

"కాలం ఎంత పాడైపోయింది. డబ్బుకోసం వళ్లమ్ముకునే వాళ్లు కూడా పతివ్రతల్లా వేషాలు కట్టి ఉద్యోగాలకు బయలుదేరారు–" హెడ్‌క్లర్క్ భద్రయ్య మానస వంక కొరకొరా చూస్తూ అన్నాడు.

ఆ మాటలకు ప్రక్కనేవున్న గుమస్తా గుర్నాథం కిసుక్కున నవ్వి "కలికాలం గురూ ! ఇలాంటి వాళ్లు కూడా ఉద్యోగాలకు ఎగబడబట్టే దేశంలో నిరుద్యోగ సమస్య నానాటికీ పెరిగిపోతోంది –" అన్నాడు.

"వీళ్లకు ఉద్యోగాలెందుకు ? ఇదంతా నటన. అందమైన అబ్బాయిల్ని, బ్రహ్మచారుల్ని ఆకర్షించడానికి ఉద్యోగం సాకు. మన ఆఫీసులో ఎవరికి తగులుతుందో ఆ ఛాన్సు..." కళ్లతో ఆమె అందాన్ని జుర్రుకుంటూ మత్తుగా అన్నాడు ఎదురు సీటు గోపాలం. వీళ్ల మాటలకు శ్రుతి కలిపినట్టు కనకవల్లి ముసిముసి నవ్వు లొలకబోస్తూ 'నీ వెంత పతివ్రత వేషం వేసినా నీ నీచ బ్రతుకు అందరికీ తెలుసులే –' అన్నట్లుగా చూసింది.

మానస ముఖం మలినమయింది. గుండెనెవరో నొక్కిపట్టినట్లు అమితమైన బాధ కలిగింది. ఎదలో రేగే అలజడిని అణుచుకుంటూ

మోటార్ సైకిల్ పై ప్రపంచ యాత్ర !

మోటారు సైకిలుపై ప్రపంచ యాత్ర చేస్తున్న అశోక్‌కుమార్ స్వామి నారాయణ పది సంవత్సరాల క్రితం కాలిఫోర్నియాలో తమ యాత్రను ప్రారంభించారు. ఇంతవరకూ ఆయన ఉత్తర, దక్షిణ అమెరికాలను, యూరపు, ఆఫ్రికా, ఓషియానియాలను సందర్శించారు. ఆయన జపానులో తయారుచేసిన కావస్కీ మోటారుసైకిలును తమ పర్యటనకు ఉపయోగిస్తున్నారు. ఇటీవల ఆయన జపాన్‌లోని అకాషీ నగరంలో కావస్కీ కర్మాగారాన్ని సందర్శించినపుడు ఆ కంపెనీ ఉద్యోగులు, అధికార్లు ఆయనకు ఘనంగా స్వాగతమిచ్చి కావస్కీ జెడ్ 400 మోటారుసైకిలు బహుమతిగా ఇచ్చారు. కొరియా, చైనాలను సందర్శించిన తరువాత ఆయన భారత దేశానికి వస్తారు.

ఆంధ్రసచిత్రవారపత్రిక

వజ్రోత్సవం
ఆంధ్ర సచిత్ర వారపత్రిక
75
1908 - 1983
ANDHRA SACHITRA VARAPATRIKA
PLATINUM JUBILEE

[16 - 9 - 1983]

వినాయక చవితి సంచిక

వజ్రోత్సవసంచికగా వెలువడుతుంది!

1908 లో వినాయక చవితినాడు వారపత్రికగా జన్మించిన ఆంధ్రపత్రిక తెలుగువారికి చేస్తూవచ్చిన సేవ ఇంతా అంతా కాదు. ఇప్పటికి ఏడున్నర దశాబ్దాలుగా ఆంధ్ర సచిత్ర వార పత్రిక ఆంధ్రుల ఆదర్శాలకీ, ఆశయాలకీ, వారి సంస్కృతికీ ప్రతిబింబంగా ఉంటూ వచ్చింది. పాఠకులు, ఇతర శ్రేయోభిలాషుల ఆదరాభిమానాలతో, మరింత ఉత్సాహంతో ఈ సేవని కొనసాగించాలన్న కృతనిశ్చయంతో ఉంది.

తెలుగువారి సర్వతోముఖ వికాసానికి 75 సంవత్సరాల కాలంలో ఆంధ్ర సచిత్ర వారపత్రిక చేస్తూ వచ్చిన కృషి ఎటువంటిదో కొంతవరకయినా ఈ వినాయక చవితికి వెలువడే వజ్రోత్సవ సంచిక తెలుపగలదు!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక సంచికలో అప్పటివారివి, ఇప్పటివారివి ఎన్నో రచనలు ఉంటాయి — కథలూ, వ్యాసాలూ, కవిత్వం, బొమ్మలూ మొదలయినవి!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక వజ్రోత్సవ సంచిక కనీసం రెండు వందల పేజీలతో, పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణతో వెలువడుతుంది!

నేడే మీ కాపీ రిజర్వు చేసుకోండి!

మానస మురళి

తల దించుకుని తడబడే అడుగులతో తన సీట్లోకి వెళ్లి కూర్చుంది. ఏమీ జరగనట్లు మామూలుగా వుండబోయింది. ఇంతలో మేనేజర్ దగ్గర నుంచి పిలుపు రాగా లేచి వెళ్లింది మానస..

అది ఎయిర్‌కూల్డ్ చేయబడిన గది. గది మధ్యలో కుర్చీలో కూర్చుని ఫైల్స్ చూస్తున్న మేనేజర్ సదాశివం మానసను చూసి కూల్‌గా నవ్వాడు. మానస కూడా చిన్నగా నవ్వుతూ విష్ చేసింది సదాశివం చూపులు ఆమెను నిలువునా పరీక్షిస్తున్నాయి.

మానసకు కాస్త ఇబ్బందిగా అనిపించింది.

"సార్... పిలిచారట... దేనికి ?"

"కూర్చో నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి —"

"ఫర్వాలేదు చెప్పండి—" మానస నిలుచునే అడిగింది.

"ఎలా వుంది నీకిక్కడ ? ఈ వాతావరణం నీకు నచ్చిందా ? వర్కు ఎక్కువగా వుంటే నాతో చెప్పు ... ముఖ మాట పడకు—"

తలూపింది మానస.

"నిలబడే వున్నావు. కూర్చో—"

ఇక తప్పదన్నట్లు ఆయన ఎదుటి సీట్లో కూర్చుంది మానస.

"నిన్నో విషయం అడగాలనుకుంటున్నాను అడగనా ?—" టేబిల్ మీద చేతులు ఆన్చి ముందుకు జరుగుతూ అడిగాడు సదాశివం.

"అడగండిసార్..." వినయంగా నవ్వింది మానస.

సదాశివం ఒక్క క్షణం ఆగి "ఇంతకు ముందు నువ్వు ఏంచేసేదానివో నాకు విజయ్‌గారు అంతా చెప్పారు. ఈ రోజుల్లో అలాంటి వన్నీ కామన్, ఆఫీసులో ఎవరేమనుకున్నా వర్రీ కాకు. ఇలాంటి విషయాలు చాలాస్పోర్టివ్‌గా తీసుకోవాలి. జీవిత మున్నది అనుభవించడానికే ! వెధవ సెంటిమెంట్స్‌తో కాలాన్ని వృధా పుచ్చడం నాకు గిట్టదు" అని అంటూ ఆమె కళ్లల్లోకి చూసాడు.

అతని అంతర్యాన్ని గురించి ఆలోచిస్తోంది మానస.

అతని మనసులోని కోరికలు పురులు విప్పుకుని కళ్లలో ప్రతిఫలిస్తున్నాయి.

తిరిగి సదాశివం నవ్వుతూ "నీవు చాలా తెలివైన దానవని విన్నాను. ఈ పాటికి నా కోరిక గ్రహించేవుంటావు. ఏమంటావు మానసా ?" అన్నాడు మెల్లగా.

లోలోన గుండె మండుతున్నా "సారీసార్ ! నేనావృత్తి మానేశాను" పైకి నవ్వేస్తూ అన్నది మానస.

"ఎప్పటి నుంచి ?"

"జీవనాధారంగా ఈ వుద్యోగం దొరికిన మరుక్షణమే ఆ వృత్తికి స్వస్తి చెప్పేశాను. ఇకముందు అలాంటి పనులు చేయకూడదను కున్నాను."

"గుడ్ ! నీ నిర్ణయం నాకు బాగా నచ్చింది. కాకపోతే చిన్న అడ్జస్ట్‌మెంటు. నీ నిర్ణయాన్ని రేపటి నుంచి అమలు జరుపుకో. ఈ ఒక్క రోజుకు కాస్త సడలించుకుని నా మక్కువ తీర్చు. నిన్ను చూసినప్పటి నుండి నాలో కోరిక బలంగా అల్లుకుపోయింది. నా కోరిక తీరుస్తావన్న ఉద్దేశ్యంతోనే ఇనస్పెక్టరు విజయ్‌గారు అడిగిన తక్షణమే నీకు ఉద్యోగ మిచ్చాను. ప్రతిఫలంగా నీవు నా కోరిక తీర్చడం నీ ధర్మం. కాదంటావా మానసా ?"

"ఎలా కాదంటాను సార్ ! నాకింత మేలు చేసారని మీరు చెప్పేదాకా నాకు తెలీదు. నా ధర్మాన్ని నేను నిర్వర్తిస్తాను. తప్పక మీ కోరిక తీరుస్తాను."

"థాంక్యూ మానసా !"ఆనంద పారవశ్యంగా ఆమె చేతి నందుకున్నాడు. మానస నవ్వుతూనే తన చేతిని వెనక్కి లాకుకుంది.

"నేను మీ కోరిక తీర్చాలంటే మీరు నా షరతుకు కట్టుబడి వుండాలి."

"చెప్పు మానసా! ఏంకావాలి నీకు ? తాజ్ లో ఏ. సి. రూమ్ బుక్ చేయనా ? పట్టుచీరె కొనియ్యమంటావా ? ఏమిటి నీ షరతులు ?" ఉత్సాహంగా అడిగాడు సదాశివం.

"నాకేమీ అక్కర్లేదు."

"మరేంకావాలి ?"

"పెద్ద కోరికలు నాకు లేవు. వెరీసింపుల్. మీనాక్షిలో సింగిల్ రూము తీసుకోండి చాలు. ఖరీదు కూడా పెద్దగా వుండదు. సరిగ్గా ఆరు గంటలకు మీ కోసం ఎదురుచూస్తూ వుంటాను.


"ష్యూర్... ష్యూర్..." పొంగిపోయాడు సదాశివం.

"అలాగే మన రూమ్ ప్రక్కన మరో రూమ్ కూడా బుక్ చేయించండి. అన్నట్లు అసలు విషయం మర్చిపోయాను. మీరు వచ్చేప్పుడు మీ శ్రీమతిని కూడా వెంట తీసుకు రావడం మర్చిపోయేరు. ఆమె ఎదురుగానే మనం శృంగారం జరుపుదాం. అదే నా కోరిక" అంటూ ఒక్కక్షణం ఆగి అతని ముఖంలోకి చూస్తూ "ఏమిటిసార్ అలా డల్‌గా అయిపోయారు ? మీరేం వర్రీకాకండి నాకు లేని సిగ్గు మీ కెందుకు ?" అంటూ వ్యంగ్యంగా నవ్వింది మానస.

సదాశివం కొరకొరా చూసేడు. కోపంతో అతని ముఖం జేవురించింది.


"మానసా ! ఏమిటి నీ పిచ్చి వాగుడు ? ఇష్టం లేకపోతే సూటిగా చెప్పరాదూ ! డొంక తిరుగుడుగా మన మధ్య ఆవిడెందుకు ?"

"ఇష్టంలేక కాదు సార్. మనిద్దరం హోటల్ గదిలో సుఖమనుభవిస్తుంటే పాపం ఆమె ఒక్కతే ఇంటి దగ్గర ఏం చేస్తుంది ? జస్ట్ ... ఆమెకూ కాలక్షేపం కావాలి గదా !



కోల్గేట్ తాలూకు నమ్మకమైన ఫార్ములా మీ నోటి శ్వాస శుభ్రంగా, తాజాగా వుండేలా చేస్తుంది...
మీ పళ్లు ఆరోగ్యంగా, దృఢంగా వుండేలా చేస్తుంది.

ఎలాగో చూడండి:



మీ పళ్లలో ఇరుక్కుపోయిన ఆహారపు తునకల్లో దుర్వాసన, దంతక్షయం కలిగించే సూక్ష్మజీవులు పెరుగుతాయి.

కోల్గెట్‌లోని అద్వితీయమైన శక్తి గల నురుగు లోతుగా చొచ్చుకుపోయి, హానికరమైన ఆహారపు తునకలనీ, సూక్ష్మజీవులనీ తొలగిస్తుంది.

ఫలితం: ఆత్మవిశ్వాసాన్నిచ్చే తాజా శ్వాస, దంతక్షయం నుంచి రక్షణ, ఆరోగ్యమైన గట్టి పళ్లు.

గుర్తుంచుకోండి, ప్రతిసారీ భోజనం కాగానే కోల్గేట్ డెంటల్ క్రీమ్‌తో పళ్లు బ్రష్ చేసుకోండి. నోటి దుర్వాసన పోగొట్టుకోండి...దంతక్షయాన్ని ఎదుర్కోండి.

దీని తాజా పిప్పరమెంట్ రుచి మీ కెంతో నచ్చుతుంది!

GK&E B82 86 TL,

మానస మురళి

అందుకే వెంట తీసుకురమ్మంటున్నాను. అంతగా మన శృంగారాన్ని చూ శ్లేకపోతే ప్రక్క గదిలో నా బ్రదర్ వుంటాడు. అక్కడికి వెళుతుంది. అతని కోరికా తీరుతుంది. ఏమంటారు ?''

సదాశివం ముఖం సిరంజితో రక్తం తోడేసినట్లు తెల్లగా పాలిపోయింది. కళ్లల్లోంచి నిప్పులు రాలుస్తూ ''నోర్ముయ్! పిచ్చి పిచ్చిగా వాగావంటే పళ్లు రాలగొడతాను. నా భార్య నీలా బజారు మనిషనుకున్నావా హోటళ్ల వెంబడి తిరగడానికి ? బీకేర్‌ఫుల్ ... మరో మాట మీరా వంటే నిలువునా చీరేస్తాను — '' గంగవెర్రులెత్తిపోయాడు.

మానస లేచి నుంచుని పగలబడినవ్వింది.

''అవును నేను బజారు మనిషినే. నిన్నటి వరకు డబ్బుకు అమ్ముడుపోయేదాన్నే. ఆ జీవితం మీద రోతపుట్టి మంచిగా బ్రతకాలనుకుని ఇక్కడకు వచ్చాను. నా శరీరం చెడిపోవచ్చుగానీ, నా మనసింకా పవిత్రంగానే వుంది.

ఆ శరీరం కూడా ఎందుకు చెడిపోయిందో తెలుసా ? పిడికెడు మెతుకులకోసం! ఆవురావురుమని ఆకలి మంటలతో అలమటించిపోయే నా కుటుంబం కోసం. ఆ మంటల నుంచి నా కుటుంబాన్ని రక్షించుకోవడానికి నా శరీరానికి శిక్ష విధించుకున్నాను.

కేవలం నా వాళ్లకోసమే ఎన్నో మెట్లు దిగివచ్చాను.

అంతేగానీ, కామంతోనూ, మోహంతోనూ చెడిపోలేదు.

నీతిగా, పవిత్రంగా నాకూ బ్రతకాలని వుంది.

కానీ, మీలాంటి మృగాలు నాలాంటి చిన్న ప్రాణుల్ని బ్రతకనివ్వవని మీరు మరోసారి ఋజువు చేసారు. నాకు అడుగడుగునా అడ్డు తగులుతూ, అధఃపాతాళానికి త్రొక్కేస్తున్నారు. పరిస్థితుల ప్రాబల్యం వలన చెడిపోయిన ఆడదాన్ని క్షమించి చేరదీయలేకపోతున్నారు.

నేనూ మీ భార్యలాంటి ఆడదాన్నే! మీ భార్యలాగా నాకూ సంపాదించి పెట్టే భర్త వుంటే, మీరన్నట్లు హోటళ్ల వెంటబడే దాన్నికాదు. నేను గతిలేక గతుకులబాట వెంబడి పయనిస్తున్నాను. మీకు అన్ని హంగులు వున్నాయి. మీరెందుకు దిగజారుతున్నారు ? ఇక మీకు నాకు తేడా ఏమిటి? ఆలెక్కన మీరూ బజారుమనుషులే గదా ! కాదంటారా ?— '' ఆవేశంగా, తీవ్రంగా అడిగింది మానస.

సదాశివం కోపాన్ని అణుచుకోలేకపోయాడు.

''గెటవుట్ — '' అని బిగ్గరగా అరిచాడు.

''అలాగే వెళ్లిపోతున్నాను. మనసులు కుళ్లిన మీలాంటి మనుషుల మధ్య పవిత్రమైన నా మనసును బ్రతికించుకోవాలనుకోవడం నాదే

పొరపాటు. ఈ పొరపాటును మళ్లీ చేయను. వస్తా గుడ్‌బై — !'' విసురుగా స్ప్రింగ్‌డోరు తెరుచుకుని వెళ్లిపోయింది మానస.

'బరితెగించిన ఆడది — ' అని పటపట పళ్లు కొరికాడు సదాశివం.

18

''ఆవేశం అన్నివేళలా పనిచేయదు మానసా! నీ బాధ నేనర్థం చేసుకోగలను. కానీ, నీవిలా తొందరపడి ఉద్యోగాన్ని వదిలేసి రావడం నాకు నచ్చలేదు'' కించిత్ బాధగా అన్నాడు ఇనస్పెక్టర్ విజయ్.

''వదిలేయాలని నాకూ లేదు. ఎలాగో ఎడ్జెస్ట్ అవుదామనుకున్నాను. కానీ అక్కడి మృగాలు నా సహనాన్ని పరీక్షించాయి. నేనెంత చెడిపోయినదాన్నే అయినా, వాళ్లందరికీ చర్చ కావడం ఇష్టంలేక వచ్చేసాను. ఆ కత్తులబాట వెంట నడిచే ఓపికలేక తిరిగి వచ్చేసాను.' మానస కన్నుల్లో నీళ్లు నిలిచాయి. ఆమె అనుభవించిన వేదనంతా కళ్లు కథగా చెప్పాయి అతనికి.

''అయితే ఇప్పుడు ఏం చేయాలనుకుంటున్నావు ?'' దీర్ఘంగా నిట్టూరుస్తూ అడిగాడు విజయ్.

''వెలుగులోకి రావాలనుకున్న నన్ను ఈ సమాజం సంకెళ్లతో బంధించి వెనక్కి నెట్టేస్తుంది. తిరిగి నా పయనం చీకట్లోకే...''

''అది పిరికివాళ్ల పని. తెగువ ధైర్యం వుంటే ఈ సమాజాన్ని ప్రక్కకునెట్టి వెలుగులోకి రావచ్చు. అందుకు మనోనిబ్బరం, ఆత్మస్థైర్యం కావాలి. అవి నీలో పెంపొందించుకున్ననాడు ఈ సమాజం నిన్నేమీ చేయలేదు—''

''క్షమించండి. నాకంత ఓపిక లేదు.''

''అంటే పిరికిదానిలా వెనక్కి పారిపోతావా ?—'' కోపంగా చూసాడతను.

మానస వెంటనే మాట్లాడలేకపోయింది.

తిరిగి అతనే అన్నాడు ''నీ వెనక వున్నదంతా చీకటే ! ఆ చీకట్లోనే నీ జీవితం శిధిలమైపోతుంది. బాగా ఆలోచించుకో. నీవు ముందుకు రావడానికి ప్రయత్నిస్తే అందుకు నేను చేయూతనిస్తాను ''

మానస చటుక్కున కళ్లెత్తి అతని వంక చూసింది. అతని కళ్లు కురిపించే కరుణకు ఆమె చలించిపోయింది. అవ్యక్తమైన భావమేదో ఆమెను ఊపేసింది.

''పోనీ మరోచోట ఉద్యోగం చూడమంటావా ?''

ఆమె నవ్వి ''ఎక్కడకెళ్లినా అంతేగా'' అన్నది.

''అలాగని ఎందుకనుకుంటావు ? లోకమింకా నిలిచివుందంటే — మనుషుల్లో మంచితనం పూర్తిగా నశించలేదు.''

''నాకు నమ్మకంలేదు. మొత్తం సమాజాన్ని చదవలేకపోయినా, ఈ కొద్దిపాటి జీవితంలో ఎన్నో చేదు అనుభవాల్ని చవిచూసాను. ఎందరో వ్యక్తుల్ని పరిశీలించాను. నాకు తారసపడిన వ్యక్తులు, సంఘటనలు ఇంతవరకు నన్ను హింసిస్తూనే వచ్చాయి. ఈ సమాజ స్వభావాన్ని కొంతవరకైనా ఆకళింపు చేసుకున్నాను. చెడిపోయిన ఆడదంటే అందరికీ చిన్న చూపే. అలాంటి ఆడదానిమీద జాలి, సానుభూతి చూపించే వాళ్లు చాలా అరుదు. మీరు కాదన్నా, ఔనన్నా నాకు తెలిసిన కఠోర సత్యమిదే—''

''పొరపాటు మానసా! సమాజంలో మంచీ—చెడు ఎప్పుడూ వుంటుంది. నీవు భయపడుతున్నావు కాబట్టి ఈ సమాజం నిన్నింకా భయపెడుతుంది. నీవు భయాన్ని పారద్రోలి ధైర్యంగా నిలబడు. ఈ రోజు నిన్ను చూసి నవ్విన సమాజమే రేపు నిన్ను గౌరవిస్తుంది. క్రొత్త విలువల్ని అందిస్తుంది. అప్పుడు నీ చరిత్ర మారుతుంది. దేనికైనా పట్టుదల, దీక్ష—ఓర్పు కావాలి. ప్రతి చిన్న దానికీ చలించిపోతే ముందుకు సాగిపోవడం కష్టం—'' అని దీర్ఘంగా నిట్టూర్చాడు విజయ్.

''నెవ్వర్ ! చరిత్ర మారినా, దానికంటిన మరకలుపోవు. పోయాయని నేను విశ్వసించినా ఈ సమాజం నమ్మదు. నా హీన చరిత్రను ఎప్పుడూ ఎత్తిచూపుతూనే వుంటుంది''

విజయ్ అసహనంగా కోపంగా చూసాడు.

శాంతం తెచ్చుకుని ఎన్నో రకాలుగా ఆమెకు నచ్చజెప్పబోయాడు. ఆమె విన్లేదు. 'పాత వృత్తినే అవలంభిస్తాను — ' అనేసరికి అతని కోపం అధికమయింది.

''ప్రతి నిమిషానికి రేటుకట్టి డబ్బు సంపాదించేదానవు నీవు. అలాంటి నీకు శ్రమపడి సంపాదించే కొద్దిపాటి డబ్బు విలువ ఏం తెలుస్తుంది ? అక్కడ నీవు కోరినంత డబ్బు ఇచ్చే విటులుండగా నీవెందుకు శ్రమపడతావు ? నీవు ఎందుకు మారతావు ?''

ఆ మాటలు సూటిగా ఆమె ఎదలో గుచ్చుకున్నాయి. రోషంతో ముఖం ఎర్రబడింది.

''అవును. నాకు ఆ జీవితమే ఇష్టం. నన్ను వెళ్లనివ్వండి —'' అని గిరుక్కున వెనుదిరిగింది మానస.

''ఆగు —'' ఖంగుమన్నది అతని గొంతుక

ఆమె కాళ్లకు బ్రేకుపడినట్లు ఆగిపోయింది.


''నీవింత హీనురాలువనుకోలేదు. చేయూతనిస్తే చైతన్యవంతంగా జీవితాన్ని మలుచుకుంటావని ఆశించాను.


నాదే పొరపాటు. నీ గురించి గొప్పగా ఆలోచించడం నిజంగా నాదే పొరపాటు.ముత్యాలు కావాలంటే సముద్రాల్లో వెదికితే ప్రయోజనం వుంటుంది గానీ బురదగుంటల్లో ఎక్కడ దొరుకుతాయి ?'' ఆవేశంతో, రోషంగా అన్నాడతను.

ఆమెకూడా మరింత రోషపడుతూ ఇటు తిరిగింది.

''ఏమన్నారు? నేను బురదలాంటి మనిషినే. నాతో మీకేం పని ? అసలు మీకు నేనేమవుతాను ? ఎందుకిలా నా కాళ్లకు అడ్డు తగులుతున్నారు ? నా జీవితం. నా ఇష్టం.''

''మొండితనం, మూర్ఖత్వం నిండిన నీలాంటి ఆడవాళ్లను మార్చడం ఎవరితరం కాదు. పాటి మనిషిగా పతనమైన నీ జీవితాన్ని దిద్ది వెలుగులోకి తీసుకురావాలనుకున్నాను—''





"అదే అడుగుతున్నాను ఎందుకు ? నాకు సహాయం చేయమని నేనేం అర్థించలేదు మిమ్మల్ని — "

"దగాపడిన వాళ్లకు సాయం చేయాలన్నది నా ఆదర్శం — "

"మీ ఆదర్శం విజయవంతం చేసుకోవాలనుకుంటే ఈ దేశంలో నాలాంటి ఆడవాళ్లు చాలా మందివున్నారు. వాళ్లందరి జీవితాల్ని దిద్ది మీ ఆదర్శం నిలుపుకోండి. అప్పుడు మీకు కీర్తి వస్తుంది. పదిమంది బాహాటంగా మెచ్చుకుంటారు — "

"నేను కీర్తికండూతి కోసం చేయడం లేదు. బాధ్యతగల పౌరునిగా, నాలో పెంచుకుంటూ వస్తున్న ఆదర్శానికి ఒక రూపం ఇవ్వాలనుకున్నాను — "

మానస వ్యంగ్యంగా నవ్వింది.

"ఆదర్శాలనేవి అగ్నిపుష్పాల్లాంటివి విజయ్‌గారూ! అవి చూడ్డానికి, వింటానికి బావుంటాయి. దగ్గరకు వెళితే చేతులతోపాటు జీవితాన్ని కూడా కాల్చేస్తాయి. అసలు ఏమిటి మీ ఆదర్శం ? నన్ను చూసి జాలిపడి సానుభూతి చూపించారు. అంత మాత్రాన మీ ఆదర్శం నిలబడిందా ?

మీ కంత గొప్ప ఆదర్శముంటే — నిజంగా నా జీవితాన్ని దిద్దాలనివుంటే నా మెడలో తాళి కట్టి నన్ను అర్ధాంగిగా స్వీకరించండి. మా తమ్మునికి ఒక ఉద్యోగం వేయించి మా సంసారాన్ని నిలపండి. ఆ పని మీరు చేయగలరా ? అంతటి ధైర్యం, గొప్పతనం మీలో వుందా ? ఇలా ఉత్తుత్తి మాటలు చెప్పినందువలన ప్రయోజనం లేదు ఇనస్పెక్టరుగారూ !

నాకు కావాల్సింది సింపతీకాదు — పతి కాగలగాలి !

అంతటి హృదయ వైశాల్యం మీలో వుంటే అక్కడ ప్రేమ కుటీరాన్ని నిర్మించుకుని, అందులో మీ పవిత్రమూర్తిని ప్రతిష్ఠించుకుని పూజిస్తూ మనుగడ సాగిస్తాను. అలాంటి అవకాశం, అదృష్టం నాకు అందించిననాడు ఈ సమాజాన్ని కొనగోటితో ప్రక్కకు నెట్టేస్తాను.

మాట్లాడండి విజయ్‌గారూ !

నేను చెడిపోయినదాన్ని. నన్ను పెళ్లాడడానికి ఏ యువకుడూ ముందుకు రాడు. పోనీ కట్నాలుపోసి ఏ వెధవనైనా కొనుక్కుందామంటే మా నాన్న పేదవాడు, అసమర్దుడు కాబట్టి ఈ జన్మలో నాకా భాగ్యం లేదు.

నాకు పెళ్లిచేసుకుని ఒక పురుషుని సహచర్యంలో జీవితాన్ని గడపాలన్న కోరిక వున్నా — [illegible] అవకాశం కనుచూపు మేరలో కనిపించడంలేదు. ఆడమనసులోని తీయనికలలు— కోరికలు — కలలపర్వమే అయిపోతున్నాయి.

మీలాంటి ఆదర్శపురుషులు ముందుకు వచ్చిననాడు నాలాంటి శాపగ్రస్తుల బ్రతుకులు పండుతాయి. కలలు నెరవేరుతాయి. ఆలోచించండి. నా కోరిక అసమంజసమంటారా ?

మిమ్మల్ని చూసాక, మీ మంచితనం చవిచూసాక నా గుండెలోని ఎండిన మోళ్లు చివుళ్లు వేసాయి. ఆశ రెపరెపలాడింది. అంతరంగం ఆశను పదిల పరుచుకుంది ... మరి. ఆ ఆశ మోసులెత్తి మొగ్గ తొడగాలంటే మీ ప్రేమ ధార కావాలి.

ఈ పతితకోసం మీరలాంటి త్యాగం చేస్తే ధన్యురాల్ని.

బాగా ఆలోచించుకునే మీ నిర్ణయాన్ని తెలపండి. మీ నిర్ణయం నాకు అనుకూలంగా వుంటుందని ఆశపడుతున్నాను. అలా జరగనప్పుడు మంచితనమే ఈ లోకంలో లేదనుకుంటాను — " అని వడివడిగా అడుగులేసుకుంటూ అక్కడనుంచి కదిలిపోయింది మానస.

ఇనస్పెక్టర్ విజయ్ కొన్నిక్షణాలు శిలా ప్రతిమలా వుండిపోయాడు.

(ఇంకా ఉంది)

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

జి. ఏ. ఆర్. – మెట్టూరు

అక్కయ్యా, నాకు ప్రేమ అంటే చాలా యిష్టం. కాని నాకు ప్రేమించే విధానం తెలియదు.

★ కొంచెం ఓపికపట్టు తమ్ముడూ, కథలెలా రాయాలి ? వంట ఎలా చేయాలి ? తోటలెలా పెంచాలి ? లాంటివి అనేకం వస్తున్నాయి. అలాగే ప్రేమించడం ఎలా ? అంటూ పుస్తకం వస్తుంది. (నాకు గట్టి నమ్మకం వుంది ! ప్రస్తుతం సెక్సు సమస్యల విపుల విశదీకరణలు చిన్నా పెద్దా చదివే సంసార పత్రికల్లోనే తెగ వస్తున్నాయి. యివి మీలాంటి వారి క్యూరియాసిటీని పెంపొందిస్తున్నాయి కదా? దానికి అనుబంధంగా వీళ్ళు తప్పక మీకవసరమైన పుస్తకం తెస్తారు !)

అవిత – ఆదోని

ప్రతి మగవాని విజయం వెనుక ఒక ఆడదానిచేయి వుంటుంది అంటారు కదా. మరి రామారావుగారి వెనుక ఏ ఆడదాని చేయి వుందంటారు ?

★ ఆయన సతీమణి. ఆమె ఎంత ప్రశాంతమైన గృహ వాతావరణాన్ని సృష్టించి వుండకపోతే – శ్రీ రామారావుగారింత వృత్తిపై దృష్టి కేంద్రీకరించి వుండేవారే – కాదు.

షన్ముఖ – సువాబేడ

నువ్వంటే నాకు భయం ! ఎందుకు ?

★ ఆడది ఎలా వుంటే మగవాడు భయపడతాడో అలా వున్నానేమో – తమరి దృష్టిలో !

రోషన్ – చినవాల్తేరు

'వివాహం విద్య నాశనం' అన్న సూక్తి పురుషుని విషయంలో, మరి స్త్రీ విషయంలో?

★ స్త్రీ విషయంలో కూడా అదే వర్తిస్తుంది– అప్పుడే ఆమె గారూ గ్రహిస్తుంది పెళ్ళికి చదువు దండగ అని !!

వి. ఆర్. ఎ. – కరీంనగరు

మన సమాజంలో భర్త చనిపోయిన స్త్రీకి కొన్ని ఆంక్షలు విధించారు. ఇవే ఆంక్షలు పురుషునికి విధిస్తే ?

★ తన భార్య చనిపోయిందన్న వార్త కూడా పైకి పొక్కకుండా జాగ్రత్త పడతాడు !

కలీమిశ్రీ – కొత్తరెడ్డిపాలెం

వినయంచూపేకొద్దీ అణగద్రొక్కే నేటి సమాజంపై మీ అభిప్రాయం ?

★ అన్నిచోట్లా వినయం తగదు. చేతకాని తనంకింద జమకడతారు. ఈ సమాజం నెత్తిన మొట్టే వారి మోచేతి నీరు త్రాగుతుంది. తల వంచిన వారి నెత్తిన మొట్టుతుంది.

సురేంద్ర – ఆదోని

వరకట్నం అంటే – తాను చేసుకోబోయే ఆడదానిని జీవితకాలం పోషించడానికి వరుడు అడిగే డబ్బు అని నా అభిప్రాయం.

★ తిండి పెట్టడానికే దిక్కులేనివాడు సెక్సు సుఖానినేం యివ్వకల్గుతాడు ? భార్యలు తిండి బట్టా కోసమే కాదు, జీవితాన్ని పంచుకుందుకు కూడా.

అమ్ములు – వేల్పాడు

నన్ను ప్రేమిస్తానంటూ ఒకతను లెటర్ రాశాడు. నా కతనిమీద ప్రేమాలేదు, అసహ్యం లేదు. ఏం చేయను ?

★ ఇలాంటి చిన్న పొరపాట్లు ఇగ్నోర్ చేయాలి. యిష్టంలేని ప్రేమలేఖలు తక్షణం చింపి పారేయాలి కూడా !

డి.ఎస్.ఎస్. – విశ్వేశ్వరపురం

చదువు కావాలనడం కేవలం ఉద్యోగం కోసమా ?

★ నిజమైన చదువు డిగ్రీకాదు. అది మనిషి మనస్సుని విశాలం చేస్తుంది; కుతూహలాన్ని పెంచి విజ్ఞానాన్వేషణలో తల మునకలయేలా చేస్తుంది.

ఈనాటి చదువు డిగ్రీలిచ్చినా – కనీసం ఉద్యోగంయిస్తుందన్న గ్యారంటీకూడా లేదుకదా!

బి. ఏ – అక్కువల్లి

ప్రేమకు అర్థం ?

★ పెద్దల కళ్ళుకప్పి అమ్మాయిలని కలుసుకోడం కానేకాదు.

కె. జి. ఆర్. – జయపురం

మీ జవాబులలో వేడి యీ మధ్య చాలా తగ్గింది ?

★ వయస్సు పెరిగింది కదా ? !

టి. ఆర్. కె. – విజయవాడ

రేప్ చేసిన మగాడికి గర్భం వస్తే ?

★ ఛస్తే అలాంటి నికృష్టపు పనికి పూనుకోడు.

ఎమ్. కె ఎస్. – అక్కుపల్లి

మనిషికి విజ్ఞానం పెరగాలంటే ఏం చేయాలి ?

★ అన్నీ తనకి తెలుసునని అనుకోవడం మానాలి !

కె. ఎస్. – కరీంనగరు


నేటి రోజుల్లో మీ దృష్టిలో అతి చులకనైనది ఏమిటండీ ?


★ రోజూ పేపర్లలో చూడ్డంలేదా ? స్త్రీల మాన ప్రాణాలు !

ఎమ్.ఎల్.ఎస్. – బైపల్లి

మీరు మరీ 'పెంకి'గా జవాబులిస్తున్నారు. కాస్త ఆలోచించండి ?

★ ఆలోచిస్తే మీకు జవాబు రాయలేను ! పెంకి నా మొదటి పేరు. నంగిరి కబుర్లు, నసగా మాట్లాడడం, నీల్లు నమలడం, కాకి మీదా పిల్లిమీదా పెట్టి కబుర్లు చెప్పడం –సగం చచ్చినట్టు ఆలోచించడం నాకు చేతకాని పని. ''ఎప్పుడూ పులిమీద పుట్రలాగా వుండాలే రావుడూ! పులిముందు మేకలా కాదు'' అనేవాడు మా పెద్ద మామయ్య. ★





ఎంతెంత దూరం

కంచుమర్తి వెంకటేశ్వరరావు

బలరామయ్య నడుస్తున్నాడు.

ఎక్కడకో, ప్రశాంతమైన వాతావరణానికి చేరుకోవాలని తాపత్రయం అయనిది. కానీ అదెక్కడ ? అదే తెలియదు. తెలియనప్పుడు ఎక్కడవరకని వెళ్ళగలడు ? కూరగాయల మార్కెట్టు... మెయిన్ రోడ్డు... పార్కు... అన్నీ దాటుకుని వెళ్ళాడు. అవేవీ అతనికి అహ్లాదకరం కలిగించే ప్రదేశాలు కావని తెలుసు. అయినా నడుస్తున్నాడు.

రోడ్డు మలుపు తిరిగాడు.

ఎదురుగా కారు అతన్ని ముద్దెట్టుకోబోయి ఆగింది. డోర్‌లోంచి తల బయటపెట్టింది డ్రైవ్ చేస్తున్న అందమైన అమ్మాయి. ఆ అమ్మాయిని చూసాడు. పాలుగారే చెక్కిళ్ళు... బిగువైన పరువాలు. అవేవీ తను దాచడంలేనన్నట్లుగా ఒంటికి అమరిన బిగువైన ఫేంటు... చిన్న చొక్కా. ధనవంతుల పిల్ల.

''ఏయ్ బ్రతకాలని లేదా.''

నవ్వొచ్చింది బలరామయ్యకు. పసిపిల్ల. తన వయసులోని మూడోవంతు కూడా లేదు. తన వయసుకు ఎదగాలంటే ఇంకా నలభై ఏళ్ళు రావాలి. అప్పుడు తెలుస్తుంది ఈ ముసలి బ్రతుకు సార్థకత ఏమిటో ! బ్రతకాలని వుందో లేదో ! ఇంకా ఈ అరవై ఏళ్ళ వయసులో ఎందుకు బ్రతకాలో !

కారు వెళ్ళిపోయింది దుమ్మురేపి.

ఇందాక ఆ కారు తనను ముద్దెట్టుకుంటే తన గమ్యం చేరేవాడేమో. ఆ గమ్యానికి తనకూ ఎంత దూరం ? బెత్తెడు. ఆ బెత్తెడు దూరం కూడా చేరుకోలేక పోయాడు. అడుగులో అడుగు లేస్తూ నెమ్మదిగా నడుస్తున్నాడు.

ఆగిపోయాడు. ఇంటిదారి వచ్చింది. ఆ ఇంటిలోనే రెండు గంటల క్రితం ఈ భవ బంధాల నుండి విముక్తి చేయమని భగవంతుణ్ణి ప్రార్థించి మరీ బయటకు వచ్చాడు. ఎక్కడకో వెళ్ళాలని... తిరిగి తిరిగి మళ్ళీ ఇంటికే వచ్చాడు.

భూమి గుండ్రముగా ఉండును... నిజమే ననుకున్నాడు.

వరండాలో కూర్చున్నాడు. గదిలోంచి గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. ఆ గంటలు ఆ ఇంట్లో అతని భోజన సమయం గుర్తుకు చేస్తుంది. ఎక్కడున్నాసరే ఆ గంటలు కొట్టే టైముకు ఇంట్లో ఉండవలసిందే. భోజనమంటే ప్రేమకాదు. ఆకలేసి అంత కంటేకాదు. భోజనమంటే నవరసాలు కలిసింది కాదు అతని దృష్టిలో. అరవై ఏళ్ళు పైబడ్డ అతను డాక్టరు సలహామీద రైసు మానేసి రాత్రిళ్ళు పాలు, లేదా కాఫీ, బ్రెడ్డు తీసుకుంటు న్నాడు. ఆ మాత్రానికే అంత టంచనుగా ఎందుకు ఎంటెండవ్వాలి. కోడలు పిల్లకు బడిసి. ''అయ్యో మామయ్యగారు మీకు లేటయింది'' అని కోడలుపిల్ల బాధపడుతుందనికాదు. ''అందరూ ఒకసారి వస్తే పని తెములుతుంది. తలోక టైముకు పనులు చెయ్యాలంటే నావల్ల కాదు'' అనే కోడలు విసుర్లు వినలేక.

''అమ్మాయి... కాఫీలో పంచదార లేదు.'' అడిగేడు.

''మీరు పంచదార వేసుకోకూడదు.'' కోడలి సమాధానం.

పంచదార కలిపిన కాఫీ తనకు దూరం. ఈ దూరం డాక్టరు కొంత చెప్పితే తగ్గిందే చాలనుకుని అసలు తన కాఫీలో పంచదార కలపదు కోడలు. అలవాటయినా ఈ రోజు తీపి లేని కాఫీ త్రాగుతుంటే చేదుగాఉంది. అయినా బాధనిపించలేదు. గబగబ త్రాగేసాడు.

బలరామయ్య ఎప్పుడూ బాధపడలేను. అయితే తనకు బాధలులేవా... బోలెడు. తనలో తనే బాధపడేవాడు. ఎందుకని... ప్రతిఘటించే ధైర్యం లేక. ధైర్యానికి అతనికి ఆమడ దూరం. ఆ ధైర్యం లేకపోవడంవల్లనే తిప్పలన్నీ తనే కోరి తెచ్చుకున్నాడు. చిన్నప్పటినుండి అంతే...

చిన్నప్పుడొకసారి ఆ ఊరి తిరునాళ్ళలో వీధిలో నాటకం జరుగుతుంది. ఇంట్లోవాళ్ళ అందరూ వెళుతుంటే తనూ వస్తానన్నాడు. అదసలే పౌరాణిక నాటకం... నీకు అర్థంకాదు. అని నాన్న... మేము వచ్చేవరకు నాన్నమ్మదగ్గర పడుకొమ్మని అన్నయ్య చెప్పి వెళ్ళిపోయారు. నిజమేననుకున్నాడు. కానీ అర్థం చేసుకుంటానని చెప్పలేదు. రేపో, మాపో చావడానికి సిద్ధంగా ఉన్న నాన్నమ్మ ప్రక్కలో పడుకున్నాడేగాని నిద్ర రావడంలేదు. మాటి మాటికి తుమ్ములు.. దగ్గులు... రొచ్చు వాసన. తలుపు చప్పుడైతే చాలు. ఓరేయ్ చూడరా... అని అతన్ని లేపి నిద్ర రానీయకుండా చేస్తుంది నాన్నమ్మ బాధగా ఉంది. అయినా అక్కడనుండి లేచి గదిలో పడుకుందామనే ఆలోచన రాలేదు.

ఇలా ఆలోచించకపోవడం ఈ ఒక్కసారే కాదు. ప్రతీ విషయంలోనూ అంతే. స్వంతగా ఆలోచించి ఏ నిర్ణయమూ తీసుకునే తత్త్వం కాదు బలరామయ్యది. అందరి మంచి చెడ్డలు కనుక్కొని ఒక నిర్ణయానికి రావాలి. మంచిదే. కానీ తనకంటూ కొన్ని సొంత విషయాలుంటాయి. వాటికోసమైనా ఆలోచించవచ్చు కదా ... ఈ అమాయకత్వం, మంచితనమే అతని సొంత నిర్ణయాలకు విలువలేకుండా చేసాయి ఆ ఇంట్లో.

పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. కాబోయే భార్య అందంగా ఉండాలి. చదువుకున్నదై ఉండాలి. అనుకున్నాడు. అనుకోవడంలో తప్పు లేదు.

"ఒరేయ్ ..అమలాపురం సోమసుందరంగారి అమ్మాయిని చూసాం. బాగుంది. నీకివ్వాలనుకుంటున్నారు" అని నాన్న చెప్పినప్పుడు అమ్మాయి చదువుకుందా అని నోరు విడిచి అడిగాడు.

"ఎందుకురా అమ్మాయికి చదువు. నీతోపాటు ఉద్యోగం చెయ్యాలా ?"

నిజమేననుకున్నాడు. చాకలి పద్దులు, ఉత్తరాలు వ్రాయగలదట. పోనీలే అనుకుని సర్దిపెట్టుకున్నాడు.

స్వరాజ్యలక్ష్మి భార్యగ వచ్చింది.

అప్పటికి స్వరాజ్యం రాలేదు దేశానికి. సోమసుందరం దేశానికి స్వాతంత్ర్యం కావాలని పోరాడుతున్నరోజుల్లో అడపాదడపా జైలుకెళ్ళినాడు. అప్పుడు అమ్మాయి పుట్టిందని స్వరాజ్యలక్ష్మి అని పేరు పెట్టాడట.

దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. ఆడవాళ్ళకు

మ న వి

డాక్టర్ సలహాలు, ప్రశ్నావళి శీర్షికలకి ప్రశ్నలు పంపేవారు తాము పంపే శీర్షిక పేరు రాసి కేరాఫ్ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగర్, వి జ య వా డ — 520 003 అన్న చిరునామాకి పంపాలి. రాసిన వారి పూర్తి పేరు, చిరునామా యివ్వడం ఎంతైనా అవసరం. —సం.

కూడా రాలేదు. ఆడవాళ్ళను వంటింట్లోను, పడగ్గదిలోను ఉంచేవారు. ఇంట్లో ఏం జరగాలన్నా, జరుగుతున్నా మగవారే నిర్ణయాలు తీసుకుని తర్వాతే ఆడవాళ్ళకు చెప్పేవారు. ఆటువంటప్పుడు కూడా అధికారం చెలాయించే వాడుకాదు బలరామయ్య. అధికారం చెలాయించడమంటే భయం. అధికారానికి అతనికి అంత దూరం.

వంకాయ కూరలో ములక్కాడలు వేసి వండు అని ఒ క్క సా ర ం టే "ఎందుకండి దూబరా ... రెండు కూరలు వేరు వేరుగా వండితే రెండు పూటలు వస్తాయి" అని స్వరాజ్యలక్ష్మి అంటే అలాగా అని ఊరుకున్నాడే తప్ప తనకిష్టమైన వంకాయ, ములగకాడ కూర వండించుకుని తినలేకపోయాడు.

స్వరాజ్యలక్ష్మి వరుసగానలుగురమ్మాయిలను, అబ్బాయిని కన్నది. అమ్మాయికి అమ్మాయికి మధ్య అమ్మాయిలకు అబ్బాయికి దూరం. అమ్మాయిలు పె ళ్లి కె ది గే స రి కి దేశానికి స్వాతంత్ర్యం, మగవాళ్ల రేట్లు, సి ని మా లు, షికార్లు, పుకార్లు అన్నీ వచ్చేసాయి. ధరలు, బస్సులు, రైళ్ళు, ఆఫీసుల్లో ఫైళ్ళు అన్నీ పెరిగిపోయాయి. ఫైళ్ళు చేతులు మారాలన్నా, ఫైళ్లలోని కాగితాల మీద కలం పడాలన్నా రేట్లు వచ్చేసాయి. సీటు ఉండాలన్నా, సీటు పెరగాలన్నా, రేటున్న సీటుకు స్టిక్కరవ్వాలన్నా కాకాలు, బాకాలు కూడా అమలులోకి వచ్చాయి.

ఇన్ని మార్పులు, చేర్పులు, వింతలు, విడ్డూరాలు లోకంలో జరిగిపోతున్నా బలరామయ్య మాత్రం నిజాయితి అనే కుర్చీలోనే కూలబడి ఉన్నాడు. లెగవయ్యా బాబూ...కాస్తంత కళ్లు తెరు...జేబులు నింపు ... బాగుపడతావ్ ... అని అప్పుడే ఆ విషయంలో లోకజ్ఞానం సంపాదించి సంపాదన మొదలుపెట్టిన వాళ్లు పోరుపెట్టారు. అయినా చలించలేదు. అవినీతికి అతనికి అంత దూరం.

అమ్మాయిలు ఎదిగారు...తన వాటా ఆస్తి అమ్మి ఇద్దరమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసాడు. మిగిలిన ఇద్దరమ్మాయిల పెళ్లిళ్ళు, అబ్బాయి చదువు రోజులు మారేకొలది బరువుగా తోచింది.

"ఏవండీ ... కాస్త మీరు మారండి ... నాలుగుడబ్బులు సంపాదిస్తే పిల్లలకు మిగిల్చిన వాళ్లవుతారు."

చదువురాని, నోటంటే మాటలే రాని, వంటింట్లోంచి బయటకు కదలని స్వరాజ్యలక్ష్మి అలా అడిగేసరికి ... అహ ... ఎంత మహిమ ... ఏమిటి ఈ మార్పు ... అలా అనుకున్నాడే గాని చలించలేదు బలరామయ్య.

"మీరు నీతి, న్యాయమంటూ మడి కట్టుకుని కూర్చున్నారు. అందరిలా మీరు సంపాదిస్తే నేను డాక్టరయ్యేవాడిని."

బ్రతుకు తెరువు

ఆనాడెప్పుడో
కడుపు నిండక
కాలక్షేపానికి
చేసిన "భజన"
ఈనాడు
చాలామందికి
గ్రాసయోగ్యమైంది !
అందుకే అంటారు
నేర్చుకున్నదేది
వృధాకాదని
పెద్దల మాట
చద్దన్నం మూటని !

— మాధవరపు కృష్ణ

కొడుకు విరుచుకు పడ్డాడు. అందరూ అన్నిరకాలుగా హితబోధ చేసినా తన మార్గమేదో, తనకేది సమ్మతమైందో అలాగే నడుచుకుంటాను తప్ప వక్రమార్గంలోకి వెళ్లను ... అని గట్టిగా చెప్పాలనుకున్నాడు...చెప్పలేకపోయాడు. చెప్తితే తనను అసమర్థుడని ఎక్కడ హేళన చేస్తారేమోనని అతని భయం.

ఆ సమర్థత అతనికి చాలా దూరం.

బలరామయ్య అసమర్థతను ఇంట్లోనే కాదు బయటవాళ్ళు కూడా ఎత్తిపొడిచేవారు. అయితే అతని సమర్థతను, మంచితనాన్ని, నీతినిజాయితీని అంచనా వేసేవారు కాదు. ఎవరెక్కువ తింటే వాడే బలవంతుడన్న రోజులవి.

బలరామయ్య ఎలాగో కొడుకును డిగ్రీ చదివించాడు.

అమ్మాయిల పెళ్ళిళ్ళు... కొడుక్కి ఉద్యోగం... కోడలు రావడం జరిగాయి.

ఆ సమయంలోనే స్వరాజ్యలక్ష్మి జబ్బుపడి మంచం ఎక్కింది. ఖరీదైన మందులు అతనికి దూరం... కొడుకు జీతానికి కోడలు ఖర్చులకు ఎక్కడా పొంతన ఉండేది కాదు. అతనికి వచ్చిన జీతం అప్పులవాళ్ళ అసలుకు, వడ్డీలకు సరిపోయేది. కొడుకును అడగలేడు... ఆత్మాభిమానం అడ్డు పడేది.

ఎలాగైతేనేం ఓ డి పో యా డు భార్య విషయంలో. గెలుపుకు అతనికి అంత దూరం. అది ఎప్పుడో గ్రహించాడు. అందుకే చనిపోయిన భార్య గురించి బాధపడేవాడు కాదు. ఈ బాధల బందీలనుండి విముక్తి కలిగిందనుకున్నాడు.

వయసు పెరిగింది. భార్య పోయింది. రిటైరయ్యాడు. చీటికిమాటికి చిరాకుపడడం అలవాటయింది. ఆవిడే ఉంటే ఇతని తిట్లను, చిరాకును ఓపిగ్గా భరించేదేమో... కానీ ఆవిడ అదృష్టవంతురాలైంది. ఇంట్లో కోడలు... కూతురు కాదు కదా వాటిని భరించి అతనికి సపర్యలు చేయడానికి.

ఇప్పుడనిపిస్తుంది బలరామయ్యకు తను వయసులో ఉన్నప్పుడు అందిరిలాగ ఎందుకు ఉండలేదా అని. ఏం లాభం... అంతా అయిపోయింది.

అతనికి అన్నీ దూరంగా ఉండేవి... ఏవీ దగ్గరకు వచ్చేవికాదు. నాటి దగ్గరకు వెళ్ళాలనే ప్రయత్నం కూడా చేయలేదు. అందుకే అవి అతనికి అందకుండా దూరంగా వెళ్ళిపోయాయి.

* * *

గతంలోంచి వాస్తవానికి వచ్చాడు బలరామయ్య.

కొడుకు, కోడలు, పిల్లలు అందరూ సెకండ్ షో సినిమాకు బయలుదేరుతున్నారు కాబోలు హడావిడిగా ఉన్నారు.

సినిమా చూసి చాలా రోజులైంది. కొడుకు బయటకు వస్తే ఆ మాటే చెప్పాడు.

"ఈ వయసులో సెకండ్‌షో సినిమా లేమిటి. కళ్ళు జబ్బులు వస్తాయి."

అది కోడలు సమాధానం.

రోజా వెళుతున్నానా... ఒకసారి చూడగానే కళ్ళు పోతాయా ... ఒళ్ళు మండింది. అయినా గట్టిగ అడగలేదు తనను కూడా తీసుకెళ్ళమని. వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒక కోరిక పుట్టింది బలరామయ్యకు.

ఏవీ తినకూడదని కోడలు చెప్పింది. డాక్టరు చెప్పినవి కొన్ని, కోడలు కల్పించినవి మరికొన్ని. ఏది ఏమైతేనేం చప్పిడి మెతుకులు తప్ప రుచి కరమైన పదార్థాలు ఏవీ నోట్లో పడడం లేదు.

అన్నీ తినాలి... వంటింట్లోకి వెళ్ళాడు.

పాలగిన్నె కనిపించింది. స్టౌ వెలిగించాడు కాఫీ కలుపుకుందామని.

పిల్లలకోసం అప్పుడప్పుడు కోడలు జిలేబి, కారంపూస చేసి డబ్బాల్లో పెట్టడం చూసాడు. అల్మారాలోని డబ్బాలన్ని వెదికాడు. ఒక్కటీ కనిపించలేదు.

నిరాశ కలిగింది. పిల్లలు పాడు చేస్తారని అవన్నీ తీసి కోడలు బెడ్‌రూంలోని ట్రంకు పెట్టెలో ఉంచి తాళాం వేసిందన్న సంగతి బలరామయ్యకు తెలియదు.

అన్నీ తినాలనుకున్నాడు ... ఏవీ అందుబాటులో లేవు.

చిరాగ్గా ఉంది... ఆ చిరాకులో పాలగిన్నె తన్నేసాడు. పాలన్నీ నేల పాలయ్యాయి. పంచదార కలుపుకుని తియ్యతియ్యగా కాఫీ త్రాగాలన్న కోరిక కూడా తీరలేదు.

ఉసూరుమంటూ వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

నిద్ర రావడం లేదు.

వయసు మళ్ళిం తర్వాత సుఖమైన నిద్రకు కూడా నోచుకోలేదు. అన్నీ తనకు కాకుండా దూరంగా పోతున్నాయన్న బాధ.

చివరకు నిద్ర కూడా అతనికి దూరమే.

హాస్పిటలు బెడ్‌మీద ఉన్నాడు బలరామయ్య. నాలుగు రోజుల క్రితం వరండాలో కాలు జారి పడిన బలరామయ్య మంచంమీదే ఉండిపోయాడు. అంతవరకూ అతనిలో దాగి ఉన్న జబ్బులన్నీ బయటకు వచ్చాయి.

డాక్టరు అతన్ని బ్రతికించాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. చివరకు ప్రయత్నం ఫలించలేదన్నట్లుగ పెదవి విరిచాడు.

ఆఖరి ప్రయత్నం కూడా చేసాడు.

ఇంకొక గంటలో తెలివొస్తే గండం గడిచినట్టే.

డాక్టరు కొడుకుతో అంటున్న మాటలు వినిపించాయి బలరామయ్యకు.

ఈ గంట గడిస్తే... వీల్లేదు... ఈగంట దాటకూడదు. ఈ గంటలో అంతవరకు అతనికి దూరంగా వున్న మృత్యువు దగ్గరకు వస్తుంది. రావాలి... అదేకాదు... తనకిన్నాళ్ళూ ఏవేవీ దూరమయ్యాయో అవన్నీ తిరిగి రావాలి... సాధ్యమా...

గడచిన కాలంలో దూరమైన వాటిని దగ్గరకు తీసుకోవాలనుకోవడం తెలివితక్కువ తనమే... అవి తిరిగి రానివి... బాధగా ఉంది.

కనీసం ఈ చివరి ఘడియలలో తన కిష్టమైన పదార్థాలు తినాలి... చిన్న కోరిక... ఇంతకంటె మరేవీ దగ్గరకు రావని తెలుసు.

కొడుకు, కోడలను చూసాడు.

"నాకు అన్నీ తినాలని ఉంది." అతి కష్టంగా వచ్చాయి మాటలు బలరామయ్య నోట్లోంచి.

కొడుకు డాక్టరువైపు ఆశ్చర్యంగాచూసాడు.

డాక్టరుకు తెలుసు బలరామయ్య మనస్తత్వం. చాలాసార్లు బలరామయ్య డాక్టరుతో అనేవాడు... చిన్నప్పటి నుండి తన కోరికలు, ఆలోచనలు, నిర్ణయాలు తనకు దూరంగా ఉన్నాయి. ఏ ఒక్కటి దగ్గరకు తీసుకోలేని అసమర్థత నాలో పెరుగుతూ వస్తుంది. వయసయింతర్వాత ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను తనెంత పొరపాటు చేసాను అని. కనీసం మృత్యువు కూడా నేను కోరుకున్న సమయానికి నాదగ్గరకు రావాలి. అది తన దగ్గరకు వస్తుందని తెలియాలి.

డాక్టరు బలరామయ్య కొడుకును బయటకు పంపించాడు.

కొడుకు పది నిముషాల్లో వచ్చాడు. స్వీట్లు, హాట్లు, ఫ్లాస్కులో కాఫీ టేబిలుమీద ఉంచాడు.

బలరామయ్య కళ్ళు తృప్తిగా మెరిసాయి. చుట్టూ చూసాడు. కొడుకు,కోడలు,కూతుళ్ళు, అల్లుళ్ళు అందరూ కన్నీటితో చూస్తున్నారు.

బలరామయ్య చేతులు చాచాడు.

అంతే..

బలరామయ్యకు ఇప్పుడు డాక్టరు, కొడుకు, కోడలు ఇంకా టేబిలుమీదున్న స్వీట్లుగాని కనిపించడంలేదు.

"నాకేం కనిపించడంలేదు" అరవాలనుకున్నాడు. కానీ నోట్లోంచి మాటలు రాలేదు.

అతని చేతులు ఆ పదార్థాలదగ్గర ఆగిపోయాయి.

అవి తనదగ్గరకు రాలేదనీ...

అందరూ గొల్లుమన్నారని కాని...

తెలియదు బలరామయ్యకు.

అన్నీ దూరమైనా అతను కోరుకునే మృత్యువు అతను కోరుకునే టైముకే వచ్చిందన్న సంగతి కూడా తెలియదు.

ఎలా తెలుస్తుంది..?

అప్పటికే ఆ దూరాన్ని అధిగమించి అక్కడకే చేరుకున్నాడు. ★

వంటలు



బీట్‌రూట్ సలాడ్

కావలసిన వస్తువులు :— బీట్‌రూట్స్–2, పచ్చిమిరపకాయలు – 2, సన్నగా తరిగిన అల్లం ముక్కలు, తరిగిన కొత్తిమీర–1 కట్ట, కోరిన కొబ్బరి–1 కప్పు, ఆవాలు – ఒక టీ స్పూన్, ఎండుమిరపకాయలు–2, నిమ్మకాయ–1.

తయారుచేసే విధానం :— బీట్‌రూట్స్‌ని కడిగి చెక్కుతీసి, సన్నగా కోరామతో కోరుకోవాలి. ఈ కోరిన బీట్‌రూట్‌లో సన్నగా తరిగిన అల్లం, పచ్చిమిరపకాయలు, కొత్తిమీర, కోరిన కొబ్బరి, తగినంత ఉప్పువేసి కలియబెట్టాలి. తరువాత రెండు మూడు ఎండుమిరపకాయలు, ఆవాలు పోపులో వేసి ఆ పోపు సలాడ్‌లో వేసి, పోపు వాసన పోకుండా మూతబెట్టాలి. భోజనానికి ముందుగా నిమ్మకాయరసం పిండి,గుండ్రంగా తరిగిన ఉల్లిపాయ,టమోటాలతో సర్వ్ చేయాలి.

– ఎస్. వత్సల

మంగళూర్ చంచం

కావల్సిన సామాన్లు :— కారట్ తురుము–2½ కప్పులు, కొబ్బరికాయ – ఒకటి, జీడిపలుకులు – 15, బొంబాయిరవ్వ – 1 కప్పు, యాలక గుంశ, చక్కెర – 3½ కప్పులు.

తయారు చేయు విధానము .— కొబ్బరికాయను కొట్టి తురుముకొని రోటిలో వేసి, కొద్దిగా నీరుపోస్తూ రుబ్బాలి. అలా రుబ్బగా వచ్చిన పాలు చిక్కనివి ఒక గిన్నెలోకి పిండుకోవాలి. మొత్తం చిక్కని పాలు 2 కప్పులు వస్తే చాలు. మందపాటి పాత్రలో కారట్ తురుము, రవ్వ, చెక్కరలను వేసి కొబ్బరిపాలతో బాగా కలిపి, సన్న సెగపై యుగర నివ్వాలి. పాకం కుదుట పడి బుసబుస లాడుతుండగా ఏలకిపొడి వేసి కలియదీసి నెయ్యి రాసిన కంచంలో పోసి 'డైమండ్స్'లా కోసి, ప్రతి ముక్కపై జీడిపలుకులను గుచ్చాలి. ఇవి ఆకర్షణీయంగా, రుచిగా ఉంటాయి.

– వల్లిశ్రీ నాగరాజ్ ★

ఆరోగ్యమే మహాభాగ్యము

అలసటా? వృద్ధాప్యపు లక్షణాలా? ఆకర్షణ వంతంకాని శరీరమా? ఆల్కహాల్ కలిగించిన దుష్ఫలితాలా? వీటితో బాధపడుతున్నారా? అయితే అందుకు మీ సమాధానం **జీవన్‌టోన్** మీ ముఖ్యమైన సమస్యకోసం ప్రత్యేకంగా రూపొందించ బడినది. 20వ శతాబ్దం యొక్క అద్భుతమైన టానిక్. **జీవన్‌టోన్** సమర్థవంతంగా పనిచేస్తుం దని ప్రజలు ఎందుకు భావిస్తున్నారంటే ఇది జంతు వుల క్రొవ్వుతో కూడినట్టిది. అంతేకాదు. అందులో ఇమడగల ప్రత్యేక మిశ్రమ పదార్థాలు మరియు ఔషధాలు కలిగి వుండడమే **జీవన్‌టోన్** గుణము. అంతేకాకుండా ఈ టానిక్‌ను ఏ సమయంలోనైనా, ఎటువంటి వాతావరణంలోనైనా, అన్ని వయసుల ప్రజలు మరియు స్త్రీ, పురుషులు తీసుకొనవచ్చును. ఎటువంటి ఆహార నియమాలు అవసరంలేదు.



Trade Mark

Mfg Lic No AUS 59/75

అయితే కావలసిన బరువు మరియు లావు వచ్చిన అనంతరం వెంటనే **జీవన్‌టోన్** తీసుకొనడం నిలిపివేయాలన్న విషయాన్ని గుర్తుంచుకోండి.

శరీర సౌష్ఠవం, బలం, శక్తికోసం ప్రత్యేకంగా **జీవన్‌టోన్** తీసుకోండి.

ధర: 454 గ్రాములు 25 రూపాయలు.

గ్యాస్ట్రికో:

వాయువు (గ్యాస్), వాయు సంబంధమైన ఇతర వ్యాధుల నివారణకు తీసుకోండి **గ్యాస్ట్రికో**.

నూరు క్యాప్సెల్స్ — రూ. 25-00

ప్రముఖమైన మందులషాపులన్నిటిలోనూ యివి లభిస్తాయి.

డిస్ట్రిబ్యూటర్ల చిరునామా	జిల్లా
హైదరాబాదు: 12, బాలాజీ కెమికల్ వర్క్సు బావలా బిల్డింగ్, బేగంబజార్,	హైదరాబాద్
విశాఖపట్నం-2: ధవళ మెడికల్స్, 29-2-14 జడ్జికోర్టు జంక్షన్, ప్రకాశరావుపేట	విశాఖపట్నం మరియు శ్రీకాకుళం
విజయవాడ: రియల్ కెమిస్ట్స్, పార్కురోడ్డు	కృష్ణా, గుంటూరు తూర్పు మరియు పశ్చిమగోదావరి
నిజామాబాద్: గంధిమెడికల్‌హాల్, పిక్చర్ పేలస్ ఎదుట	నిజామాబాద్ కరీంనగర్ & ఆదిలాబాద్
అనంతపూర్: శివశంకర్ మెడికల్ ఏజన్సీస్ రైల్వే స్టేషన్ వద్ద	అనంతపురం చిత్తూరు, కడప
వరంగల్: ది ఆల్ ఇండియా పాపులర్ డ్రగ్‌హౌస్ దుర్గేశ్వర టెంపుల్ స్ట్రీట్, జె. పి. ఎన్. రోడ్డు	వరంగల్, ఖమ్మం మెదక్ & నల్గొండ

డిస్ట్రిబ్యూటర్ల చిరునామా	జిల్లా
కర్నూలు: వరాన్ మెడికల్ ఏజన్సీస్, 1-9 బొక్‌బజార్,	కర్నూలు, మహబూబ్‌నగర్

ఏజన్సీలు

హైదరాబాద్: వసంత మెడికల్ స్టోర్స్ 4-4-293 ఎ, కోటి బ్యాంక్‌రోడ్డు

సికిందరాబాద్: శారదా స్టోర్స్, 3106, రాష్ట్రపతిరోడ్

విశాఖపట్నం: నీలం అండ్ కంపెనీ, ఎ. వి. ఎన్. కాలేజిరోడ్డు

గుంటూరు-1: అంజనేయ మెడికల్ స్టోర్స్, ఐ. సి. సి. బిల్డింగ్ వద్ద ట్రంకురోడ్డు

నెల్లూరు: కె. ఎన్. రావు అండ్ సన్సు, ట్రంకురోడ్డు

నెల్లూరు: ది మెడికల్ స్టోర్స్, ట్రంకురోడ్డు

శ్రీకాకుళం: రాజేశ్వరీ ఏజన్సీస్, చిన్నబజారు

ఇతర వివరాలకు సంప్రదించండి.

మెస్సర్స్: జీవన్‌టోన్ ప్రొడక్ట్సు

పి. బి. 880, 17/2, కేమ్‌బ్రిడ్జి రోడ్డు,

బెంగుళూరు-560 008 ఫోన్: 568240

అసలు రహస్యం !

వెస్ట్ జర్మనీ నార్త్ రైన్ వెస్ట్ ఫాలియాలో 1970లో కారు దారి దోపిడీలను తట్టుకోలేక వో జట్టును (పోలీస్ స్క్వాడ్) నియమించి, ఆ జట్టును రాత్ అనే ఆయనను చీఫ్‌గా వేసిందట ప్రభుత్వం. చాలామంది కారు దొంగలు పట్టుబడ్డారట. దోపిడీ దొంగలు దొరికారట. కానీ యీ ముఠాకు నాయకుం డెవ్వడన్న విషయంమీద స్క్వాడ్ చీఫ్ మిస్టర్ రాత్ ఏ రిపోర్టూ సమర్పించలేదట. ఏమిటీ వింతని ఆరాలు దీస్తే ఆ దోపిడి ముఠా నాయకుడూ, మిస్టర్ రాత్ యిరువురూ చిన్న నాటి మిత్రులట — ఎ ఫ్రెండిన్ నీడ్..ఆవటాని.. వోర్నీ.

బావమరది పైశాచిక ప్రవర్తన !

నాగర్ కోవిల్‌కు చెందిన 33 ఏళ్ళ షణ్ముగం తన చెల్లెలు సెల్విని వో రబ్బరుతోట అధిపతి కొడుకు 27 ఏళ్ళ చంద్రశేఖరుకిచ్చి పెళ్ళిచేస్తే ఆతడామెతో కాపురంచేయక ఆమెకు భరణంగా కొంత ఆస్తినిరాసి, పొమ్మన్నాడట. ఈ ఆస్తి అమ్మే హక్కు తమకు యివ్వలేదన్న కోపంతో షణ్ముగం వో కత్తి తీసుకుని నేరుగా వారి వూరు కొచ్చూరుపాలై కుతొమ్మిదోతేదీ రాత్రి వెళ్ళి,రోడ్డులో ఎదురైన తనచెల్లెలు మామగారు 5౫ఏళ్ళ గోపాలాపిళ్ళైను, ఆయనతోవున్న ఆయ విద్దరికొడుకులు 23 ఏళ్ళ విజయన్ను, 20ఏళ్ళ రవిని పొడిచి చంపి, పరుగున వారింటికి వెళ్ళి తన చెల్లెలు భర్త చంద్రశేఖరును, ఆతని తల్లి భగవతిని, ఆతని చెల్లెళ్ళు 23 ఏళ్ళ శశికళను, 22 ఏళ్ళ తులసిని, 8 ఏళ్ళ సతీష్ (చంద్రశేఖరు మేనల్లుడు)ను కూడా కసకస పొడిచేశాడట. వీరిలో చంద్రశేఖరు ఆసుపత్రిలో చనిపోయాడట. మిగిలినవారి స్థితి మధ్యస్థంగా వుందట. ఇంతకూ షణ్ముగం మిలిటరీలో పని చేసిన వ్యక్తి అట.

బల్లగుద్దితే భవనం కూలడానికి కారణం ?!

అమెరికన్ ప్రెసిడెంట్ రోనాల్డ్ రీగను వైట్ హవుస్‌లో సంయుక్త కాంగ్రెసు సభల నుద్దేశించి మాట్లాడి, చివరకు భావయుక్తంగా బల్లగుద్ది చెప్పేసరికి ఆ భవనం మొదటి అంతస్థులోని 16 అంగుళుల విభాగం ఒకటి భళ్ళున కూలి ధనేల్న పడిపోయిందట. చూపరులుగా మారిన శ్రోతలకిది అత్యద్భుత విపరీత విడ్డూరంగా తోచి, యీయనగారు గుద్దిన బల్ల వూపుకు యిది పడిందా, లేక ఆ బల్ల గుద్ది చెప్పిన విషయమో, విధానమో నచ్చకనా అని తమ సందేహాన్ని సంతోషంగా వెలిబుచ్చారట.

గుడి తలుపులకి కరెంటు !

మద్రాసు కొత్వాలసావడి (కూరగాయలూ వగైరాలు టోకుగా అమ్మే చోటు) అణ్ణాపిళ్ళె వీధి మొగనున్న వినాయకుని గుడికి రత్నం అనే 40 ఏళ్ళాయన మొన్న 10వ తేదీ వుదయం దైవదర్శనార్థం వెళ్ళారుట. ఆ చిన్నకోవెల యినుప తలుపులు వేసివుండడం వల్ల చేత్తో తోసేసరికి వో విద్యుద్ఘాతంతో మొయ్యోమనరిచి, ఎవరో విసిరేసినట్టు దూరానికి ఎగిరిపడి, అదేచోట చనిపోయాడట. ఆ యినుప తలుపులకు అకారణంగా ఏదో కరెంటు తీగ తగలడంవల్ల అందులో ఎక్కువ శక్తితో కరెంటు ప్రవహిస్తోందట, ఈ రత్నం దురదృష్టం.

చదువు కోసం అమ్మాయి ఆత్మహత్యా ప్రయత్నం !

తిరునల్వేలికి చెందిన కల్లడైకురిచ్చిలో శంకరప్పరెడ్డియార్ అనే ఆయన కొడుకు 16 ఏళ్ళ రాజా యస్సెస్సెల్సీ పరీక్షలో ఫెయిలయి నందుకు వస్తున్న రైలుకు ఎదురు పరుగెట్టి దాని క్రిందపడి, ఆత్మహత్య చేసుకున్నాడట. తిరునల్వేలికి చెందిన 17 ఏళ్ళ లక్ష్మి అనే అమ్మాయి ప్లస్‌టూ పరీక్షలో ప్యాసయినా, తన అమ్మమ్మ చదివించే స్తోమతలేక యిహ చదువు కట్టిపెట్టి ఏదైనా పని దొరుకుతుందేమో చూసుకో అని అన్నదని, గాజు పెంకులు నూరి, నీళ్ళల్లో కలుపుకు తాగేసిందట. ఈమెను తిరునల్వేలి ప్రభుత్వ ఆసుపత్రి రక్షించిందట.



తీగెమీద నడవడంలో ప్రపంచ రికార్డు !

ఫ్లోరిడాలో స్టీవ్ వాలెన్టా అనే వో మహనీయుడు వో వైరుమీద అటూ యిటూ నడుస్తూ 3809 మీటర్ల దూరాన్ని క్రింద పడకుండా పూర్తిచేశాడట. ఈయన యీ దూరాన్ని వో వంద ట్రిప్పులు ఆ వైరుమీద వో పక్కనుంచి మరో చివరవరకూ నడిచాడట. ఇది ప్రపంచ ప్రథమ రికార్డుట.

ప్రకటనలోని ఆంతర్యం ?

ఫ్రాన్సుకు చెందిన రోవిన్‌లో వో లక్షాధిపతి పత్రికా ముఖంగా వో విన్నపం చేసుకున్నాడట. అందులో తనకున్న యావదాస్తి పెట్టి వో అచ్చుమిషనుకొని, సెటప్‌చేసినట్టూ, దానికి పని వారికివ్వాల్సిన రోజు కూలీ డబ్బులుకూడా చేతులో లేనందువల్ల అంత పెద్ద ప్రెస్సూ అఘోరిస్తున్నట్టూ ప్రకటించాడట. ఈ ప్రకటన చదివిన ప్రభుత్వం యిలా అవరాదని, అసలీ ప్రెస్‌కు ఎంత ధనసహాయం చేయవచ్చునో చూతమని ఆ మిషనులూ, బ్లాకులూ చూసి, కొయ్యబారి పోయారట. డబ్బునోట్లూ, ప్రభుత్వ అధికారుల ఐడెంటిటి కార్డులూ, బ్యాంకు చెక్కు పుస్తకాలు రెడీగా వున్నాయట — మనోళ్ళే నయం. ఇలాటివి గుట్టుగా చేసుకుంటారు.

కలియుగ బకాసురుడు !

ఆఫ్రికా మౌలి అనే ప్రాంతానికి చెందిన బాబా వయారా అనే పదిహేనేళ్ల కుర్రాడు తినే తిండికి ఆతని తండ్రి తట్టుకోలేక బయటికి గెంటేశాడట. ఆ కుర్రాడా వయస్సులో పది కిలోల బియ్యంతో వండిన అన్నంలో వో గొర్రె మాంసంతో వండిన వంటకం కలుపుకుని జుర్రు బుర్రున తినేసి, మరింతన్నంవేసే; వులుపోయ్ అంటాడట. వొకసారి యీతడు వో ఎద్దును సొంతం వండితే రెండ్రోజుల్లో సునాయాసంగా తినేసి పళ్ళు కుట్టు పుల్లతో పళ్ళు కుట్టు కుంటూ పెరట్లో కూర్చుని రాత్రికి వంటే మిటని వాకబు చేశాడట.

84 రోజులు స్పృహలేకుండా ఉండి ప్రసవించి కన్నుమూసిన స్త్రీ !

వర్జీనియాకు చెందిన ఒక గర్భిణి ఒక ప్రమాదంలో తలకు దెబ్బతగిలి స్పృహతప్పి పోయిందట. రోంక్ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగ విజ్ఞానులు ఆమెకు కృత్రిమ శ్వాస కల్పించి, మనిషి నిర్జీవంగా పడివున్నా, లోపలి పిండాన్ని 84 రోజులు ఆ తల్లి గర్భంలోనే పెంచి, చివరికి జూలై అయిదవ తేదీన సిసేరియన్‌గా బయటకు తీశారట. పిల్ల 1.7 కిలోల బరువున్నదట. ఈ పిల్ల పుట్టిన 25 నిముషాలలో తల్లి చనిపోయిందట. ★

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

తెలుగు విశ్వవిద్యాలయం :

తమిళనాడులో తమిళ విశ్వవిద్యాలయం, ఉత్తరాపథంలో హిందీ విశ్వవిద్యాలయం, కాశీలో సంస్కృత విశ్వవిద్యాలయం వున్నట్టు తెలుగు నాట ఒక తెలుగు విశ్వవిద్యాలయం నెలకొల్పడానికి ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు నిర్ణయించడం, తమ నిర్ణయానుగుణంగా నాలుగు విశ్వవిద్యాలయాల వైస్‌చాన్సలర్లు శ్రీయుతులు ఆవుల సాంబశివరావు (ఆంధ్ర), భద్రిరాజు కృష్ణమూర్తి (ఉస్మానియా), జి. రామిరెడ్డి (ఓపెన్), టి. వాసుదేవ (కాకతీయ), టి. దొణప్ప (నాగార్జున) సభ్యులుగా ప్రత్యేక సంఘాన్ని ఏర్పరచి, డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తిని ప్రతేకాధికారిగా నియమించడం సంతోషించదగింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి శ్రీ రామారావు జులై 25న రాష్ట్ర విశ్వవిద్యాలయోపాధ్యకుల సమావేశంలో తెలిపారు. ఈ విశ్వవిద్యాలయం స్నాతకోత్తరణ పరిశోధన స్థాయిలో వుంటుంది. దీనిలో మూడు విభాగాలుంటాయి. (1) ఆర్ష విభాగం—దీనిలో శ్రుతి స్మృత్యాది ఆర్ష విజ్ఞాన పరిశోధన, (2) సంస్కృత విభాగం — దీనిలో సంస్కృత ప్రాకృత సారస్వతాదుల పరిశోధన, (3) తెలుగు విభాగం — దీనిలో తెలుగు సాహిత్య సంస్కృతుల అధ్యయన పరిశోధనలు జరుగుతాయి. సమగ్రమైన నిఘంటు నిర్మాణం, బృహత్తర గ్రంథాలయం, ప్రాచీన గ్రంథ ప్రచురణ మున్నగు కార్యకలాపాలతో ఈ విశ్వవిద్యాలయం తెలుగు సంస్కృతి వికాసానికి ముఖ్య కేంద్రం కావాలని తన అభిలాష అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ విషయంలో నాదొక చిన్న సూచన. రాష్ట్రంలో ప్రత్యేకంగా తెలుగు అభివృద్ధికోసం స్థాపించిన సంస్థలు కొన్ని ఉన్నాయి. తెలుగు అకాడెమీ, అంతర్జాతీయ తెలుగు సంస్థ వంటివి. వాటికి విడిగా పత్రికలూ వున్నాయి. తెలుగు అకాడెమీ తెలుగు శబ్దసాగరమనే బృహన్నిఘంటు నిర్మాణంకూడ తలపెట్టింది. ఈ రెండు సంస్థలలోను ప్రాచీన నవీన సారస్వతంలో అపార కృషిచేసి అనుభవం గడించిన డాక్టర్ శివరామ మూర్తి, డాక్టర్ ముదిగొండ వీరభద్రశాస్త్రి, డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ, డాక్టర్ అకిరాజు రమాపతిరావు వంటి విద్వాంసులున్నారు. తెలుగు భాషా సమితి మరొక గొప్ప సంస్థ. అది తెలుగు విజ్ఞాన సర్వస్వం ప్రచురిస్తున్నది. దాని నిర్వాహకులు శ్రీ యార్లగడ్డ ఆంజనేయులు, సంపాదకులు మహా విద్వాంసులు శ్రీ చీమకుర్తి శేషగిరిరావు వంటివారున్నారు. ఈ మూడు సంస్థలను సిబ్బందితోసహా తెలుగు విశ్వవిద్యాలయానికి బీజప్రాయంగా తీసుకోవచ్చు. ఈ సంస్థల గ్రంథాలయాలు, తక్కిన సాధన సంపత్తి నూతన విశ్వవిద్యాలయానికి వినియోగిస్తుంది. ఇది స్నాతకోత్తరణ పరిశోధనాధ్యయిన విశ్వవిద్యాలయమే గనుక బస్సుల, సమ్మెల రొదకు దూరంగా ఉండే ప్రశాంత నగరేతర ప్రాంతంలో నెలకొల్పడం బాగు.

వర్ధమాన నర్తకి పద్మ :

కళాప్రపూర్ణులు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు అన్నట్టు అందం, అభినయ కౌశలం లక్ష్మీ సరస్వతుల వంటివి నర్తకులకు. ఈ రెండింటికీ ఆటపట్టయినది వర్ధమాన నర్తకి కుమారి చింతపల్లి పద్మ. పద్మ సుప్రసిద్ధ సారస్వతోపాసకులు శ్రీ అబ్బూరి రామకృష్ణారావు దౌహిత్రి. ఇంజనీరు శ్రీ సి. వి. ఆర్. మూర్తి పుత్రి. సెయింట్ జార్జ్స్ గర్ల్స్ గ్రామర్‌స్కూలులో 12 వ తరగతి విద్యార్థిని. సుప్రసిద్ధ నర్తకి శ్రీమతి సుమతీ కౌశక్ శిష్యురాలు — (75 వ శిష్యురాలు.) కుమారి పద్మ జులై 22 వ రంగాధిరోహణ సందర్భంగా రవీంద్రభారతిలో ప్రదర్శించిన నృత్యం ఆమె కళాకౌశలానికి నిదర్శనమేకాక, ఉజ్జ్వలభవిష్యత్తుకు సూచనగాను వుంది. సభావందనం తర్వాత ఆమె దశరథ నరకుమారుడవై అనే రామ పట్టాభిషేక శబ్దాన్ని కూచిపూడి సంప్రదాయంలోను, మాతేమల యాచలపాండ్య సుజాతే అనే దరువును కృష్ణానీ బేగబారో అనే పదాన్ని భరతనాట్య సంప్రదాయంలోను చక్కగా అభినయించారు. రెండు సంప్రదాయాలలోను ఆమెకున్న కౌశలం, ప్రేక్షకులను ఆనందపరచింది. పిదప పద్మ తమ నాట్యాచార్య శ్రీమతి సుమతీ కౌశక్‌ను సన్మానించింది. సన్మానానికి అధ్యక్షత వహించిన శ్రీ అక్కినేని నాగేశ్వరరావు పద్మను ఆశీర్వదిస్తూ, సన్మానం ఎంత అదృష్టమో ఆశీర్వదించడమూ అంత అదృష్టమని, అన్నిటికీ ఆఖరు మెట్టు వున్నది కాని కళకు ఆఖరుమెట్టు లేదని అన్నారు. పద్మ చదువుతున్న సెయింట్ జార్జ్స్ గర్ల్స్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాలు శ్రీమతి బి. సి. విజయం, శ్రీ ఎ. ఆర్. కృష్ణ, శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు పద్మను ఆశీర్వదించారు. శ్రీ రజనీకాంతారావు సిద్ధేంద్రయోగి అన్నమాచార్యులకన్నా ముందువాడని చెప్పడానికి నానాబాధ పడ్డారు తమ ప్రసంగంలో. అన్నమాచార్యులు, వసుచరిత్రకారుడైన రామరాజ భూషణుడు నర్తకీ వర్ణనకు సిద్ధేంద్రయోగి నాటకాలను కాపీకొట్టవలసిన అవసరం లేదు. రాయలసీమలో హరిహరుని కాలంలోనే బయలు నాటకాలు ప్రసిద్ధంగా వున్నాయి. సంస్కృత నాటకాల ప్రదర్శనం గురించి చెప్పనక్కరలేదు. ఇంతకూ ఈ ప్రాచీనత్వపు పిచ్చి మనకెందుకు? జాతి ముందుకు పోవడానికి ప్రాచీన వైభవం కంటె నవీనత్వపు నయగారమే ముఖ్యం. నిజానికి ప్రాచీన వైభవం సంకీర్తనమాత్ర పర్యవసానం మన వెన్ను మనం తట్టుకోడానికే, కనుక మేధావులు ప్రతిదాన్ని వెనక్కు లాగడానికికాక జాతిని ముందుకు తోయడానికి ప్రయత్నించడం శ్రేయస్కరం. శ్రీమతి ఛాయాదేవి ప్రయోక్త్రగా వ్యవహరించారు.

ఆత్మనివేదన ముద్రలో కుమారి చింతపల్లి పద్మ



శ్రీ వంశీ రామరాజుకు సత్కారం :

'రసమయి' సాహితీ సంస్థ జులై 22న నారాయణ గూడ తాజ్‌మహల్ హోటలులో శ్రీ వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ప్రధాన కార్యదర్శి శ్రీ రామరాజును సత్కరించింది. సత్కార సభకు మాజీమంత్రి శ్రీ ఇ. అయ్యపురెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీ రామరాజు వంశీ సంస్థను మేటి సంస్థగా మలిచారని, ఉత్తర అమెరికా తెలుగు సభలకు వెళ్లడం ఆయన



హైదరాబాద్ నోట్ బుక్

కార్యదీక్షకు నిదర్శనమని శ్రీ రెడ్డి అన్నారు. శ్రీ ఎం. వి. నారాయణరావు ప్రసంగిస్తూ, విదేశాలలో తెలుగు సంస్కృతి ప్రచారానికి రామరాజు దీక్షను ప్రశంసించారు. సాంస్కృతికశాఖ మాజీ డైరెక్టర్ శ్రీ జె.వి. సోమయాజులు ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ కల్చరల్ ట్రస్ట్ నెలకొల్పాలని రామరాజు సూచనను బలపరచారు. రసమయి పక్షాన రామరాజుకు ఒక జ్ఞాపికను బహూకరించారు. శ్రీ యుతులు గుడిపూడి శ్రీహరి, డాక్టర్ ఆనందారామం, డాక్టర్ వాసా ప్రభావతి, యం. బి. కె. బి. ప్రసాదరావు, ఇరువెంటి కృష్ణమూర్తి, ఎం. వి. సుబ్బారావు ప్రసంగించారు. శ్రీ రామరాజు ధన్యవాదాలు తెలుపుతూ, ఆ నాల్గవ ఉత్తర అమెరికా తెలుగుసభల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు తాను ప్రారంభోత్సవం చేశానని, అమెరికాలో స్థిరపడ్డ తెలుగు కళాకారులను ఏటా భారతదేశానికి పిలిపించి ప్రోత్సహించాలని అన్నారు. వాషింగ్టన్‌లో శ్రీమతి యార్లగడ్డ కిమీర అధ్యక్షతన, చికాగోలో శ్రీ రామచంద్రరావు హబీబు అధ్యక్షులుగా వంశీశాఖలు ప్రారంభించానని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కల్చరల్ ట్రస్టు శ్రీ ఇ. అయ్యపురెడ్డి అధ్యక్షులుగా, శ్రీ ఎం. వి. నారాయణరావు చెయిర్మన్‌గా, శ్రీ ఎం. వి. సుబ్బారావు కోశాధికారిగా ఏర్పడిందని ప్రకటించారు. ఈ సమావేశంలో శ్రీమతి తెన్నేటి సుధాదేవి 'వినిపించని వేదన' కథల సంపుటిని డాక్టర్ సుధాకిశోర్ ఆవిష్కరించారు. శ్రీ ఎం. కె. రావు ధన్యవాదాలతో సమావేశం సమాప్తమయింది.

ఉపశ్రుతి :

ఆయన ఎవరు సార్ ? అనడిగాడు నన్ను రవీంద్రభారతిలో ఒక ప్రేక్షకుడు శ్రీ అబ్బూరి వరదరాజేశ్వరరావును చూచి. వరద మహా మేధావి, శ్రీ రామకృష్ణరావుగారి కుమారుడు — అని అన్నాను. ఆయన వెంట ఉన్న ఆయన ?— అని మరొక ప్రశ్న వేశాడు ప్రేక్షకుడు. ఈ అవాంతరానికి విసుక్కున్న మరో ప్రేక్షకుడు "బురద. వరద వెంట ఏముంటుంది బురదకాక!" అన్నాడు. అంటే ? — అన్నాడు మొదటి ప్రేక్షకుడు మొండిగా. బుద్ధవరపు రామదాసు. నాట్యం చూడక ఇదేం గోలయ్యా !— అంటూ విరుచుకు పడ్డాడు రెండవ ప్రేక్షకుడు మా ఇద్దరిమీద.*

ప్రయోగాత్మకమే !

‘అతడు అడవిని జయించాడు’ ఆసక్తితో చదివాను. డాక్టర్ కేశవరెడ్డిగారు ఈ నవలలో సైతం ఒక అపూర్వ ప్రయోగాత్మక సంవిధానాన్ని ప్రవేశపెట్టారు. గతంలో మీరు ప్రచురించిన వారి నవల ‘ఇన్‌క్రెడిబుల్ గాడెస్’ విమర్శకుల పరిశీలనలకు పాత్రమై ఒక అవిస్మరణీయ సంఘటనగా రూపొందింది. అందువల్లనే యీ నవలను సైతం శ్రద్ధగా ధారావాహికలో చదవడం సంభవించింది.

‘అతడు అడవిని జయించాడు’ అనే శీర్షిక ననుసరించి, అరణ్యాల అంచులో నికృష్టంగా బ్రతుకుతూ ప్రకృతి దుశ్శక్తులతోనూ, అమానుష శక్తులతోనూ సదా పోరాడుతున్న ఆదివాసుల జీవిత వృత్తాన్ని ఆవిష్కరిస్తారేమోనని సహజంగానే ఆశించాను. తీరా చదవనారంభించేసరికి ఇన్‌క్రెడిబుల్ గాడెస్ నవలవలెనే ఈ కొత్త నవల కూడా ‘‘వరాహ పురాణాన్నే’’ ఆవిష్కరించడం చూసి ఆశ్చర్యపోయాను. అది పఠనోత్సాహాన్ని తగ్గించలేదు. పైగా మరింతగా నిశితంగా పరిశీలించడానికే ఉత్సుకత కలిగించింది. పీడిత లోకంపట్ల సహానుభూతిగల ప్రగతిశీల రచయిత ప్రతివాడూ దాదాపు ప్రొలిటేరియన్ రచయితగా భావింపబడే అవకాశముంటుంది. తాను తీసుకున్న ఇతివృత్తం పట్ల శ్రద్ధాసక్తులతో పరిశీలించి, పీడితలోక జీవితేతివృత్తాలను ఆవిష్కరించవలసి ఉంటుంది. ఆ జీవితం బహు విశాలమైనదీ, బృహత్తర వైవిధ్య భరితమైనదీ నన్న సత్యం మరువరానిది. ముఖ్యంగా మన బడుగు దేశంలో ఈ వైవిధ్యం మరీ అపారమైనది. అట్టి వైవిధ్య భరిత జీవితాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించే రచయితకు ఇతివృత్తం పట్ల ఫిక్సేషన్సుగాని, ఆత్మాశ్రయ ధోరణులుగాని ఉండడం ఉత్తమగుణంగా భాసించదు. కనకనే మళ్ళీ ఇన్‌క్రెడిబుల్ గాడెస్ మాదిరిగానే పందులవాళ్ల యితివృత్తమే ఇందులో రిపీట్ కావడం ఒక బలహీనతగా కనిపించినందువల్లనే ప్రారంభంలో ‘వరాహ పురాణం’గా పేర్కొనడం జరిగింది.

ఈ నవల రచనా సంవిధానంలో వాస్తవికతావాదంకన్న, యదార్థవాదం (నేచురాలిజం) అధికతర ప్రాధాన్యత వహించి ఒకే అంశం చుట్టూ పరిభ్రమిస్తూ దానికే గాఢముద్ర కలిగించే ప్రయత్నం బుద్ధిపూర్వకమే అనిపిస్తుంది. ఈ నేచురాలిజం చేపట్టిన ఎమిలీజోలా ప్రభృతులతోనే పంధొమ్మిదో శతాబ్ది నడిమి కాలానికే కాలదోషంపట్టి పోయింది.

పంధొమ్మిదో శతాబ్ది ఉత్తరార్థంలో వాస్తవికతావాదం సమాజ వాస్తవికతావాదంగానూ, మాక్సీమ్ గోర్కీ మహాశయుని చేతులలో ఇరవయ్యో శతాబ్ది ఆరంభం నుంచీ సామ్యవాద వాస్తవికతగానూ రూపొంది పురోభివృద్ధి

ఉత్తరాలు

[4వ పేజీ తరువాయి]

గాంచడం విజ్ఞులెరుగనిదికాదు. అందుకే డాక్టర్ కేశవరెడ్డిగారి కొత్త నవల ‘అతడు అడవిని...’ నవ్య ప్రయోగమే తప్ప భవ్యపరితార్థంగా నేను భావించలేకపోతున్నాను. కారణాలు వివరిస్తాను.

ప్రారంభ ప్రకరణం ఉత్సుకతకలిగిస్తుంది. నవల ఆద్యంతమూ పఠనోత్సుకతతో సాగుతుందని చెప్పడం, చేయి తిరిగిన రచయితకూ మేధావికీ ఒక గొప్ప కితాబు కాదు. అలాగే రచన నిర్దుష్టంగానూ, సాఫీగానూ ఉందనీ,మాండలీక పారిభాషిక పదాల విషయంలో రచయిత వహించిన జాగరూకత ప్రశంసనీయంగా ఉన్నదనీ చెప్పడం సైతం కొత్తగా చెప్పవలసిన ఉత్కర్షలు కావు.

పాత్ర ఏ సంస్కార స్థాయిలోని దయితే ఆ సంస్కార స్థాయిలోనే, ఆ పాత్రకు జీవితం నేర్పిన అనుభవ స్థాయిలోనే, ఆ పాత్రకు అలవడిన భాషలోనే ఆ పాత్ర ఆలోచనలు సాగుతాయి. ఎవడి ఆలోచనలైనా భాషావిరహితంగా సాగగలవంటె శాస్త్రజ్ఞానం అంగీకరించదు. ఒకడు ఏ భాషలోపుట్టి పెరిగాడో ఆభాషా పరంగానే స్వప్నాలుగాని, ఆలోచనలుగాని వస్తాయని శాస్త్రవేత్తలు చెప్పారనే నమ్మనక్కరలేదు. మన అనుభవాన్నే పరిశీలించుకోవచ్చు. సత్యమిదై ఉండగా, పందుల ముసలివానిభాష ముఖ్యంగాఅతని స్వగతాలో ఆలోచనలో తెలిపే భాష ఆ ముసలివాడి స్థాయిని మించి రచయిత సంస్కార స్థాయికి చేరుకోవడం హర్షించ తగింది కాదు. దానికి ఉదాహరణలు ఆద్యంతమూ కొల్లలుగా యివ్వగలను. పాఠకుల సౌకర్యం కోసం కొన్నే ఉదాహరణమిస్తాను.

1) ‘‘అడవి నిగూఢమైనది. అంతు చిక్కని రహస్యాలు ఇక్కడ చాలా ఉన్నాయి — అనుకున్నాడు ముసలివాడు.’’ (27–5–83 తేదీగల సంచిక, 5వ భాగం 2వ కాలంలో)

2) ‘‘నాకు కరతలామలకం !’’ అనుకున్నాడు పందుల ముసలివాడు ... ‘‘కర్తవ్య నిర్వహణకు కలగవచ్చు’’నని ఆ ముసలాడు స్వగతంలో చెప్పుకుంటాడు. (అదే సంచిక 6వ భాగంలో) ఈ మాటలతో ఆలోచించే ముసలాడు విద్వాంసుడే అయితీరతాడు. విద్వాంసుడే అయితే పందులను మేపుకుంటూ బ్రతకడానికి ససేమిరా అంగీకరించడు. పాత్రకీ పాత్ర భాషకీ యింత వైరుధ్యం ఉండటం రసభంగమే !

3) ‘‘స్వామి తలుచుకుంటే నాకు చుక్కపంది ఉనికిని తెలియచేయగలడు’’ (3–6–83 తేదీగల సంచిక 2వ కాలంలో) ‘‘స్వామి దర్శన మిస్తాడు ... వరాలిస్తాడు’’ అన్నంతవరకూ సాగిన చాదస్తమంతా మధ్యతరగతి సంస్కారం నుంచి ఊడిపడ్డదే ! లంపెన్ ప్రొలిటేరియన్‌కు ఆ ప్రసక్తి కలిగేది కాదు.


4) ‘‘నేను భ్రమిస్తున్నానేమో ? అయిష్టమైన సంభవం భ్రాంతిగ్గానూ, ప్రీతిపాత్రమైన భ్రాంతి సంభవంగానూ మానవుడికి తోచడం కద్దు !’’ అని మళ్ళీ అనుకున్నాడు. (3వ కాలం 3వ పేరాలో) ఈ స్వగతం అసంగత్యానికీ అవాస్తవికతకీ పరాకాష్ఠ !

ముసలివాడి బ్రతుకుకీ, వాడి వృత్తికీ, వాడి సంస్కారానికీ — వాడు స్వగతంలో అనుకున్నాడని రచయిత వ్రాసిన మాటలకీ ఎక్కడా పొంతన కుదరదు. రచయిత తనదైన ఉత్తమ భావనను అస్థానపతితం చేసుకోవడం — జుగుప్సావహంగానూ, దిగ్భ్రాంతికరంగానూ తయారై రసభంగం కావించింది. ఏ రచయితకైనా తాను సృజించుతున్న పాత్రల సంస్కారం పట్ల పూర్తి చైతన్యం ఉండితీరాలి. ఇది నవలా రచయితకు ప్రాథమికావసరం. ఈ అవసరాన్ని గుర్తించక పోవడంవల్ల కాశీవిశ్వనాథవారు తమ నవలలన్నింటా తమకు బోలిన మహా విద్వాంసులనే — సొరెలోంచి తీసిన మృణ్మయ పాత్రలవంటి పాత్రలుగా వెలువరించారు.

ఉదాహరణగా నాలుగు స్వగతాలనీయడం జరిగిందే తప్ప — అతడు అడవిని జయించాడు అనే ఈ నవలలో ఆద్యంతమూ నికృష్ట పాత్రకు ఉత్తమ భాషాపరమైన ఆలోచనలే చిత్రితమయ్యాయి. గుండె నీళ్ళయిపోయి అన్వేషణ ఆపేశాను. 17-6-83 తేదీ గల సంచికలో (పు. 50, భాగం 16) ‘‘నాగరకుడైన ఒక మానవుని సుఖదుఃఖాలు ఒక మొరటు జంతువుపై ఆధారపడి ఉండటం ఎంత విచిత్రం ?’’ వగైరా ముసలివాని ఆలోచనలుగా

ఉస్మానియా విశ్వవిద్యాలయంనించి ‘శివపురాణానుశీలనము’ గ్రంథానికి సంస్కృతంలో పిహెచ్.డి. తీసుకున్న వరంగల్లు శ్రీ దుర్గేశ్వర మహిళా సంస్కృతాంధ్ర కళాశాల ప్రిన్సిపల్ శ్రీ అత్తలూరి మృత్యుంజయశర్మ.





ఉత్తరాలు

చెప్పబడిన స్వగతాలు మొత్తానికి నవలను "నానా విధాలయిన వైరుధ్యాలతో నిండి"పోవడానికే సహకరించాయి. ఇంతవరకూ అమంలితమైన ఇతివృత్తాన్ని తీసుకుని నవల రచించడానికి ఉత్సాహపడిన రచయిత మరింత బాధ్యతా యుతంగానూ, మరింత నిశిత పరిశీలనతోనూ పాత్రలను సన్నివేశాలనూ పరిశీలించకపోతే మేలు కన్న – సాహిత్యానికీ జీవితానికీ సైతం. కీడే ఎక్కువగా లభించగలదన్న బాధతో ఈ లేఖ వ్రాస్తున్నాను.

సోమసుందర్ ఆవత్స (పిఠాపురం)

అతడు అడవిని జయించాడు

కేశవరెడ్డిగారి సీరియల్ "అతడు అడవిని జయించాడు" చాలా బాగుంది. ముసలివాని ద్వారా తెల్పిన వేదాంతం, నన్ను ఎంతగానో ఆకట్టు కొంది. ముసలివాడు అమాయకత్వం ఆత్మ విశ్వాసంతో అడివిని జయించగల్గాడు.

బత్తుల వసంతధనలక్ష్మి (భీమవరం)

కోరుకున్న సంతానం

29–7–83 నాటి సంచికలో కోరుకున్న సంతానం (28వ పేజీ) అన్న అంశంలో ఎక్స్ క్రోమోజోములవలన మగపిల్లలు, వై క్రోమోజో ములవలన ఆడపిల్లలు జన్మిస్తారని తెలియ చేశారు. కాని వాస్తవానికి శాస్త్రరీత్యా ఎక్స్ క్రోమోజోములవలన ఆడపిల్లలు; వై క్రోమోజో ములువలన మగపిల్లలు జన్మిస్తారు. జన్యుశాస్త్ర రీత్యా "ఎక్స్ ఎక్స్" – ఆడపిల్లలుకును, "ఎక్స్ వై" మగపిల్లల పుట్టుకకును కారణ భూతములని తెలియుచున్నది.

సతీష్ (జమ్మలమడుగు)

"ఆనందం"

8–7–83 నాటి "ఆంధ్రసచిత్ర వార పత్రిక" ముఖచిత్రం తిరుపతి బ్రహ్మోత్స వాలలో వజ్ర కిరీటుడైన కలియుగదైవం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి చిత్రం వేసినారు. నేను ఆ చిత్రాన్ని చూచి చాల ఆనందించినాను.

ఆర్. దివాకర్ (బోథ్)

మేలు కొలుపు

జయదుభాషీగారి 'న్యాఢిల్లీ లేఖ' కోసరం వారం వారం నేను తప్పనిసరిగా పత్రిక చూస్తు న్నాను, అది నిజంగా మేలు కొలుపు !

ఎ. రాజయ్య (రేపల్లి)

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3 Editor S. Radhakrishna

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VA.. PATR

